ఈనాడు
హైదరాబాద్
HMDA
శనివారం అక్టోబరు 19, 2024



దత్తత తీసుకొని.. అక్కున చేర్చుకొని

జూబ్లీహిల్స్‌లోని బ్లూక్రాస్ కార్యాలయంలో శుక్రవారం పెంపుడు జంతువుల దత్తత కార్యక్రమం నిర్వహించారు. జంతు ప్రేమికులు తమకు కావాల్సిన వాటిని ఎంపిక చేసుకొని తమతోపాటు తీసుకెళ్లారు. గాయపడిన శునకాలకు సిబ్బంది చికిత్స అందించారు.

- న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

మియాపూర్‌లో చిరుత కలకలం

మెట్రో స్టేషన్ సమీపంలో కనిపించినట్లు వీడియోలు



మియాపూర్: మియాపూర్‌లో చిరుత సంచారం కలకలం రేపింది. మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలోని నిర్మాణంలో ఉన్న ఓ సంస్థకు సంబంధించిన కూలీలు తమకు చిరుత పులి కనిపించిందంటూ వీడియోలు తీసి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు రంగంలోకి దిగి ప్రజలను అప్రమత్తం చేశారు. ఆ వీడియో తీసినట్లు చెబుతున్న కూలీలను మియాపూర్ సీఐ క్రాంతికుమార్ విచారించారు. తాము చూశామని వారు సీఐకి వివరించడంతో ఆయన అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. మెట్రోకు సమీపంలో నడిగడ్డ, సుభాష్ చంద్రబోస్ నగర్ తండాలతోపాటు పలు నిర్మాణ సంస్థల కార్మికుల క్యాంపులు ఉండడంతో మియాపూర్ పోలీసులు కార్మికులతోపాటు వారి యాజమాన్యాలను సైతం అప్రమత్తం చేశారు. అటవీ శాఖ అధికారులు పాదముద్రలను పరిశీలిస్తేనే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

అదిరే రుచి.. నాణ్యత ఛీ..ఛీ



- చెట్నీస్ హోటల్‌లో బొద్దింకలు, కుళ్లిన కూరగాయలు
- ప్రకాశ్‌నగర్‌లో గుట్టలుగా కుళ్లిన కోడి మాంసం ప్యాకెట్లు
- తనిఖీలయ్యాక చేతులు కలుపుతోన్న కొందరు అధికారులు

ఈనాడు, హైదరాబాద్: నగరంలో ఆహార కల్తీ తీవ్రమైంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ బృందం, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కల్తీ కేంద్రాలపై వరుసగా దాడులు చేస్తున్నప్పటికీ.. కొందరు యజమానులు వైఖరి మార్చుకోవట్లేదు. కుళ్లిన మాంసం, కూరగాయలను వంటలకు ఉపయోగిస్తున్నారు. వంట గదులను మరుగుదొడ్డిలా నిర్వహిస్తున్నారు. తుప్పు పట్టిన పాత్రల్లో ఆహారం తయారు చేసి ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. జీహెచ్‌ఎంసీ ఆరోగ్య విభాగంలోని కొందరు అధికారుల తీరు అందుకు ప్రధాన కారణం. యాజమాన్యాలతో కుమ్మక్కై ప్రయోగశాల నివేదికలను తొక్కిపెడుతున్నారనే విమర్శలొస్తున్నాయి.

కందిపప్పులో బొద్దింకలు..



కొండాపూర్ శరత్ సిటీ మాల్‌లోని చెట్నీస్ హోటల్‌లో శుక్రవారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టింది. "కంది పప్పు డ్రమ్ములో బొద్దింకలున్నాయి. గోధుమపిండి, రవ్వకు పురుగులు పట్టి నల్లగా మారాయి. ఫినాయిల్ డబ్బాలను కిరాణ సరకులను ఒకే చోట నిల్వ చేశారు. ఉల్లిపాయలు, క్యాబేజీ గడ్డలు పూర్తిగా కుళ్లాయి"అని టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. అదే మాల్‌లోని అల్పాహార్ టిఫిన్స్ కేంద్రంలో.. మూతల్లేని చెత్త డబ్బాలు, ఇతర లోపాలు గుర్తించారు.

బయట తినాలంటేనే..

తీరిక లేని నగర జీవనంలో.. మెజార్టీ నగరవాసులు సమయానికి ఇంట్లో తినలేని పరిస్థితులు ఉన్నాయి. దగ్గర్లోని హోటల్‌లో లేదా రెస్టారెంట్లలో తిని రోజు గడుపుతుంటారు. అవసరాన్ని ఆసరాగా తీసుకుంటున్న యాజమాన్యాలు.. నాసిరకం సరకులతో, అపరిశుభ్రత, అనారోగ్యకర వాతావరణంలో వంటలను తయారు చేస్తున్నారు. **టాస్క్‌ఫోర్స్ బృందాలు ఇటీవల దాదాపు 500ల చోట్ల తనిఖీలు చేయగా, 90శాతం కేంద్రాల్లో లోపాలు బయటపడటమే అందుకు నిదర్శనం.** దాంతో.. నగరవాసులు బయట తినాలంటే వణికిపోతున్నారు.

జీహెచ్‌ఎంసీ చేతివాటం..

రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం రోజూ హోటళ్లలో తనిఖీ చేస్తోంది. ఓ రోజు తర్వాత లోపాలను 'ఎక్స్' వేదికగా వెల్లడిస్తోంది. 20 మంది ఆహార భద్రతాధికారులు ఉన్న జీహెచ్‌ఎంసీ మాత్రం.. ఏడాదికో, ఆర్నెల్లకో తనిఖీ నివేదికలను ప్రకటిస్తోంది. ఏ రోజు ఏ హోటల్‌ను తనిఖీ చేశారనే విషయాన్ని కనీసం నెలకోసారి కూడా చెప్పట్లేదు. పైగా.. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసిన హోటళ్ల యజమానులతో కొందరు బల్దియా ఫుడ్ఇన్‌స్పెక్టర్లు చేతులు కలుపుతున్నారని, అందుకే ల్యాబ్ పరీక్షల నివేదికలను బయటపెట్టడం లేదని వాపోతున్నారు.





చౌరస్తాల్లో సుందరీకరణ పనులకు బల్దియా కార్యాచరణ

కూడళ్లు మెరవాలి.. నగరం మురవాలి

ఈనాడు, హైదరాబాద్: నగర వాతావరణం ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే పైవంతెనలు, విభాగినులకు రంగులద్దే కార్యక్రమం మొదలైంది. పైవంతెనల కింద ఖాళీస్థలాన్ని పార్కులుగా తీర్చిదిద్దుతున్నారు. పలు కూడళ్లలో రంగురంగుల విద్యుద్దీప కాంతులతో ఆకట్టుకునేలా ఫౌంటెయిన్లను అభివృద్ధి చేయనున్నారు.

కొత్త ఆకృతులతో.. గచ్చిబౌలి ఓఆర్ఆర్ వద్ద బస్టాప్, శేరిలింగంపల్లి జోన్‌లో అన్నపూర్ణ భోజన కేంద్రాలు, కొత్తగూడ పైవంతెన కింద మహిళా శక్తి క్యాంటీన్, ఐకియా కూడలిలో పబ్లిక్ ప్లాజా నిర్మాణానికి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం డిజైన్లు రూపొందిస్తోంది.

పాత వాటిపైనా దృష్టిపెట్టాలి

- అబిడ్స్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం ముందున్న నెహ్రూ కూడలిలో పొడవైన ఫౌంటెయిన్‌ను నిర్మించనున్నారు. నెహ్రూ విగ్రహాన్ని మరింత ప్రకాశింపజేసేలా విద్యుద్దీపాలను ఏర్పాటుచేసి.. కూడలిని విస్తరించి తొమ్మిది ఫౌంటెయిన్లు ఏర్పాటు చేయాలన్నది ప్రణాళిక. తపాలాశాఖ కార్యాలయాన్ని ప్రతిబింబించే పోస్టు బాక్సు నమూనాఏర్పాటు చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు.
- నారాయణగూడ కూడలిలో మార్కెట్ వైపున్న విభాగినిపై, ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ కూడలి, సచివాలయం ఎదురుగా, లక్డీకపూల్ కూడలిలోనూ ఈ తరహా నిర్మాణాలు చేపట్టనున్నట్టు జీహెచ్‌ఎంసీ చెబుతోంది. చార్మినార్ గుల్జార్ హౌజ్ కూడలి, ఇతరత్రా ప్రాంతాల్లోని ఫౌంటెయిన్లను పునరుద్ధరించాలని, చారిత్రక కట్టడాలు, రద్దీ ప్రాంతాల్లో మరిన్ని నిర్మించాలని నగరవాసులు కోరుతున్నారు.

పరిమితికి మించి.. ముప్పు పొంచి



సరిగ్గా ఇద్దరు కూర్చోలేని ఆటోలో బండెడు సామగ్రిని వేసి తీసుకెళ్తున్న దృశ్యం హయత్‌నగర్‌లో కనిపించింది. ఏ ఒక్క సామాను కిందపడినా వెనక వచ్చే వాహనదారుల ప్రాణాలకు ముప్పే. నగరంలో పట్టపగలు పరిమితికి మించిన లోడ్‌తో దర్జాగా వెళ్తున్న వాహనాలు.. ఇతరుల పాలిట మృత్యు శకటాలుగా మారుతున్నాయి.

ఇద్దరూ ఓయూ పూర్వ విద్యార్థులే

ఉస్మానియా, తెలుగు విశ్వవిద్యాలయాలకు కొత్త ఉప కులపతులు



ఈనాడు, హైదరాబాద్: ఉస్మానియా వీసీగా ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, తెలుగు వర్సిటీ ఉప కులపతిగా వెలుదండ నిత్యానందరావు బాధ్యతలు స్వీకరించనున్నారు. వీరిద్దరూ ఓయూ పూర్వ విద్యార్థులే. ప్రొ.కుమార్ ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీఈ(సివిల్) పూర్తిచేశారు. నిత్యానందరావు ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ తెలుగు చదువుకున్నారు. ఇద్దరూ ఓయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా వృత్తి జీవితంలో ప్రవేశించారు. ప్రొఫెసర్ కుమార్ ప్రస్తుతం ఓయూలోని పట్టణ, పర్యావరణ ప్రాంతీయ అధ్యయన కేంద్రం సంచాలకులుగా ఉన్నారు. నిత్యానందరావు తెలుగు విభాగం అధ్యక్షుడిగా వ్యవహరించి 2022లో పదవీ విరమణ చేశారు.

ఇక్కడే చదువు.. ఉపకులపతి



ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉప కులపతి **ప్రొఫెసర్ కుమార్** ఉస్మానియా క్యాంపస్‌లో ఇంజినీరింగ్ పూర్తిచేశాక జేఎన్‌టీయూలో ఎంటెక్, ఐఐటీ బాంబేలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. వివిధ ఉద్యోగ అవకాశాలు లభించినా.. తాను చదువుకున్న చోటే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరాలన్న లక్ష్యంతో ఓయూకే ప్రాధాన్యం ఇచ్చారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో విధుల్లో చేరినా, పరిశోధనలవైపు దృష్టి కేంద్రీకరించారు. ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ ట్రాన్స్‌పోర్టేషన్ విభాగం ఏర్పాటుకు కృషిచేశారు. ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంలో చదువుకుని ఉప కులపతిగా బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని ప్రొఫెసర్ కుమార్ తెలిపారు. వర్సిటీ ప్రతిష్ఠను మరింత పెంచేందుకు అందరి సహకారం తీసుకుంటానని వివరించారు.

తెలుగు భాషతో మమేకం



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి, విశ్రాంత ఆచార్యులు **వెలుదండ నిత్యానందరావు** తెలుగు భాషతో మమేకమయ్యారు. ఆయన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులంతా తెలుగు పండితులే. డిగ్రీ చదువుతున్నప్పుడు అన్ని ప్రముఖ పత్రికల్లో నిత్యానందరావు రచనలు ప్రచురితమయ్యాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సహాయ ఆచార్యులుగా విధులు చేపట్టాక తెలుగు భాషపై మరిన్ని పరిశోధనలు చేశారు. విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించారు. 'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన' పేరుతో ఆయన రాసిన గ్రంథం అన్ని విశ్వవిద్యాలయాల తెలుగు శాఖల్లో పరిశోధకులకు, పర్యవేక్షకులకు ప్రామాణిక గ్రంథంగా ఉపయోగపడుతోంది. దేశ పౌరుల్లో భారతీయతను జ్వలింపజేసేలా వందేమాతరం గీతం రాసిన బంకించంద్ర చటర్జీ జీవితంపై రాసిన బంకించంద్ర పుస్తకం లక్షల మందిలో స్ఫూర్తి నింపుతోంది. తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతిగా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని నిత్యానందరావు తెలిపారు.


ప్రైవేటు బస్సులతో ట్రాఫిక్ ఇక్కట్లు!

- నగరంలోకి రాత్రి 10 గంటలకు ముందే ప్రవేశం
- స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైన ట్రాఫిక్ పోలీసులు

ఈనాడు, హైదరాబాద్ : నగరంలోకి నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశిస్తున్న ప్రైవేటు బస్సులు ట్రాఫిక్ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. దీంతో వాటి రాకపోకలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు సిద్ధమయ్యారు. ప్రైవేటు బస్సులు, భారీవాహనాలు రాత్రి 10 గంటల వరకూ నగరంలోకి ప్రవేశించకూడదనే నిబంధన ఉంది. ఈ ఏడాది మొదట్లో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి 320కు పైగా కేసులు నమోదు చేశారు. ఆ తరువాత కొద్దిరోజులు నిబంధనలు పాటించిన ట్రావెల్స్ నిర్వాహకులు ప్రస్తుతం యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి 8-9 గంటల మధ్య నగరంలోకి చేరుతున్నారు. నిబంధనలు పాటించని వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ ఆదేశించారు. రెండ్రోజులు ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్టు తెలిపారు.

నిర్వాసితులకు అన్నివిధాల న్యాయం చేస్తాం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్, న్యూస్‌టుడే, ఖైరతాబాద్: మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి పునరావాసం కల్పించి, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని మంత్రి సీతక్క అన్నారు. ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మూసీ పరివాహక ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక సహాయం అందించారు. 172 మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున రూ.3.44 కోట్ల ఆర్థిక సాయాన్ని మలక్‌పేట్, కార్వాన్ ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ బలాల, కౌసర్ మొహియుద్దీన్, డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డిలతో కలిసి మంత్రి పంపిణీ చేశారు. అందులో రూ.1.40లక్షలు సబ్సిడీగా ఉంటాయని, మిగిలిన రూ.60వేలు మూడేళ్లలో వాయిదాలుగా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. సీతక్క మాట్లాడుతూ.. మూసీ నీటి కారణంగా అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆ నీటిని తాగదగిన స్థాయికి తీసుకురావడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పునరావాస కుటుంబాలకు ఉచిత విద్య, అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రవేశం, రెండు పడక గదుల ఇళ్లు అందించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల మాట్లాడుతూ.. మూసీ పరీవాహకంలో వరదలొస్తే పునరావస కేంద్రాలకు తరలించేవారమని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజ్, మూసీ జేడీఎం గౌతమి, ఈడీ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్యభట్టు తదితరులు పాల్గొన్నారు.



మూసీ పరివాహక ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క. చిత్రంలో ఎమ్మెల్యేలు కౌసర్ మొహియుద్దీన్, అహ్మద్ బలాల, డిప్యూటీ మేయర్ శ్రీలత తదితరులు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కరెంట్ కట్

నిలిచిన రిజిస్ట్రేషన్లు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: నగరంలోని రెడ్‌హిల్స్‌లో ఉన్న హైదరాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భవన యజమాని శుక్రవారం కరెంట్ కట్ చేశారు. ఫ్యూజులు తీసుకొని వెళ్లిపోయారు. కార్యాలయంలో అంధకారం నెలకొంది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఆరు నెలలుగా అద్దె చెల్లించడం లేదని.. కరెంట్ బిల్లు కట్టడం లేదని.. భవనం ఖాళీ చేయాలంటూ యజమాని అధికారులకు సూచించారు. కొంత సేపు కార్యాలయంలో గందరగోళ వాతావరణం నెలకొంది. రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చీకట్లోనే చాలా సేపు వేచి ఉన్నారు. సబ్-రిజిస్ట్రార్ శ్రీనివాస్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని చెప్పడంతో యజమాని విద్యుత్‌ను పునరుద్ధరించారు.



చీకట్లో కార్యాలయం

ఐటీ కారిడార్‌లో అత్యాధునిక వేదిక



ఈఎస్‌సీఐ కన్వెన్షన్ సెంటర్‌లోని ఆడిటోరియం

ఈనాడు, హైదరాబాద్: ఐటీ కారిడార్‌లో సభలు, సమావేశాలకు మరో అధునాతన కన్వెన్షన్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. విశాలమైన ఆడిటోరియం, లెక్చర్, సెమినార్ హాల్స్, కోవర్కింగ్ స్పేస్ వంటి సదుపాయాలతో గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ) ప్రాంగణంలో కొలువుదీరింది. 72వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునికంగా తీర్చిదిద్దారు. 800 సీట్ల సామర్థ్యం కలిగిన ఆడిటోరియం నిర్మించారు. అవుట్‌డోర్, ఇండోర్లలో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు తగ్గ సౌకర్యాలు ఉన్నాయి. ఇందులో కోవర్కింగ్ స్పేస్ కల్పించారు. ఇది కొత్తదనే చెప్పవచ్చు.

మూసీ ప్రక్షాళనలో ముందడుగు

- గోదావరి ఫేజ్-2కు ఈ నెలలోనే టెండర్లు!
- రెండు ప్యాకేజీల కింద చేపట్టే యోచన



ఈనాడు, హైదరాబాద్: విస్తరిస్తున్న మహానగరానికి పుష్కలంగా తాగునీటిని అందించడంతోపాటు మూసీ ప్రక్షాళనకు చేపడుతున్న గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టుకు ఈ నెలలోనే టెండర్లు ఆహ్వానించేందుకు జలమండలి సమాయత్తమవుతోంది. టెండర్ల విధి విధానాల రూపకల్పనలో అధికారులు కసరత్తు చేస్తున్నారు. వారం పది రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు రూ.5,560 కోట్లు కేటాయిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ గతంలో ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ పథకం కింద 15 టీఎంసీల గోదావరి జలాలను మల్లన్నసాగర్ నుంచి తరలించనున్నారు. ఇందులో 10 టీఎంసీలు నగర తాగునీటి అవసరాలకు పోను... మిగతా 5 టీఎంసీలు మూసీ ప్రక్షాళనకు వినియోగించనున్నారు.

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని... ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం వివిధ జలాశయాల నుంచి 560 ఎంజీడీల వరకు సరఫరా చేస్తున్నారు. నగర విస్తరణ నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటికి మరింత డిమాండ్ పెరగనుంది. గోదావరి ఫేజ్-1 ద్వారా ఇప్పటికే ఏటా 10 టీఎంసీలు(రోజుకు 172 ఎంజీడీలు) ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి తరలిస్తున్న సంగతి తెలిసిందే. గోదావరి ఫేజ్-2లో మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను మరో 170 ఎంజీడీలు తరలించనున్నారు.

ఉస్మాన్‌సాగర్‌లోకి ఇలా...

మల్లన్నసాగర్ నుంచి శామీర్‌పేట్ వద్దనున్న ఘన్‌పూర్ వరకు భారీ పైపులు నిర్మిస్తారు. ఇక్కడ నీటిని శుద్ధి చేశాక అక్కడే చేపట్టే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి తరలిస్తారు. అక్కడ నుంచి నగరానికి పంపింగ్ చేస్తారు. ముత్తంగి వద్ద ఇప్పటికే ఉన్న గోదావరి ఫేజ్-1 రింగ్‌మెయిన్లకు అనుసంధానిస్తారు. ఘన్‌పూర్ నుంచి అవుటర్ రింగ్ అవతలి భాగం నుంచి ముత్తంగి, కొల్లూరు, జన్వాడ మీదుగా ఉస్మాన్‌సాగర్ వరకు 58 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మిస్తారు. శుద్ధి చేయని గోదావరి జలాలతో ఉస్మాన్‌సాగర్‌ను నింపి.. అక్కడి నుంచి హిమాయత్‌సాగర్‌కు మరో పైపులైన్ ద్వారా తరలించి... తర్వాత మూసీలోకి విడిచి పెడతారు.

పకడ్బందీగా గ్రూప్-I మెయిన్స్ పరీక్షలు

కలెక్టర్ ఆదేశాలు



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించి.. దిశానిర్దేశం చేశారు. ఈ నెల 21 నుంచి 27 వరకు హైదరాబాద్ జిల్లాలో నిర్వహించనున్న టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష కోసం ఏర్పాటు చేసిన 8కేంద్రాల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీసు బందోబస్తు, పర్యవేక్షణ మధ్య ప్రశ్నాపత్రాలు కేంద్రాలకు చేరుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, కనీస మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. 261 మంది పీడబ్ల్యూడీ అభ్యర్థులకు బేగంపేట ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల 'ఏ'లో కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పర్యవేక్షించాలని చీఫ్ సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. రవాణా ఇబ్బందులు కలగకుండా సకాలంలో ఆర్టీసీ బస్సులు నడపాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఈ. వెంకటాచారి, డీసీపీ ఎన్.భాస్కర్, ఏసీపీ అశోక్‌కుమార్, సీహెచ్ అశోక్ కుమార్, భాస్కర్, ఆర్డీవోలు మహిపాల్‌రెడ్డి, దశరథ్ సింగ్, పరీక్షా నిర్వహణ అధికారులు పాల్గొన్నారు.

కేంద్రాల వద్ద ఆంక్షలు

ఈనాడు, హైదరాబాద్: ఈ నెల 21 నుంచి 27 వరకు జరిగే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు అమల్లో ఉంటాయని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి తెలిపారు. కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఐదుగురు అంతకు మించి గుమికూడటం నిషేధమన్నారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

ప్రజాసేవే భాజపా లక్ష్యం: చింతల


సభ్యత్వ నమోదులో చింతల రామచంద్రారెడ్డి తదితరులు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ప్రజా సేవ, దేశ సమగ్రత భాజపా లక్ష్యమని అందువల్లే వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టిందని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రా రెడ్డి అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఉదయనగర్, రోడ్డు నం.3 జర్నలిస్టు కాలనీ ప్రాంతాల్లో పార్టీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. భాజపా విధానాలను ప్రజలు విశ్వసించడం వల్ల 10 కోట్ల మంది పార్టీ సభ్యత్వం స్వీకరించారని, తెలంగాణలో 20 లక్షలు దాటిందని అన్నారు. భాజపా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి మేచినేని శ్రీనివాసరావు, బీజేవైఎం జాతీయ కార్యదర్శి బద్దం మహీపాల్‌రెడ్డి, నేతలు శ్రవణ్ యాదవ్, చంద్రశేఖర్, ఫణికుమార్, వినయ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్వర నీరాజనం 24న

నారాయణగూడ, న్యూస్‌టుడే: వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా), శారద ఆకునూరి (అమెరికా) ఆధ్వర్యంలో 'మనసా కవ్వించకే నన్నిలా' శీర్షికన సినీ గేయ రచయిత మైలవరపు గోపికి ఈనెల 24న స్వరనీరాజనం సమర్పించనున్నట్లు నిర్వాహకుడు వంశీ రామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. రవీంద్రభారతిలో జరిగే ఈ కార్యక్రమానికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఉప ప్రణాళిక నిధుల దుర్వినియోగంపై కమిషన్ వేయండి

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు రూ.2 లక్షల కోట్ల దుర్వినియోగంపై హైకోర్టు న్యాయమూర్తి చేత విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేర్లతో మాట్లాడుతూ.. గత పదేళ్లలో దళిత జాతుల అభివృద్ధికి కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులు మళ్లించారని, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. దుర్వినియోగం అయిన నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి 2024 అక్టోబరు వరకు నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ కార్యవర్గ సభ్యుడు హనుమంతు, గ్రేటర్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ఉ.10-11: బంజారాహిల్స్ రోడ్డు నం.10, కార్వీ బిల్డింగ్, స్టార్ ఆసుపత్రి, శ్రీ కంచి ప్రాంతాలు. ఉ.10.30-11: జూబ్లీహిల్స్ రోడ్డు నం.36, 39, 40, 41, 42, 43, 44, పాత మాటీవీ కార్యాలయం, న్యాయాద్రి, స్కూల్ ప్రాంతాలు. ఉ.11.30-మ.12: జూబ్లీహిల్స్ రోడ్డు నం. 10బీ, 10ఏ, 25, 33, 34, 35, 36, స్విమ్మింగ్ పూల్, బీఎన్ మల్లిక్ లేన్ ప్రాంతాలు. ఉ.11.30-మ.1: నామ్‌దారి టెంట్‌హౌస్, అజారుద్దీన్ నివాస ప్రాంతం, శ్రీ కంచి శరీన్ ప్రాంతాలు. మ.12-12.30: ఆడి వర్క్‌షాప్ లేన్, రవీంద్ర సొసైటీ నం. 8, 9, 10, 11, కేకే హిల్స్, బీఎం నాయుడు నివాస ప్రాంతం, ఎన్ఎంసీ, హనుమాన్ దేవాలయం, పార్క్ హయత్ వెనక ప్రాంతం. మ.12-1: లుంబిని మాల్, సాగర్ సొసైటీ సిగ్నల్స్, బీబీ పాటిల్ కార్యాలయం, మ్యాంగో ట్రీ ప్రాంతాలు. మ.3-సా.4.30: బంజారాహిల్స్ రోడ్డు నం.7, ఈ-సేవ, మెరిడియన్ స్కూల్, ఒట్టోమన్ బ్యాంక్ ప్రాంతాలు.


నగరాన్ని చెత్తరహితంగా మారుద్దాం

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రత పాటించి నగరాన్ని చెత్తరహితంగా మార్చేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నం.12 లోని ఆమె నివాసం వెనుక ప్రాంతంలో రూ. 17లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెత్తను రోడ్లపై వేయద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డును ప్రారంభించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

ఎలా ఎక్కాలి.. దిగాలి..!

☛ ఎత్తైన కాలిబాటలతో అవస్థలు ☛ ఇబ్బందులు పడుతున్న వృద్ధులు



జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: రహదారుల పక్కన పాదచారులు వెళ్లేందుకు నిర్మించిన కాలిబాటలు ప్రజలకు ఉపయోగం మాట అటుంచితే... వృద్ధులు, చిన్నారులు, మహిళలు వాటిని ఎక్కేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. అసలు కాలిబాట రోడ్డుకు ఎంత ఎత్తులో ఉండాలి అనే విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా బేగంపేట, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో పలుచోట్ల మూడు, నాలుగు అడుగుల ఎత్తులో, ఒక్కోచోట రోడ్డుకు సమాంతరంగా నిర్మిస్తుండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల అసలు కాలిబాటే ఉండని పరిస్థితి ఉంటోంది. దీనిపై బల్దియా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


అభివృద్ధి పనుల పేరిట..

అభివృద్ధి పనుల పేరిట పాత కాలిబాటలను ధ్వంసం చేసి అలాగే వదలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ ఉద్యానవనం చుట్టూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవల జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఉద్యానవనం చుట్టూ చేపట్టిన అభివృద్ధి పనుల్లో కాలిబాటను తవ్వేసి మట్టిని అక్కడే వదిలేశారు. వరుస ఫిర్యాదులతో అరకొర పనులు చేసి చేతులు దులిపేసుకున్నారు.

స్తంభాలు, బస్‌స్టాప్‌లు అక్కడే..

కాలిబాటల్లోనే విద్యుత్తు స్తంభాలు, బస్టాపులు ఉంటున్నాయి. ఫలితంగా నడిచి వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. గతంలో జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలోని జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద, కృష్ణానగర్‌లో ఈ విద్యుత్తు స్తంభాల కారణంగా ఇద్దరు మృతి చెందారు. కొందరు పాదచారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వీడియో తీసి 'ఎక్స్'లో పోస్టు చేసిన సందర్భాలు ఉన్నాయి.

నడిచేందుకు చోటు లేదు: తుమ్మల సత్య, సినీ, టీవీ ఆర్టిస్ట్



నగర రహదారులపై పాదచారులకు భద్రత లేదు. వారు నడిచేందుకు చోటు లేదు. వృద్ధులు ఎత్తైన కాలిబాటలు ఎక్కలేకపోతున్నారు. కొన్నిచోట్ల వాహనదారులు కాలిబాటలపై వెళ్తుండంతో ధ్వంసమవుతున్నాయి. కాలిబాటలను అందరి అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి. ఎలాంటి అడ్డంకులు లేకుండా నడిచి వెళ్లేలా ఉండాలి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

న్యూస్‌టుడే, ఖైరతాబాద్,

? నెల రోజులుగా జర్నలిస్టు కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. ఐదారు నెలలుగా ఎన్ని ఫోన్లు చేసినా స్పందన లేదు. -ఎలమంచిలి సురేష్‌కుమార్, జర్నలిస్టు కాలనీ

? ఆనంద్‌నగర్ కాలనీలోని మసీదు రోడ్డులో రోడ్డు పొడవునా నెల రోజులుగా వెలగడంలేదు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే మూడు రోజుల్లో చేస్తామని చెప్పినా చేయలేదు. – శ్యామ్, ఆనంద్‌నగర్, బాలాజీ అపార్టుమెంట్

✓ లైట్లు అందుబాటులో లేక ఆలస్యమైంది. రెండు చోట్లా శనివారమే దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – కిరణ్మయి, డీఈ, జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్, సుష్మ, ఏఈ, జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్

పీఆర్ఎస్ఐ జాతీయ ఉత్తమ కార్యదర్శిగా యాదగిరి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ సెక్రటరీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దూర విద్యా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కంభంపాటి యాదగిరిని పీఆర్ఎస్ఐ జాతీయ నాయకత్వం జాతీయ ఉత్తమ కార్యదర్శి అవార్డుకి ఎంపిక చేసింది. న్యూదిల్లీలో జరిగిన జాతీయ స్థాయి సదస్సులో దీనిని శుక్రవారం ప్రకటించినట్లు యాదగిరి తెలిపారు.


యాదగిరిని అభినందిస్తున్న శ్రీనివాస రావు, ఎస్.రాము

వాలెట్ పార్కింగ్‌కు ఇస్తే.. ఆభరణాలు మాయం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: వాలెట్ పార్కింగ్‌లో కారు ఇస్తే కారులో అందులో ఉంచిన రూ. 7లక్షలకు పైగా విలువైన ఆభరణాలు మాయమైన ఘటన ఇది. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్టకు చెందిన వై.వి.మూర్తి దంపతులు జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10లోని జామూన్ హోటల్ కారులో వచ్చారు. వాహనంలో దాదాపు 100 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక జత వజ్రపు చెవిపోగులు ఉన్నాయి. కారును వాలెట్ పార్కింగ్‌కు ఇచ్చి భోజనం చేసిన తర్వాత కారు తీసుకొని హిమాయత్‌నగర్ వెళ్లారు. అనంతరం కారులో ఆభరణాలను పరిశీలించగా కనిపించలేదు. తిరిగి హోటల్‌కు వెళ్లి అక్కడున్న వాలెట్ సిబ్బంది రామ్‌కరణ్ యాదవ్, తేజ్‌నారాయణ్ ముఖియా, కుమార్ రాకేష్‌లను ప్రశ్నించారు. తమకు తెలియదని చెప్పడంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: సాయిబాబా ఆలయంలో హుండీ చోరీకి గురైన ఘటన ఇది. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 14 లోని క్యాన్సర్ ఆసుపత్రి ముందు సాయిబాబా ఆలయం ఉంది. నాలుగేళ్లుగా మీర్‌పేట ప్రాంతానికి చెందిన అజయ్‌కృష్ణ అర్చకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 16న పూజల అనంతరం సాయంత్రం వెళ్లిపోయారు. 17న ఉదయం వచ్చి చూడగా ఆలయంలో హుండీ కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణం ముందు కారు నిలిపారని టైర్లు పంక్చర్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: కారు దుకాణం ముందు నిలిపి, మరోచోటికి షాపింగ్‌కు వెళ్లిన మహిళ కారు టైర్లను పంక్చర్ చేసి, బెదిరింపులకు పాల్పడిన ఘటన ఇది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో నివసించే దర్శకుడు సంకల్ప్ రెడ్డి సతీమణి కీర్తిరెడ్డి ఫ్యాషన్ డిజైనర్. బంజారాహిల్స్ రోడ్ నంబరు 10లో ఉన్న ఫ్యాన్సీ స్టోర్‌లలో దుస్తులు కొనుగోలు చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో వాహనాన్ని రంగ్రేజ్ ఫ్యాబ్రిక్ స్టోర్ ముందు నిలిపారు. షాపింగ్ పూర్తి చేసుకొని తిరిగి వచ్చేసరికి రంగ్రేజ్ దుకాణానికి చెందిన సిబ్బంది కారు రెండు టైర్లను పంక్చర్ చేయడమే కాకుండా, టైర్లను ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ విషయాన్ని యజమాని దృష్టికి తీసుకెళ్లగా దురుసుగా వ్యవహరించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల మధ్య వ్యభిచారం.. కేసు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఇళ్లమధ్య గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై మధురానగర్ పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం...జవహర్ నగర్ ప్రాంతంలో ఏపీలోని కృష్ణాజిల్లా నందిగామకు చెందిన ముప్పల జ్యోతి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారంతో గురువారం రాత్రి పోలీసులు దాడిచేశారు. నిర్వాహకురాలు జ్యోతితో పాటు రాజమండ్రికి చెందిన ఓ యువతిని కూకట్‌పల్లికి చెందిన విటుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: విధులకు వెళ్తున్నానని చెప్పిన యువతి అదృశ్యమైన ఘటన ఖైరతాబాద్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రేమ్‌నగర్‌కు చెందిన యువతి బంజారాహిల్స్‌లోని ఓ ఆసుపత్రిలో ఆరునెలలుగా హౌస్‌కీపింగ్ పనులు చేస్తోంది. ఈనెల 15న విధులకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. అన్నిచోట్లా ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఏఎస్ఐ శ్రీరాములు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జూబ్లీహిల్స్ కూడలి.. వెలుగుల లోగిలి

నగర సుందరీకరణలో భాగంగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు కూడలిలో జీహెచ్ఎంసీ వీధి దీపాల విభాగం ఏర్పాటు చేసిన వీధి దీపాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. 'సంగీతంతో ఆనందించు' అనే థీమ్‌తో సంగీత వాయిద్య పరికరాల నమూనాలపై ఈ దీపాలు ఏర్పాటు చేశారు. జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు సర్కిల్ 18 వీధి దీపాల విభాగం వీటిని ఏర్పాటు చేసినట్లు ఏఈ సుష్మ తెలిపారు. – న్యూస్‌టుడే, బంజారాహిల్స్

హెచ్ఎండీఏ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఈనాడు, హైదరాబాద్: బుద్ధపూర్ణిమ ప్రాజెక్ట్ సీనియర్ అసిస్టెంట్ జి.రవీందర్‌రెడ్డిని హెచ్ఎండీఏ కమిషనర్ సస్పెండ్ చేశారు. నకిలీ జీవో సృష్టించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసినందుకు ఆయనపై వేటు వేశారు. అతనిపై గత నెలలోనే సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. తాజాగా సస్పెండ్ చేస్తూ హెచ్ఎండీఏ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

ఉపకార వేతనాలు, బోధన రుసుం విడుదల చేయాలి


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిమాయత్ నగర్: పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతనాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. విద్యారంగ సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే సమీక్ష నిర్వహించి, పరిష్కరించాలని కోరింది. శుక్రవారం సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ వై.జంక్షన్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉన్నా దృష్టిని సారించకపోవడం బాధాకరమన్నారు. మూడు సంవత్సరాలుగా బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తమ కోర్సులు పూర్తి అయినా ధ్రువపత్రాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావాణితో పట్టాదారు పాస్ పుస్తకం వచ్చింది


పట్టాదారు పాస్ పుస్తకాన్ని చూపుతున్న రుక్మిణి, చిత్రంలో దివ్య దేవరాజన్, డా.చిన్నారెడ్డి తదితరులు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంతో అనేక సమస్యలు పరిష్కారం అవుతున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.జి.చిన్నారెడ్డి పేర్కొన్నారు. అనేక పర్యాయాలు అధికారుల చుట్టూ తిరిగి, చివరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారమైందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, ఘట్‌కేసర్ మండలం. ఏదులాబాద్ గ్రామానికి చెందిన రుక్మిణి శుక్రవారం ప్రజాభవన్‌కు వచ్చి సంతోషం వ్యక్తం చేశారు. ధరణి తప్పిదాల వల్ల తన 16 గుంటల భూమికి పట్టా ఇవ్వలేదని, మూడేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ప్రజావాణిలో దరఖాస్తు చేయగా, మూడునెలల్లోనే పట్టాదారు పాసు పుస్తకం వచ్చిందని తెలిపారు.

627 అర్జీలు:

ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి శుక్రవారం 627 అర్జీలు అందాయి. అధికంగా ఇళ్ల కోసం 185 రాగా, సాంఘిక సంక్షేమ శాఖ-108, రెవెన్యూ-60, విద్యుత్-57, ఎన్ఆర్ఐ విభాగం-4, ఇతర శాఖలకు 213 వచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటిని పరిష్కరించాలని చిన్నారెడ్డితో పాటు నోడల్ అధికారి దివ్య అధికారులకు సూచించారు.

మూసీకంటే ముందు పీసీబీ ప్రక్షాళన అవసరం


మాట్లాడుతున్న పీఎల్ఎన్ రావు, చిత్రంలో రాజారాం సింగ్, రాజేష్ కుమార్, లింగారెడ్డి, మల్లేష్ యాదవ్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: నగరంలో ముంపు సమస్యలు పునరావృతం కాకుండా మూసీ పునరుజ్జీవం అవసరమని పర్యావరణ సామాజిక కార్యకర్త పీఎల్ఎన్ రావు అన్నారు. అంతకంటే ముందు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. పీసీబీ పనితీరుపై సీఎం దృష్టి సారించాలన్నారు. పటాన్‌చెరు, జీడిమెట్ల తదితర పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను పూర్తి స్థాయిలో శుద్ధి చేయకుండా నాలాల ద్వారా మూసీలోకి వదులుతున్నారన్నారు. ఫలితంగా భూగర్భ జలాలు కలుషితమై 20 ఏళ్లుగా రంగారెడ్డి, నల్గొండ జిల్లాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మల్లాపూర్‌లోని ఎస్టీపీలో నీటిని శుద్ధి చేయకుండా నాలా నుంచి ఉప్పల్ చెరువులోకి విడుదల చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పీసీబీ అధికారులు పరిశ్రమల యాజమాన్యాలతో కుమ్మక్కై ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. అందుకే హైడ్రాను స్వాగతించాల్సిందేనని, చెరువులు, కుంటలు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించడంలో తప్పు లేదన్నారు. పేదలకు ప్రత్యామ్నాయం చూపాకే ఇళ్లను తొలగించాలని కోరారు. సమావేశంలో న్యాయవాది కరణం రాజేష్ కుమార్, బి.రాజారాం సింగ్, జె.మల్లేష్ యాదవ్, సీహెచ్ లింగారెడ్డి ఉన్నారు.

సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగాల పేరిట మోసం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగాల పేరుతో రూ. 26లక్షల మేర మోసానికి పాల్పడిన వ్యక్తులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ ప్రవంతినగర్‌లో నివసించే ఎ.వాసు టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆయనకు అదే సంస్థలో పనిచేసే చల్ల శ్రీరాంకిరణ్ పరిచయమయడు. తనకు వివిధ సాఫ్ట్‌వేర్ సంస్థలతో పరిచయాలున్నాయని, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వాసుకు చెప్పాడు. ఇది నమ్మిన వాసు తనకు తెలిసిన 17 మందికి ఐబీఎం సంస్థలో ఉద్యోగాల కోసం, శ్రీరాంకిరణ్, అతని భార్య సంధ్యారాణి ఖాతాల్లోకి ఫిబ్రవరిలో రూ. 26లక్షలు పంపించారు. అనంతరం 17 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు ఆఫర్ లెటర్లు ఇచ్చారు. దీంతో ఉద్యోగంలో చేరడానికి అభ్యర్థులు వెళ్లగా అవి నకిలీ పత్రాలని తేలింది. దీనిపై వాసు ప్రశ్నించగా వారికి మరో సంస్థలో ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించాడు. అనంతరం భార్యభర్తలు చరవాణుల్లో అందుబాటులో లేకుండాపోయారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దంపతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు చెస్ టోర్నీ

హైదరాబాద్, ఈనాడు: వారాస్ చెస్ అకాడమీ ఆదివారం హైదరాబాద్‌లో అంతర్జాతీయ ర్యాపిడ్ ఫిడె రేటింగ్ చెస్ టోర్నీ నిర్వహించనుంది. ఆదర్శ్ నగర్‌లోని జీపీ బిర్లా సెంటర్‌లో పోటీలు జరుగుతాయి. టోర్నీ ప్రైజ్‌మనీ రూ.3 లక్షలు. మరిన్ని వివరాలకు 8187093036 నంబర్లో సంప్రదించవచ్చు.

కరాటే విద్యార్థులకు బెల్ట్‌గ్రేడింగ్

బోరబండ: రహ్మత్‌నగర్‌లోని షావొలిన్ కుంగ్-ఫు మార్షల్‌ఆర్ట్స్ అకాడమీ ఎస్పీఆర్ హిల్స్ క్రీడాప్రాంగణంలో నిర్వహించిన బెల్ట్‌గ్రేడింగ్ కార్యక్రమంలో విద్యార్థులకు బెల్ట్‌లు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అసౌకర్యాలపై ఫిర్యాదు చేస్తాం


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కవితారెడ్డి

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అసౌకర్యాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. బంజారాహిల్స్ ఇబ్రహీంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అందించే ఆహారంలో నాణ్యత లేదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. రెండురోజుల క్రితం పాడైన కోడిగుడ్లను చిన్నారులకు అందించడంపై ఆరా తీశారు. అక్కడి సౌకర్యాల గురించి టీచర్ కుమారిని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీల ఉన్నతాధికారిణి జ్యోతితో చరవాణిలో మాట్లాడి సమస్యలు వివరించారు. ఎక్కువ రోజులు నిల్వ ఉన్న గుడ్లను చిన్నారులకు పంపిణీ చేయకూడదని, ఇందుకు సంబంధించిన టెండర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చిన్నారులకు రెండు నెలల నుంచి టెట్రా ప్యాక్ పాలు అందడం లేదని, పుస్తకాలు సైతం రాలేదన్నారు.

అలరించిన 'ప్రణామ్'



'గురుపరంపర' ప్రాముఖ్యతను తెలియజేస్తూ రవీంద్రభారతిలో శుక్రవారం 'ప్రణామ్' శీర్షికన సమర్పించిన నృత్యనీరాజనం వీక్షకులను అలరించింది. అభినేత్రి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎస్‌బీఆర్ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల (సికింద్రాబాద్) నృత్యగురువు మంజుల శ్రీనివాస్ వద్ద భరతనాట్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు తమ అభినయంతో ఆకట్టుకున్నారు. – న్యూస్‌టుడే, రవీంద్రభారతి

అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానం

బోరబండ, న్యూస్‌టుడే: బోరబండలోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో అతిథి ఉపాధ్యాయ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గోపిశెట్టి రమణమ్మ తెలిపారు. తెలుగు, సంస్కృతం, ఆంగ్లం ఉపాధ్యాయ పోస్టులకు పోస్ట్‌గ్రాడ్యుయేషన్, బీఈడీ తప్పనిసరని చెప్పారు. వివరాలకు 7330908473, 9618249353 చరవాణి సంఖ్యల్ని సంప్రదించాలని సూచించారు.

కొత్త వ్యక్తుల కదలికలపై కన్నేయండి: సీపీ ఆనంద్

ఈనాడు, హైదరాబాద్: పోలీసుశాఖలో నిఘావిభాగం కీలకపాత్ర పోషిస్తుందని నగర సీపీ సీవీ ఆనంద్ అన్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తుగా అప్రమత్తం చేయటంలో నిఘా అధికారులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని స్పష్టంచేశారు. బంజారాహిల్స్ పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో శుక్రవారం స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. నగరానికి వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చే కొత్త వ్యక్తుల కదలికలపై మరింత నిఘా ఉంచాలని ఆదేశించారు. హోటళ్లు, కాలనీలు, బస్తీల్లోకి చేరే కొత్త వ్యక్తుల సమాచారం ఎప్పటికప్పుడు అందేలా స్థానికంగా వ్యవస్థను బలోపేతం చేసుకోవాలన్నారు. నిఘావిభాగం అనేది ప్రత్యేక వ్యవస్థగా పనిచేయాలన్నారు. సమావేశంలో ఎస్బీ డీసీపీ ఎస్.చైతన్యకుమార్, అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు మృతితో విషాదం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న సింహగిరి(40) నీటి కుంటలో పడి మృతిచెందటంతో ఠాణాలో విషాదం నెలకొంది. ఖైరతాబాద్ ఠాణా ఏర్పాటైనప్పటి నుంచి ఇక్కడే పనిచేస్తున్న ఆయన స్టేషన్‌లో సెక్షన్ విధులు అప్పగించారు. అందరితోనూ కలివిడిగా ఉండేవారని పోలీసు సిబ్బంది గుర్తుచేసుకున్నారు. గణేశ్ ఉత్సవాల సమయంలో హెడ్ క్వార్టర్ నుంచి అనుమతి తీసుకుని స్వగ్రామానికి వెళ్లాడని, అకస్మాత్తుగా నీటిలో పడి మృతిచెందడం బాధాకరమన్నారు.

కూకట్‌పల్లి



జేఎన్‌టీయూ ఆవరణలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ హెచ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం వర్సిటీ ఆవరణలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 2015లో ఈఈఈ విద్యార్థి విలాస్ క్యాన్సర్‌తో మృతి చెందగా ప్రతి ఏడాది విద్యార్థిని గుర్తు చేసుకుంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్యాన్సర్ వ్యతిరేక నినాదాలిస్తూ ప్రదర్శన చేపట్టారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి



శ్మశానవాటికను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

బాలానగర్, న్యూస్‌టుడే: పెండింగ్ పనులు పూర్తిచేయాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేటలోని హిందూ శ్మశానవాటికను సందర్శించారు. అక్కడ జరగాల్సిన పనులపై చర్చించారు. బోయిని చెరువు కట్ట ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి సర్కిల్ ఈఈ గోవర్దన్‌గౌడ్, ఏఈ ఆశ తదితరులు పాల్గొన్నారు.

త్రైక్వాండో జట్ల ఎంపిక

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించనున్న త్రైక్వాండో పోటీలకు జేఎన్‌టీయూ హెచ్ పురుషులు, మహిళా జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. వర్సిటీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. నవంబరు 6వ తేదీ నుంచి 9 వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ త్రైక్వాండో పోటీల్లో పురుషుల జట్టు, 12 నుంచి జరిగే పోటీల్లో మహిళా జట్టు పాల్గొంటుందని తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, క్రీడా కార్యదర్శి ఎన్.ఎస్. దిలీప్, త్రైక్వాండో కోచ్ బాబులాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: **సమయం:** ఉదయం 10.30గంటల నుంచి 11వరకు.

ప్రాంతాలు: వివేకానందనగర్‌కాలనీ, వేంకటేశ్వరస్వామి దేవాలయం పరిసర ప్రాంతాలు.

సమయం: ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.

ప్రాంతాలు: దయార్‌గూడ, సాయినగర్, సంగీత్‌నగర్, మైత్రీనగర్, దేవీనగర్.

తవ్వేసి.. వదిలేసి

ప్రమాదకరంగా వరద నీటి కాలువ

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పని ఏదైనా ప్రారంభించిన తర్వాత దాన్ని సకాలంలో పూర్తిచేయాలి. లేదంటే ఇబ్బందులు తలెత్తుతాయి. కొన్నిసార్లు ప్రమాదాలకు దారి తీస్తాయి. అయినప్పటికీ గుత్తేదారులు పనులు పూర్తి చేయడంలేదు. అధికారులు స్పందించకపోవడంతో ప్రజలకు సమస్యలు తప్పడంలేదు. ఇందుకు నిదర్శనమే.. కూకట్‌పల్లి డివిజన్ శ్రీసాయికాలనీలో సమస్యాత్మకంగా మారిన తవ్విపోసి వదిలేసిన వరద నీటి కాలువ

పునరుద్ధరణ మరిచారు

గుత్తేదారు కాలనీలోని కాలువపై వేసిన శ్లాబును పూర్తిగా పొక్లెయిన్‌తో తవ్విపోశాడు. తదుపరి పునరుద్ధరణ చర్యలు చేపట్టలేదు. ఇళ్ల ముందు కాలువ ఉండడంతో.. జనం బయటికి వచ్చే ఏర్పాట్లు కూడా లేకుండా తవ్విపోయడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరో రోడ్డులో శ్లాబుపై నాలుగైదు చోట్ల రంధ్రాలు చేసి వదిలేశారు. అవకాశం ఉన్నంతమేర పూడిక తీయడం ద్వారా ముంపు సమస్య తలెత్తే అవకాశం ఉండదు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ముంచెత్తిన వరద

కూకట్‌పల్లి నల్లచెరువు అలుగు నుంచి వస్తున్న కాలువ జనావాసాల మధ్య నుంచి ప్రవహిస్తుంది. ఇది పలు కాలనీలను దాటుతూ విజ్ఞాన్‌పురికాలనీలోని ఖాజాకుంటకు చేరుతుంది. ఈ కాలువ అలుగు వద్ద కొంత వెడల్పుగా ఉన్నప్పటికీ.. వెళ్లే కొద్దీ కుంచించుకుపోయి పిల్ల కాలువలా మారింది. ప్రతి ఏడాది వర్షాకాలానికి ముందే నాలాల పూడికతీతకు ఏర్పాట్లు చేస్తారు. ఏడాది పొడవునా ఇది జరిగేలా కొన్నేళ్లుగా చర్యలు తీసుకుంటూ వస్తున్నారు. కానీ ఈ కాలువలో పూడికను మాత్రం తీయడంలేదు. ఇళ్ల మధ్య నుంచి వెళ్లేచోట.. శ్లాబులు వేసిన ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. గత నెలలో శ్రీసాయికాలనీలో వరద ఉప్పొంగి కాలనీ రోడ్లను ముంచెత్తింది. పై నుంచి వచ్చే వరద కాలువ నుంచి వెళ్లలేక ఇక్కడ ఉప్పొంగి కాలనీని ముంచెత్తడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



శ్రీసాయికాలనీలో శ్లాబు తవ్వి వదిలేసిన కాలువ



పగిలిపోయి ఇలా..

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: 8008573418
కేపీహెచ్‌బీకాలనీ:8008573195, మూసాపేట:8008573423, అల్లాపూర్:9491124918

మ్యాన్‌హోల్ మూత పునరుద్ధరణ

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి డివిజన్ పరిధి వెంకట్రావునగర్ కాలనీ సామాజిక భవనం రోడ్డులో మంజీరా స్లూయిజ్‌వాల్వ్ మ్యాన్‌హోల్ మూత కుంగింది. ఈ విషయాన్ని స్థానికులు 'ఈనాడు' దృష్టికి తీసుకెళ్లగా 'మేమున్నాం మీకు.. తోడుగా'లో ప్రచురితమైంది. స్పందించిన జలమండలి అధికారుల సిబ్బందితో మరమ్మతులు చేయించి మూత పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు.

స్పందనకు వందనం

వ్యర్థాల తొలగింపు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్‌లో అధ్వానంగా మారిన బస్తీ దవాఖాన రోడ్డుని జీహెచ్‌ఎంసీ సిబ్బంది శుభ్రం చేసింది. రహదారిలో చెట్లకొమ్మల వ్యర్థాలు పడేసి నెలలు గడుస్తున్నాయి. వ్యర్థాలు తొలగించి శుభ్రం చేయాలని గురువారం 'ఈనాడు'లో 'నెలలుగా.. సమస్యల నెలవుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. వెంటనే స్పందించిన అధికారులు ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు.

మురుగు కాల్వల్లో పూడికతీత

మూసాపేట, న్యూస్‌టుడే: మూసాపేట పరిధి ప్రగతినగర్‌లోని భూగర్భ మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ సమస్యను స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకెళ్లగా వార్త ప్రచురితమైంది. స్పందించిన స్థానిక జలమండలి మేనేజర్ సలోమి శుక్రవారం కాలనీలోని అన్ని రోడ్లలో ఉన్న మురుగు కాల్వల్లో పూడిక తీయించారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నేటి నుంచి



నూతనంగా నిర్మించిన ఆలయం

మూసాపేట, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి స్వాన్‌లేక్ గృహ సముదాయంలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం నుంచి జరగనున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు గణపతి పూజ, పుణ్యావచనం, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం ఉంటాయి. ఆదివారం జలాధివాసం, నవగ్రహ పూజలు వంటివి జరుగుతాయి. చివరి రోజు విఘ్నేశ్వరస్వామి ప్రతిష్ఠాపన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

భయమొద్దు.. అండగా ఉంటా: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో లేనిపోని అపోహలతో భయపడొద్దని.. తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి శేషాద్రినగర్‌లో జరిగిన అల్లాపూర్ డివిజన్ వాసుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్‌గాంధీనగర్, సఫ్దర్‌నగర్ వాసులు ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా డివిజన్‌లో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. పెండింగ్ పనులు వేగంగా జరిగేలా చూసుకోవాలని కార్పొరేటర్‌కు సూచించారు. స్థానికంగా కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు తదితర సమస్యల నేపథ్యంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్పొరేటర్ సబిహాబేగం, భారాస జిల్లా మైనార్టీ అధ్యక్షుడు గౌసుద్దీన్, ఐలయ్య, వీరారెడ్డి, బాబా తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రప్రసాద్‌కు పరామర్శ



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కుమార్తెను కోల్పోయిన సినీనటుడు రాజేంద్రప్రసాద్‌ను గురువారం రాత్రి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి బండి రమేశ్ పరామర్శించారు. కేపీహెచ్‌బీ పరిధి ఇందూ విల్లాస్‌లోని రాజేంద్రప్రసాద్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు.

నల్లపోచమ్మ దేవాలయానికి శంకుస్థాపన

బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ డివిజన్ ఇంద్రానగర్‌లో నల్లపోచమ్మ దేవాలయం నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ జరిగింది. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి బండి రమేశ్, భారాస నేత గొట్టిముక్కల తేజేశ్వరరావు వేర్వేరుగా పూజల్లో పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు స్పందన

అల్లాపూర్, న్యూస్‌టుడే: అల్లాపూర్ డివిజన్ పరిధి గాయత్రీనగర్‌లో నిర్మాణ్ ఎన్జీవో సంస్థ, ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలకు నిర్వహించిన ఉద్యోగ మేళాకి స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి అవకాశాల కోసం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వీఐవీఐఎఫ్ఎల్, మెడ్‌ప్లస్, అపోలో, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌జీటీఎల్, ఏవీఎస్, ఐటీఈఎస్ తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అర్హులైన వారిని ఎంపిక చేశారు. ఆయా సంస్థల ప్రతినిధులు శశికాంత్, పావని, శైలేష్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువైపులా పచ్చని చెట్లు.. ప్రయాణికులు మెచ్చేట్టు



బాలానగర్ నుంచి మెదక్ నర్సాపూర్‌కు వెళ్లే రహదారి ఇలా కనువిందు చేస్తోంది. దారికి ఇరువైపులా పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంలో కాలుష్యం తక్కువగా ఉండటంతో వాహనదారులు ప్రయాణం సాఫీగా సాగిస్తున్నారు. – కూకట్ పల్లి జోన్

మురుగు.. పరుగు



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ లీకేజీతో మురుగు పరుగులు పెడుతోంది. ఇక్కడ తరచూ ఈ సమస్య తలెత్తుతుండడంతో క్యాంపస్‌లో అపరిశుభ్రత, అధ్వాన పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కళాశాల స్పందన భవనం ముందు మ్యాన్‌హోల్ నుంచి మురుగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పట్టు తప్పితే.. ప్రాణం గాల్లోనే



ఉదయాన్నే ఉద్యోగాలకు, కళాశాలలకు వెళ్లే వారు ఆర్టీసీ బస్సులలో ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. సమయానికి వెళ్లాలని వచ్చిన బస్సులో సరిపోకున్నా ప్రమాదకరంగా ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తుంటారు. ఏ మాత్రం కాలు జారినా ప్రాణాలు గాల్లో కలిసినట్లే. ఫిరోజ్ గూడా వద్ద ప్రయాణికులు ప్రమాదకరమని తెలిసినా ఇలా వెళ్తున్నారు. – కూకట్‌పల్లి జోన్

ఉల్లి వ్యాపారి కన్నీరు



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మార్కెట్‌లో ఉన్న ఉల్లిపాయలు తడిసిపోవడంతో కొన్న దానిలో సగం వృథాగా పడేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని మూసాపేట వద్ద ఉల్లిపాయల వ్యాపారం చేస్తున్న వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. మూసాపేటలోని మెట్రోస్టేషన్ వద్ద పాదబాటపై తడిసిన ఉల్లిని ఇలా ఎండకు ఆరపెడుతున్నారు. – కూకట్‌పల్లి జోన్

పగటి వెలుగులు.. పట్టించుకోని అధికారులు



కూకట్‌పల్లి రంగధాముని చెరువు రోడ్డులో..

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పగటి వెలుగుల వృథాను నియంత్రించలేకపోతున్నారు. ఫలితంగా రాత్రిళ్లు అంధకారంతో జనం అవస్థలు పడుతున్నారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో గత ఏడాదిగా ఇదే దుస్థితి కనిపిస్తోంది. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలోనే 20కి పైగా ప్రాంతాల్లో కాలనీలు, ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు 24 గంటలు వెలుగుతున్నాయి. కొన్ని కాలనీల్లో రాత్రిళ్లు అంధకారం రాజ్యమేలుతోంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వివరాలు సమర్పించాలి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2018-19వ విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తిచేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆ వివరాలు సమర్పించాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అలివేలు మంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలను ఈనెల 30వ తేదీ సాయంత్రం 4గంటల లోపు కళాశాలలో అందజేయాలని సూచించారు. తొందరలోనే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్

కూకట్‌పల్లి: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు కూకట్‌పల్లి బస్టాపు వద్ద ధర్నా చేశారు. పెండింగ్ బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.



శ్రీనివాస్‌కు విద్యార్థి నేతల అభినందనలు



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ పాలమూరు యూనివర్సిటీ వీసీగా నియమితులైన జేఎన్‌టీయూ హెచ్ ప్రొఫెసర్ జి.ఎన్.శ్రీనివాస్‌ను విద్యార్థి సంఘాల నేతలు అభినందించారు. శుక్రవారం ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నేతలు ఎరవెల్లి జగన్, భానుప్రకాశ్‌నాయక్, హేమంత్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయం.. ఇద్దరి అరెస్టు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: గంజాయి వ్యాపారం చేస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. ఖమ్మంకు చెందిన నీలేష్‌కుమార్, వరంగల్ డోర్నకల్ నివాసి సిరాజుల్లా ఇంజినీరింగ్ పూర్తిచేశారు. వసంత్‌నగర్‌లో నివాసం ఉంటూ మోడల్ ఫొటోగ్రఫీ చేస్తున్నారు. గంజాయి వ్యాపారం చేస్తే బాగా డబ్బు సంపాదించవచ్చని అనుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గంజాయి విక్రయించే వారితో పరిచయం ఏర్పరుచుకొని అవసరమైనప్పుడు కాకినాడ నుంచి తెప్పించేవారు. ఇలా తెచ్చిన గంజాయిని ఎక్కువ ధరకు నగరంలో అమ్ముతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు శుక్రవారం వారి ఇంటిపై దాడి చేసి 1.185కిలోల గంజాయి, కారు, ద్విచక్ర వాహనం, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

వ్యాసం రాసి.. ప్రతిభ చాటి



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ ఏడోఫేజ్‌లోని గీతాంజలి మోడల్ స్కూల్‌లో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలు పోటాపోటీగా సాగాయి. పాఠశాలకు చెందిన 8,9,10 తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావం విషయాలపై విద్యార్థులు ఆకట్టుకునే వ్యాసాలు రాశారు. పదో తరగతికి చెందిన జి.గీతిక(ప్రథమ), యు.వాణీఅనుశ్రీ(ద్వితీయ), జె.సురేశ్‌నాయక్(తృతీయ)స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్, కరెస్పాండెంట్ కె.రవిబాబు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయిని సుజాత ఉన్నారు.





అగర్వాల్ ట్రావెల్ ఏజెన్సీకి జరిమానా

ఈనాడు, హైదరాబాద్: ప్రయాణ టిక్కెట్ల బుకింగ్, సేవల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అగర్వాల్ ట్రావెల్ ఏజెన్సీకి రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ జరిమానా విధించింది. కూకట్‌పల్లికి చెందిన వి.వెంకటనాగజ్యోతి ఫిర్యాదును విచారించిన కమిషన్... రూ.1,82,500 తొమ్మిది శాతం వడ్డీతో కలిపి రీఫండ్ చేయడంతో పాటు రూ.50వేలు పరిహారం, రూ.10వేలు కేసు ఖర్చులు చెల్లించాలని ఆదేశించింది. ఫిర్యాదీ ఆమె భర్తతో కలిసి అమెరికాలోని డల్లాస్ వెళ్లేందుకు ప్రణాళికలు వేసుకొని ప్రతివాద సంస్థను సంప్రదించారు. ఈ మేరకు లక్షా ఎనభై రెండువేల ఐదు వందలు చెల్లించారు. టిక్కెట్లు బుక్ అయ్యాయని చెబుతూ వస్తున్న ప్రతివాద సంస్థ సిబ్బంది ప్రయాణానికి ముందు రోజున టిక్కెట్లు కన్‌ఫర్మ్ కాలేదని చెప్పారు. దీంతో డబ్బు రీఫండ్ చేయాలని ఫిర్యాదీ కోరగా ప్రత్యామ్నాయాలు ఉన్నాయంటూ మరికొన్ని ప్రతిపాదనలు ముందు ఉంచారు. నాలుగు రోజుల తర్వాత అమెరికన్ ఎయిర్‌లైన్స్ టిక్కెట్లు ఉన్నాయని తెలిపారు అయితే దిల్లీలో 12గంటల నిరీక్షణ, తిరుగు ప్రయాణం టిక్కెట్లు లేకపోవడంతో ఫిర్యాదీ డబ్బు రీఫండ్ చేయాలని కోరగా సంస్థ కాలయాపనచేసింది. దీంతో ఫిర్యాదీ కమిషన్‌ను ఆశ్రయించారు.

మరమ్మతుల్లో సేవాలోపం...
రాయల్ ఎన్‌ఫీల్డ్ సర్వీస్ సెంటర్‌కు మొట్టికాయలు

ఈనాడు, హైదరాబాద్: మరమ్మతుల్లో సేవాలోపానికి గచ్చిబౌలిలోని రాయల్‌ఎన్‌ఫీల్డ్ సర్వీస్ సెంటర్‌కు రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ మొట్టికాయలు వేసింది. కూకట్‌పల్లికి చెందిన సాయి ఫిర్యాదును విచారించిన కమిషన్.. రూ.15వేలు చెల్లించాలని సదరు సర్వీస్‌సెంటర్‌ను ఆదేశించింది. ఫిర్యాదీ 2023లో రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని కొనుగోలు చేశాడు. అదే ఏడాది డిసెంబర్‌లో జరిగిన ప్రమాదంలో వాహనం మరమ్మతులకు గురైంది. ప్రతివాద సంస్థను సంప్రదించి వాహనాన్ని అప్పగించారు. రెండు నెలల తర్వాత సాయికి వాహనాన్ని ఇవ్వగా హెడ్‌లైట్ స్క్రూ ఊడిపోయి ఆ భాగం అటూ ఇటూ ఊగడం, నడపడంలోనూ ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మరో రూ.5వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. మరమ్మతులు సరిగా చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నానంటూ ఫిర్యాదీ కమిషన్‌ను ఆశ్రయించాడు.

తయారీలోపం ఉన్న వాషింగ్‌మెషిన్ విక్రయం..

తయారీలోపం ఉన్న వాషింగ్‌మెషిన్‌ను విక్రయించిన క్రోమా, దాన్ని తయారు చేసిన వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ జరిమానా విధించింది. కూకట్‌పల్లికి చెందిన రాజేంద్రబాబు ఫిర్యాదును విచారించిన కమిషన్.. కొత్త వాషింగ్‌మెషిన్ ఇవ్వడం లేదా రూ.22,979, తొమ్మిది శాతం వడ్డీతో కలిపి రీఫండ్, రూ.5వేలు పరిహారం, రూ.5వేలు కేసు ఖర్చులు ఇవ్వాలని ప్రతివాద సంస్థలను ఆదేశించింది. వాషింగ్ మెషిన్ కొనుగోలు చేస్తే తరచూ మరమ్మతులకు గురైందని, వారంటీతో రిపేరు చేసినా మళ్లీ సమస్య మొదటికి రావడంతో విసుగు చెందిన ఫిర్యాదీ కమిషన్‌ను ఆశ్రయించాడు.



శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

ఈనాడు, హైదరాబాద్: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీపీ అవినాష్‌మహంతి తెలిపారు. ఈ నెల 24 లోగా డీసీపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అగ్నిమాపక అధికారి, జీహెచ్ఎంసీ, ప్రైవేటు వ్యక్తుల స్థలమైతే వారి నుంచి నిరభ్యంతరపత్రం, గతేడాది లైసెన్స్, సైట్ ప్లాన్ జతచేసి.. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రహీతల్లు బ్రాంచ్, నాంపల్లి పేరిట రూ.600 చలానా చెల్లించి తాత్కాలిక లైసెన్స్ పొందాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: అమీన్‌పూర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. కేజీఆర్ కాలనీ, సాయివిల్లాస్, గ్రీన్‌విల్లాస్, ఆర్ఆర్ హోమ్స్, ఎస్ఎస్‌హోమ్స్, భరతనగర్ కాలనీ, సురక్ష హాబిటేట్, ఎన్‌క్లేవ్‌లు, అమీన్‌పూర్ గ్రామం, సాయిరాంనగర్, నరేంద్రనగర్ కాలనీ, నవ్యలేక్‌సహస్రమం బీహెచ్ఈఎల్ కాలనీ, శంకర్ గ్రీన్‌హోమ్స్, పీఎన్ఆర్ కాలనీ, సాయిలు బిరా కాలనీ, రాజరాజేశ్వరి, శాంతినగర్, బలాపూర్ తండా, సాయి విల్లాస్, గ్రీన్‌విల్లాస్, సాయి రాజేశ్వరి, శ్రీసాయినగర్, సబ్ వే హోమ్స్, ఎంపైర్ మెడోస్, సాయి అంబికా కాలనీలు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా గందె సురేష్




షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన గందె సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది.

వచ్చే నెల 28 నుంచి గీతంలో అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వచ్చేనెల 28 నుంచి నాలుగు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నామని నిర్వాహకులు వైఎల్పీ బోర్డు తెలిపారు. 'వ్యర్థాల నిర్వహణ- వ్యర్థాల ఆధార వ్యవస్థ' అనే అంశంపై జరిగే సదస్సును గీతం బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా విద్యారంగ నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు, పరిశోధన సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారని వివరించారు.

టెలికాం బోర్డు సభ్యుడిగా కుమార్



బైండ్ల కుమార్‌కు నియామకపత్రం అందిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: భాజపా జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్‌ను కేంద్ర ప్రభుత్వ టెలికాం బోర్డు సభ్యుడిగా నియమించారు. మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు ఈ నియామకపత్రాన్ని శుక్రవారం అందించారు.

ఆకట్టుకుంటున్న వాట్ హై-ఫై షో

మాదాపూర్, న్యూస్‌టుడే: మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో 'వాట్ హై-ఫై షో 2024' పేరిట ఏర్పాటు చేసిన ఆడియో విజువల్ ఉత్పత్తుల ప్రదర్శన ఆకట్టుకుంటుంది. వివిధ రకాల ఆడియో, విజువల్ ఉపకరణాలు కొలువుదీరాయి. 20 వరకు ప్రదర్శన కొనసాగనుంది.

బైక్ అదుపు తప్పి పడి ఐటీ ఉద్యోగి మృతి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. పటాన్‌చెరు ఎస్సై బుచ్చిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బీరంగూడకు చెందిన సాయి వరుణ్‌రెడ్డి(24) తన స్నేహితుడు వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ఈనెల 17 రాత్రి ఇక్రిశాట్‌లో మరో స్నేహితుని వేడుకకు ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరుగుముఖంలో అతివేగంగా, అజాగ్రత్తగా వస్తుండగా పటాన్‌చెరు సమీపంలో జాతీయరహదారిపై తెల్లవారుజామున ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపు తప్పి జారి పడ్డారు. బైక్ నడుపుతున్న సాయివరుణ్‌రెడ్డి తీవ్రగాయాలవ్వడంతో అతన్ని పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. వేణుగోపాల్‌రెడ్డి తలకు, శరీరంపై గాయాలు అవ్వడంతో అతన్ని నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడి తండ్రి శ్రీనివాసరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం

శేరిలింగంపల్లి: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ పోలీసుల వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన పత్తిపాక ప్రభాకర్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడు. ఎస్‌టీఎఫ్ ఎస్సై బాలరాజు బృందం సభ్యులు నిఘా పెట్టారు. శుక్రవారం గుట్టల బేగంపేట నవభారత్ నగర్ కాలనీలో గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నారు. గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో తనిఖీ చేయగా మరికొంత గంజాయి దొరికింది. 1.897 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

కేక పుట్టించిన కూత

ఈనాడు, హైదరాబాద్: గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం ప్రో కబడ్డీ లీగ్ 11వ సీజన్ ఆరంభమైంది. ఈ కబడ్డీ మ్యాచ్‌లు అభిమానులను అలరించాయి. తొలి మ్యాచ్‌లో సొంతగడ్డపై తెలుగు టైటాన్స్ చెలరేగి బెంగళూరు బుల్స్‌ను మట్టికరిపించింది. మరో మ్యాచ్‌లో యు ముంబాపై దబంగ్ ఢిల్లీ గెలిచింది. బాలీవుడ్ నటీనటులు విద్యాబాలన్, కార్తీక్ ఆర్యన్ ముఖ్య అతిథులుగా సందడి చేశారు.

ఏబీవీపీ ధర్నా

చందానగర్, న్యూస్‌టుడే: విద్యార్థుల ఉపకార వేతనాలు విడుదలచేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) చందానగర్‌లో ధర్నా చేపట్టింది. శుక్రవారం చందానగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి సమ్మడ పవన్‌కుమార్, చందానగర్ శాఖ కార్యదర్శి సాత్విక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.7500 కోట్ల ఉపకార వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.



జాతీయ రహదారిపై బైఠాయించిన విద్యార్థులు

అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించారు. తరుణ్, రోహిత్, చరణ్, సాయినాథ్ పాల్గొన్నారు.

కోట్లు పెట్టి.. నిర్వహణ మరిచి

అధ్వానంగా తయారవుతున్న పాదబాటలు

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లి జంటసర్కిళ్ల పరిధిలోని అనేక ప్రధాన రహదారుల్లోని పాదబాటలు అధ్వానంగా తయారయ్యాయి. విలువైన ప్రజాధనం వెచ్చించి వాటిని నిర్మించడంలో చూపిస్తున్న ఆసక్తిని.. నిర్వహణ విషయంలో చూపడం లేదు. ముఖ్యంగా మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ రహదారులు నిత్యం రద్దీగా ఉంటాయి. ఇక్కడ పాదబాటలు అధ్వానంగా ఉండటంతో రోడ్డు పైనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నడవాల్సి వస్తోందని పాదచారులు వాపోతున్నారు.

• కొండాపూర్ జేవీజీహిల్స్ కాలనీ చౌరస్తా నుంచి మసీదుబండ ఎస్ఎంఆర్ వినయ్ అపార్ట్‌మెంట్స్ వరకు ఏడాది క్రితం జీహెచ్ఎంసీ అధికారులు దాదాపు రూ. 50లక్షలు ఖర్చుచేసి పాదబాటలు నిర్మించారు. రోడ్డుకిరువైపులా టైల్స్ వేసి బాటలు సిద్ధంచేశారు. తర్వాత నిర్వహణ పట్టించుకోలేదు. దీంతో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, చెత్తాచెదారంతో నిండిపోయింది.

• మసీదుబండ కమాన్ నుంచి మసీదుబండ విలేజ్ వరకు నాలుగేళ్ల క్రితం పాదబాటలు నిర్మించారు. ఏడాది క్రితం భూగర్భ కేబుళ్లు వేసేందుకు పాదబాట మొత్తం ధ్వంసంచేశారు. తర్వాత పునరుద్ధరించలేదు.

సమన్వయం ఏదీ..!

ఫుట్‌పాత్ నిర్మాణాల విషయంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం, టౌన్‌ప్లానింగ్ విభాగాల మధ్య సమన్వయం ఉండాలి. పాదబాటలపై పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం, టైల్స్ విరిగిపోతే మరమ్మతులు చేయడం, ఆక్రమణలు తొలగించే బాధ్యతలను ఈ మూడు విభాగాలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఎవరికి వారు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి పాదబాటలు పరిస్థితి మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మసీదుబండ రోడ్డులో పాదబాట పునరుద్ధరణ ఏదీ..!

ఆక్రమణలు ఇలా..

ప్రధాన రహదారుల పక్కన నిర్మించిన పాదబాటలు ఆక్రమణకు గురవుతున్నాయి. వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, దుకాణాలకు సరైన పార్కింగ్ వసతి లేక చాలాచోట్ల వాహనాలను పాదబాటలపైనే నిలపడంతో అవి పార్కింగ్ అడ్డాలుగా మారిపోతున్నాయి. చిరువ్యాపారులు పాదబాటలను ఆక్రమించి తోపుడుబండ్లు, టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తున్నారు.

• సాయినగర్ నుంచి అయ్యప్పసొసైటీ వెళ్లే రోడ్డులో ఇరువైపులా ఉన్న పాదబాట ఆక్రమణకు గురైంది. నిత్యం ఫుట్‌పాత్‌పైనే చిన్నచిన్న దుకాణాలు నిర్వహిస్తున్నారు.

• గచ్చిబౌలి అంజయ్యనగర్ నుంచి రాజీవ్ నగర్‌కు వెళ్లే రోడ్డు పక్కనే ఉన్న ఫుట్‌పాత్‌ను స్థానిక హోటళ్లు, దుకాణదారులు పార్కింగ్ కోసం వాడుకుంటున్నారు.

• మాదాపూర్ నుంచి సైబర్‌టవర్స్‌కు వెళ్లే మార్గంలో పాదబాటపై నడిచే వీల్లేకుండా దుకాణాలు, వాహనాల పార్కింగ్‌తో నింపేస్తున్నారు.




ప్రభుపాదటౌన్‌షిప్ రోడ్డులోని పాదబాటలో నడిచేదెలా



మైహోం మంగళ రోడ్డులో..

బీమా రంగంలో మోసాలను సమర్థంగా ఎదుర్కోవాలి



ప్రసంగిస్తున్న సత్యజిత్ త్రిపాఠి

రాయదుర్గం, న్యూస్‌టుడే: బీమా రంగంలో ఎదురవుతున్న సైబర్ మోసాలు, ఇతర సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు సంసిద్ధత కావాల్సిన అవసరం ఉందని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) సభ్యుడు సత్యజిత్ త్రిపాఠి అన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్(ఐఐఆర్ఎం) సమావేశ మందిరంలో ఇన్సూరెన్స్ ఐటీ న్యూ నార్మల్ అనే ఇతివృత్తంతో రెండురోజుల ఇన్సూరెన్స్ సదస్సు 2024ను శుక్రవారం ప్రారంభించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ.. బీమా కార్యకలాపాల్లో హెచ్చుతగ్గులు, మోసాలను తగ్గించేందుకు నిత్యం కృషి చేయాలని సూచించారు. ఐఐఆర్ఎం డైరెక్టర్ అంతను కుమార్ దాస్ స్వాగతోపన్యాసం చేస్తూ బీమా రంగంలో కొత్త సామర్థ్యాలు, సాంకేతికలపై దృష్టి సారించాలన్నారు. ఇన్సూరెన్స్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఐబీఏ) అధ్యక్షుడు, స్విస్ రీ హెడ్ సీ సొల్యూషన్స్ ఆపరేషన్స్ హెడ్ జితేందర్ బజీర్, ఐఐఆర్ఎం ప్రిన్సిపల్ డా.వివేక్ మోహన్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సందడిగా పాఠశాలల కళా ఉత్సవం

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి కళా ఉత్సవం సందడిగా సాగింది. వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శాస్త్రీయ, జానపద నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం తాజ్‌బాబు తెలిపారు.

అక్రమ నిర్మాణాలను ప్రాథమిక స్థాయిలోనే అరికట్టాలి

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: అక్రమ నిర్మాణాలను ప్రాథమిక స్థాయిలోనే అడ్డుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. జోనల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. చర్యల విషయంలో అధికారులు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కూల్చివేత బృందాల పని తీరు, రహదారుల విస్తరణ, భవన నిర్మాణాల అనుమతులు, కోర్టు కేసులు, ఫుట్‌పాత్, నాలాల ఆక్రమణలు తదితర వాటిపై చర్చించారు. అక్రమ నిర్మాణాలకు తాఖీదులిచ్చి వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేయాలని వివరించారు.

ఉత్సాహంగా ఈనాడు ప్రతిభ పాటవ పోటీలు



రాయదుర్గం నాగార్జున పాఠశాలలో వ్యాసం రాస్తున్న విద్యార్థులు

రాయదుర్గం, పటాన్‌చెరు, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో రాయదుర్గంలోని నాగార్జున పాఠశాల, అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి పటేల్‌గూడ గ్రామం కృష్ణవేణి పాఠశాలలో నిర్వహించిన ప్రతిభ పాటవ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. 'ఇంటర్నెట్ వినియోగం, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై 8, 9, 10వ తరగతుల విద్యార్థులు వ్యాసాలు రాసి ప్రతిభ చాటారు. సాయి వర్షిణి, ఎన్.సంధ్యారాణి, వై. గోపిక అపర్ణ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ భరత్‌కుమార్, ప్రిన్సిపల్ సుందరి బహుమతులు ప్రదానం చేశారు.

• కృష్ణవేణి పాఠశాలలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన కె.తుంగవిద్య, కె.జ్ఞానేశ్వర్, తేజశ్రీలకు పాఠశాల ఛైర్మన్ మయూరి పద్మావతి, ప్రిన్సిపల్ హేమ లావణ్య బహుమతులు అందజేశారు.



బహుమతులతో విజేతలు.. పాఠశాల కరస్పాండెంట్ భరత్ కుమార్ ప్రిన్సిపాల్ సుందరి



పటేల్‌గూడ కృష్ణవేణి పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేసిన పాఠశాల ఛైర్మన్ పద్మావతి, ప్రిన్సిపల్ లావణ్య



వ్యాసం రాస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన



వివేకానందనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: ఆల్విన్‌కాలనీ ఫేజ్-1లోని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందగా వారిలో ఇద్దరిని శుక్రవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అభినందించారు. వివేకానందనగర్‌కాలనీలో జయశ్రీ గోపాల్‌క్రిష్, కృష్ణను శాలువాతో సత్కరించారు.

దేశ ముఖచిత్రాన్ని మార్చేది విద్యే

మంత్రి సీతక్క

రాయదుర్గం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ నిధులను వెచ్చించాలని, ఒక్కో గ్రామాన్ని దత్తతకు తీసుకుని అన్నివిధాలా దన్నుగా నిలవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం హైసియా (హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్) ఆధ్వర్యంలో విద్యా సదస్సు నిర్వహించారు.

మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి కట్టుబడి ఉందని, ఇందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్న తెలిపారు. విద్యాసదస్సు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దేశముఖ చిత్రాన్ని మార్చగలిగేది విద్య మాత్రమేనని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యా అవకాశాల్లో ఆకాశానికి భూమికి ఉన్నంత తేడా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమానత్వ సాధనలో విద్య కీలకమని, హైదరాబాద్‌లో తరహా విద్య మారుమూల పల్లెల్లోనూ ఉండాలన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

తమ ప్రభుత్వం ఆ దిశగా కృషి చేస్తోందని తెలిపారు. ఇందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని కోరారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని, అప్పుడే సమాన అవకాశాలు లభిస్తాయని చెప్పారు. తమ ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యమిస్తోందని వివరించారు. హైసియా ఆధ్వర్యంలో.. అచ్చంపేట, ఆదిలాబాద్, ములుగు, భద్రాచలం వంటి అటవీ ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం ఆదర్శనీయమన్నారు. చిత్తశుద్ధి, మంచి ఆలోచనలు ఉంటే కఠిన పరిస్థితులను అధిగమించగలుగుతామని చెప్పారు. అటవీ శాఖ అభ్యంతరం పెడితే.. కంటైనర్ ఆస్పత్రి, కంటైనర్ పాఠశాలను ప్రారంభించామని గుర్తు చేశారు.

ములుగు కలెక్టర్ దివాకర్ టీఎస్ ప్రసంగిస్తూ.. మారుమూల ప్రాంతాల్లో సామాజిక కట్టుబాట్లు విద్యాభివృద్ధికి అవరోధంగా నిలుస్తున్నాయని చెప్పారు. బాలికలను బడికి పంపించడం కంటే ఇంటి పనులు చేయించడానికే ప్రాధాన్యమిస్తున్నారు. మాజీ ఐఏఎస్ ఆఫీసర్ ఆకునూరి మురళి పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ కమిటీలు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లతోపాటు ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇంటి పథకంలో అర్హులను గుర్తించేందుకు వీలుగా అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేస్తున్నామని తెలిపారు. కమిటీ చేసే సిఫార్సు ఆధారంగా ఇల్లు మంజూరు అవుతుందన్నారు. అర్హుడికి సొంత జాగా ఉంటే ఇల్లు నిర్మించుకోవడానికి రూ. 5లక్షలు మంజూరు చేస్తారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు సంగారెడ్డి, జ్యోతిరెడ్డి, మంగతాయారు పాల్గొన్నారు.

ఈఎస్ఐ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ నాయకులు నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వాతికి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ.. 4 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని చెప్పారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను అధికారులు పిలిచి చెప్పినా ఫలితం రాలేదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి వేతనాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

భవనం హక్కులు బదలాయించుకున్నారని ఫిర్యాదు

శేరిలింగంపల్లి, మియాపూర్, న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా తనకు అద్దె చెల్లించకుండా ఉండడమే కాకుండా, నకిలీ పత్రాలు సృష్టించి తన బహుళంతస్తుల భవన ఆస్తిని బదిలీచేసుకున్నారని, భవనం దగ్గరికి వెళ్తే బెదిరిస్తున్నారని దండు లచ్చిరాజు అనే విశ్రాంత ఉద్యోగి మియాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాలప్రకారం.. లచ్చిరాజు మాతృశ్రీ నగర్‌లో సర్వేనం.44/1లో 389 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. పక్కనే ప్లాట్‌లో స్నేహితుడైన మరో వ్యక్తితో కలిసి భవన నిర్మాణం చేశారు. సదరు భవనంలో ఫాస్మో హాస్పిటాలిటీ సర్వీసెస్ పేరుతో బోయినపల్లి వెంకటేశ్వరరావు అనే వ్యక్తితోపాటు కొందరు డైరెక్టర్లుగా ఉన్న సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించారు. సదరుభవనాన్ని ఇటీవల లచ్చిరాజు కూకట్‌పల్లి జయనగర్‌కు చెందిన చిట్టిబాబు అనే వ్యక్తికి జీపీఏ చేశాడు. తాము భవనం దగ్గరకు వెళ్తే బెదిరిస్తున్నారని, మోసపూరితంగా హక్కులు బదలాయించుకున్నారని చిట్టిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫాస్మో హాస్పిటాలిటి సర్వీసెస్ నిర్వాహకులు బోయినపల్లి వెంకటేశ్వరరావు, తన్నీరు గౌతమ్, గారపాటి నాగరవి, జి.రాజ్‌కుమార్, జంపని ప్రభావతి, టి.పద్మజారావుతో పాటు భవనంలో కొనసాగుతున్న కళాశాలపై చీటింగ్, ట్రెస్‌పాస్, బెదిరింపుల సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. నిందితులు కొందరు గత ప్రభుత్వంలోని ఓ మంత్రికి బంధువులని సమాచారం.

అదుపుతప్పి ఆర్టీసీ బస్సు బోల్తా

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వడియంపేట గ్రామ శివారులో తెలంగాణకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన కల్వర్టు కాలవలోకి దూసుకెళ్లింది. హైదరాబాద్‌లోని మియాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెల్దుర్తి దగ్గర టైరు పంక్చర్ కావడంతో ప్రయాణికులను వేరే బస్సులో గమ్యస్థానాలకు పంపారు. అక్కడి నుంచి ఖాళీ బస్సులో డ్రైవర్, క్లీనర్ అనంతపురానికి బయలుదేరారు. వడియంపేట గ్రామశివారుకు రాగానే ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అడ్డం రావడంతో బస్సు డ్రైవర్ అత్యంత చాకచక్యంగా తప్పించబోయి బస్సును రోడ్డుపక్కనే ఉన్న కల్వర్టు కాలవలోకి మళ్లించాడు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. బస్సు డ్రైవర్ నిఖిల్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మెట్రో-మన యాత్రి ఒప్పందం

రాయదుర్గం, న్యూస్‌టుడే: మెట్రో రైల్వే స్టేషన్లకు.. ఇళ్లు, కార్యాలయాల నుంచి సులభంగా రాకపోకలు (ఎండ్ టు ఎండ్ కనెక్టివిటీ) సాగించేలా ప్రయాణికులకు తగిన రవాణా వసతులు కల్పించేందుకు ప్రాధాన్యమిస్తున్నామని ఎల్ అండ్ టీ మెట్రోరైల్ హైదరాబాద్ ఎండీ కేవీబీ రెడ్డి అన్నారు. రాయదుర్గం టీహబ్‌లో శుక్రవారం మన యాత్రి సంస్థతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. కేవీబీ రెడ్డి, మన యాత్రి సీఈఓ మగిజన్ సెల్వన్ అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. కేవీబీ రెడ్డి మాట్లాడుతూ.. రోజూ మెట్రోలో 5లక్షల మంది ప్రయాణిస్తున్నారని తెలిపారు. మెట్రో రైల్వే స్టేషన్‌లకు తమ ఇళ్లు, కార్యాలయాల నుంచి ప్రయాణికుల రాకపోకలకు ఎదురువుతున్న సవాళ్లను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందుకు మనయాత్రితో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఆ రవాణా యాప్ సంస్థ ఆటోల రవాణా వ్యవస్థను నిర్వహిస్తోందని, ఈ ఒప్పందంతో ప్రయాణికులు ఆటో సేవలు ఉపయోగించుకోవడం ద్వారా రవాణా సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.



ఒప్పంద పత్రాలతో ఎల్ అండ్‌టీ మెట్రోరైల్ హైదరాబాద్ ఎండీ కేవీబీ రెడ్డి, మన యాత్రి సీఈఓ మగిజన్ సెల్వన్

మగిజన్ సెల్వన్ మాట్లాడుతూ.. మన యాత్రిలో 32వేల మంది ఆటోడ్రైవర్లు నమోదై ఉన్నారని తెలిపారు. ప్రయాణికుల ఛార్జీలు నేరుగా డ్రైవర్ల ఖాతాల్లోనే జమ అవుతాయన్నారు. ఇందుకు రోజుకు రూ.20 చొప్పున ఆటో డ్రైవర్ల నుంచి రుసుం సేకరిస్తామని చెప్పారు. ఎల్ అండ్ టీ మెట్రో రైలు వైస్‌ప్రెసిడెంట్ పి.రవిశంకర్, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళీ వరద రాజన్, సీఓఓ సుధీర్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రుషీ వర్మ, సీఎఫ్ఓ ఆలూరి శర్మ, సుదీప్తో మండల్ పాల్గొన్నారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ సర్వీస్ సెంటర్‌కు మొట్టికాయలు

ఈనాడు, హైదరాబాద్: మరమ్మతుల్లో సేవాలోపానికి గచ్చిబౌలిలోని రాయల్‌ఎన్‌ఫీల్డ్ సర్వీస్ సెంటర్‌కు రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ మొట్టికాయలు వేసింది. కూకట్‌పల్లికి చెందిన సాయి ఫిర్యాదును విచారించిన కమిషన్.. రూ.15వేలు చెల్లించాలని సదరు సర్వీస్‌సెంటర్‌ను ఆదేశించింది. ఫిర్యాదీ 2023లో రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని కొనుగోలు చేశాడు. అదే ఏడాది డిసెంబర్‌లో ఓ ప్రమాదంలో వాహనం మరమ్మతులకు గురైంది. ప్రతివాద సంస్థను సంప్రదించి వాహనాన్ని అప్పగించారు. రెండు నెలల తర్వాత సాయికి వాహనాన్ని ఇవ్వగా హెడ్‌లైట్ స్క్రూ ఊడిపోయి ఆ భాగం అటూ ఇటూ ఊగడం, నడపడంలోనూ ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మరో రూ.5వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. మరమ్మతులు సరిగా చేయక ఇబ్బందులు ఎదుర్కొన్నానంటూ ఫిర్యాదీ కమిషన్‌ను ఆశ్రయించాడు.

కళ్లు చెదిరే ఆభరణాలు.. మురిసిన మగువలు



మాదాపూర్, న్యూస్‌టుడే: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో 'హైదరాబాద్ ఇంటర్నేషనల్ జ్యువెలరీ షో (హెచ్ఐజెఎస్)' పేరిట ఏర్పాటు చేసిన బంగారు, వజ్రాభరణాల ప్రదర్శనను శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఆభరణాల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంటుంది. సరికొత్త డిజైన్ బంగారు, వెండి, వజ్రాభరణాలు కొలువుదీరాయి. వివిధ నగరాల వ్యాపారులు తాము డిజైన్ చేసిన ఆభరణాలు, దేవతామూర్తుల విగ్రహాలను, గృహాలంకరణ వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. పలువురు రూపదర్శినులు చూడ ఆభరణాలను ధరించి ఫొటోలకు పోజులిచ్చి సందడి చేశారు. ఈనెల 20 వరకు ప్రదర్శన కొనసాగనుంది.

ఆరుగురికి జరిమానా

పటాన్‌చెరు అర్బన్: మద్యంతాగి వాహనాలు నడిపిన చోదకులకు కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సిబ్బంది నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌తనిఖీల్లో ఆరుగురు మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని సంగారెడ్డి ఉదయపు కోర్టుకు తరలించగా నలుగురికి రూ.2వేల చొప్పున, ఇద్దరికి రూ.1500 జరిమానా న్యాయమూర్తి విధించారు.

సీసీ రహదారులు నాణ్యంగా నిర్మించండి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: సీసీ రహదారులను నాణ్యతతో నిర్మించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ సూచించారు. పటాన్‌చెరు సాయిరాం కాలనీలో రూ.1.13కోట్లతో నిర్మిస్తున్న సీసీరహదారి పనులు శుక్రవారం పరిశీలించారు. ఈనెల 24, 25 తేదీల్లో కటెకబస్తీలో గౌసపాక్‌చిల్లా దర్గా వద్ద గ్యార్వీ షరీఫ్ కార్యక్రమం నిర్వహిస్తున్నందున పారిశుద్ధ్య పనులు కార్మికులతో చేయించారు.

డ్రైనేజీ లైన్ విస్తరించాలి

ఆల్విన్ కాలనీ, న్యూస్‌టుడే: ఆల్విన్ కాలనీ పీజేఆర్ నగర్ కాలనీలో సెప్టిక్ ట్యాంక్ పొంగుతున్న ప్రాంతాన్ని శుక్రవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. త్వరగా డ్రైనేజీ లైన్‌ను విస్తరించాలని అధికారులకు సూచించారు. ● సెప్టిక్ ట్యాంక్ పొంగిన ప్రాంతాన్ని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్ పరిశీలించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

కుత్బుల్లాపూర్

హెచ్ఎంటీ స్థలంలోకి వెళ్లకుండా దారి మూసివేయాలి


స్థానికులతో మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్

షాపూర్‌నగర్: గాజులరామారం డివిజన్ హెచ్ఎంటీ మైదానాన్ని ఆనుకొని ఉన్న శ్రీరాంనగర్, సుభాష్‌చంద్రబోస్‌నగర్, రోడామేస్త్రీనగర్‌లలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ శుక్రవారం పర్యటించారు. బస్తీవాసులు, నవయుగ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఆయనను కలిసి హెచ్ఎంటీ మైదానంలో వ్యర్థ ఘన రసాయనాలను డంపింగ్ చేస్తూ నిప్పంటించడంతో పాటు వాసన వెలువడుతోందని ఫిర్యాదు చేయడంతో ఆయన శుక్రవారం పర్యటించారు. హెచ్ఎంటీ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి శ్రీరాంనగర్ వైపు నుంచి హెచ్ఎంటీ స్థలంలోకి వెళ్లకుండా మార్గాన్ని మూసివేయాలన్నారు. అసోసియేషన్ ఛైర్మన్ జహంగీర్ హుసేన్, అధ్యక్షుడు బలరాం, రాజు, సలీం, బుచ్చిరెడ్డి, పద్మ, మదు, అశోక్, నందుగౌడ్, నర్సింహ, యాదమ్మ, సావిత్రి, లక్ష్మి పాల్గొన్నారు.

బుద్ధవిహార్ గుడిలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పున్నారెడ్డి తదితరులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లోని ధమ్మదీప్ బుద్ధవిహార్ గుడిలో శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి, స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు. 40 ఏళ్లుగా బుద్ధవిహార్ దేవాలయంలో స్థానికులు పూజలు చేయడం ఆనవాయితీ. కార్యక్రమంలో బుద్ధవిహార్ ఆలయ అధ్యక్షుడు సంతోష్‌బాన్సువాడే, ఉపాధ్యక్షుడు దండేరాజు, సభ్యులు అనిల్, రమేష్, సునీల్, గణేష్, రాము, సంతోష్, సంజయ్, బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నవాబ్ పాల్గొన్నారు.

రహదారిపై వ్యాపారాలు.. రాకపోకలకు ఇక్కట్లు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: షాపూర్‌నగర్ రైతుబజారు సమీపంలో రోడ్లపైన పలువురు చిరు వ్యాపారాలు చేస్తుండటంతో నిత్యం వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నర్సాపూర్ ప్రధాన రహదారిపై ఉన్న ఈ మార్కెట్ నిత్యం వినియోగదారులతో కిటకిటలాడుతోంది. రైతుబజారు లోపల హోల్‌సేల్ వ్యాపారులు ఉండటంతో చిరువ్యాపారులంతా రోడ్డుపైనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. పలుమార్లు ట్రాఫిక్ పోలీసులు వీరిని పంపించినా తిరిగి అదేవిధంగా రోడ్డుపైకి చేరిపోతున్నారు. వ్యాపారులు రోడ్డును ఆనుకుని తోపుడుబండ్లను ఏర్పాటు చేయడంతో వినియోగదారులు ప్రధాన రహదారిపైనే వాహనాలను నిలుపుతుండటంతో రోడ్డుపై వాహనాల రద్దీ పెరిగిపోయి ట్రాఫిక్ నిలిచిపోతుంది.


షాపూర్‌నగర్ రైతు బజారులో..

తరచూ ప్రమాదాలు ..

ఇక్కడ తరచూ ప్రమాదాలూ చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుకు అవతలివైపు జీడిమెట్ల పారిశ్రామికవాడ ఉండటంతో వందలాది కార్మికులు ఇక్కడే రోడ్డు దాటుతుంటారు. రైతులు కూడా కూరగాయలను తీసుకుని ఉదయం రోడ్డుకు ఇవతలవైపునకు రావాల్సి ఉంటుంది. రోడ్డు దాటే సమయంలో ఇరుకుగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఇక్కడ ఓ రైతుతో పాటు మరో వ్యక్తి బస్సు ఢీకొని మృతి చెందారు. పోలీసులు చిరు వ్యాపారులను రోడ్డుకు దూరంగా తరలించి ప్రమాదాలు జరగకుండా, ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం.. ప్రమాదకరం

సూరారం నుంచి బహదూర్‌పల్లి వెళ్లే ప్రధాన రహదారి పక్కన హైటెన్షన్ విద్యుత్తు స్తంభాన్ని ఓ జాతికి చెందిన తీగ అలుకుంది. దీంతో తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతోంది. వర్షం కురిసినప్పుడు దాని పక్క నుంచి వెళ్లేటప్పుడు విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశముందని పాదచారులు భయాందోళన చెందుతున్నారు. -న్యూస్‌టుడే, కుత్బుల్లాపూర్



లీకేజీకి మరమ్మతులు



షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం రోడ్డులో ప్రభుత్వ ఆసుపత్రి కూడలిలో తాగునీటి లీకేజీకి జలమండలి అధికారులు మరమ్మతులు చేయించారు. వారం రోజులుగా తాగునీరు వృథాగా పోతుండడంతో ఈ నెల 10న "తాగునీరంతా నేలపాలు" శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎట్టకేలకు లీకేజీకి మరమ్మతులు చేయించారు.

ఈనాడు కథనానికి స్పందన

పోలీసు కస్టడీకి పద్మజారెడ్డి

జీడిమెట్ల,న్యూస్‌టుడే: బతికున్న మనిషి మృతి చెందినట్లు నకిలీ ధ్రువపత్రాలతో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్న భారాస నాయకురాలు పద్మజారెడ్డి అలియాస్ కుత్బుల్లాపూర్ పద్మక్కను జీడిమెట్ల పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. సుభాష్‌నగర్-వెంకటాద్రినగర్‌లోని 200 గజాల స్థలాన్ని ఆక్రమించుకుంది. ఐదుగురితో కలిసి పాన్, ఆధార్ కార్డుల్లో పేర్లను మార్చి యజమాని మృతి చెందినట్లు తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించారు. తర్వాత తన సోదరి పేరిట స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకుంది. స్థల యజమాని ఫిర్యాదుతో ఆమె భాగోతం వెలుగులోకి వచ్చింది. ఈ నెల 4న ఆమెతోపాటు సహకరించిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ పంపారు. తాజాగా మేడ్చల్ జిల్లా న్యాయస్థానం అనుమతితో శుక్రవారం జీడిమెట్ల పోలీసులు ఆమెను కస్టడీకి తీసుకున్నారు. ఆమెను పోలీసులు విచారించినట్లు తెలిసింది. రెండేళ్ల క్రితం గచ్చిబౌలి జిమ్‌లో పరిచయమైన అశోక్ ద్వారా నకిలీ పత్రాలను సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆమె అంగీకరించింది. అతనితోపాటు రాధాకృష్ణ పేరు కూడా తెరపైకి వచ్చింది. అప్పటి నుంచి అశోక్ పరారీలో ఉన్నాడు. అతను పోలీసులకు చిక్కితే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.

కార్మికులకు భూమి కేటాయించాలని వినతి

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: జగద్గిరిగుట్టలో భవన నిర్మాణ కార్మికుల అడ్డాకు స్థలం కేటాయించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర కార్మికశాఖ ఉప కార్యదర్శి గంగాధర్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో జగద్గిరిగుట్టలో కార్మికులు ఏర్పాటు చేసిన అడ్డాలో నిలబడే పరిస్థితి లేదని, చుట్టుపక్కల భవనాలు నిర్మించడంతోపాటు ఆర్టీసీ బస్సులు, ప్రయాణికులతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని పేర్కొన్నారు. స్థానికంగా ఉపాధి పొందుతున్న 500 మంది కార్మికులకు శాశ్వతమైన అడ్డా చూపాలని కోరారు. జగద్గిరిగుట్టలో వందల ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, అందులో కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు కార్మికశాఖ నుంచి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికశాఖ ఉప కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, మండల సీపీఐ కార్యదర్శి ఉమామహేష్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు హరినాథ్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రవి, రాము, సామెల్ పాల్గొన్నారు.


కార్మికశాఖ ఉప కార్యదర్శి గంగాధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూసుఫ్

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

పేట్‌బషీరాబాద్, షాపూర్‌నగర్, దుండిగల్, నిజాంపేట, న్యూస్‌టుడే:

- ఉ.10 నుంచి 11.30 గంటల వరకు
- ప్రాంతాలు: మీనాక్షిఎస్టేట్స్ కాలనీ, స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీ, గ్రీన్‌పార్కు కాలనీ, జీడిమెట్ల గ్రామం,సెయింట్ ఆన్స్ స్కూల్, పేట్‌బషీరాబాద్ ఠాణా, లక్ష్మీగంగా ఎన్‌క్లేవ్, ఎన్సీఎల్ కాలనీ సౌత్
- ఉ.11.30 నుంచి మ.1 గంట వరకు
- ప్రాంతాలు: పేట్‌బషీరాబాద్ పైపులైను రోడ్డు, శ్వేత ఆర్యన్ అపార్టుమెంట్స్, ఆమ్స్ బర్గ్ అపార్టుమెంట్స్, ఆర్వీ నిర్మాణ్ అపార్టుమెంట్స్, జడ్ ఆర్ అపార్టుమెంట్స్, సీఎంఆర్ స్కూల్
- మ. 1 గంట నుంచి మ.3 వరకు
- ప్రాంతాలు: ప్రాగాటూల్స్ కాలనీ, బీహెచ్ఈఎల్ విస్టా, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, ఎన్సీఎల్ గోదావరి అపార్టుమెంట్స్, శాంతా శ్రీరాం అపార్టుమెంట్స్, జీఎల్ఆర్ ఎన్‌క్లేవ్, లక్ష్మీ గంగా ఎన్‌క్లేవ్ పరిసర ప్రాంతాలు
- ఉ.11 నుంచి మ. 12 గంటల వరకు
- ప్రాంతాలు: దేవేందర్‌నగర్, బతుకమ్మబండ, వీనస్‌రాక్‌హైట్స్, వోక్షిత్ హిల్‌వ్యూ కాలనీ, రావినారాయణరెడ్డినగర్, నర్సింహబస్తీ, కైసర్‌నగర్, సాబెర్‌నగర్, ఏరోనాటికల్ కాలనీ, లాల్‌సాబ్‌గూడ
- ఉ.11 నుంచి మ.2 గంటల వరకు
- ప్రాంతాలు: భగత్‌సింగ్‌నగర్, చంద్రానగర్, దుర్గానగర్, స్ఫూర్తినగర్
- మ.12.30 నుంచి 2.30 వరకు
- ప్రాంతాలు: మహదేవపురం, బాలయ్యబస్తీ
- మ. 2 నుంచి సా.4 గంటల వరకు
- ప్రాంతాలు: ద్వారకానగర్, యండమూరి లేఅవుట్, గాజులరామారం గ్రామం, శ్రీరాంనగర్
- ఉ. 10 నుంచి మ.2 గంటల వరకు

ప్రాంతాలు: డీఆర్‌కే కళాశాల, కేఎల్ యూనివర్సిటీ, డాలర్ డ్రీమ్స్, సింహపురి కాలనీ, గోకుల్ బృందావనం, నెస్ట్ విల్లాస్, ఎస్‌బీఐ కాలనీ.

- ఉ.11.30 నుంచి మ.12 గంటల వరకు

ప్రాంతాలు: బౌరంపేట గ్రామం, ఆర్‌కే టౌన్‌షిప్, శిఖర స్కూల్ రోడ్డు, లక్ష్మీనగర్, సూరారం చౌరస్తా, శ్రీరాంనగర్, కృష్ణానగర్

- ఉ. 10 నుంచి 11.30 గంటల వరకు.
- ప్రాంతాలు: ప్రగతినగర్‌లోని మున్సిపల్ ఆఫీసు పరిసరాలు, 60 ఫీట్ల రోడ్డు, జుడియో మాల్ ఏరియా.
- ఉ.11.30 నుంచి మ. 1 గంట వరకు
- ప్రాంతాలు: ప్రగతినగర్ సెంట్రల్ స్కూల్, మూడు కోతుల చౌరస్తా, ఎన్టీఆర్‌నగర్ పార్కు పరిసరాలు
- మ. 1.30 నుంచి 3 గంటల వరకు
- ప్రాంతాలు: ప్రగతినగర్ వాసవి లేఅవుట్, న్యూ విజేత సూపర్ మార్కెట్, రాజీవ్‌గృహకల్ప రోడ్డు
- మ.3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు
- ప్రాంతాలు: మోర్ సూపర్ మార్కెట్ ఏరియా, అంబ భవానీ హోటల్ పరిసరాలు, డాక్టర్స్ కాలనీ.
- ఉ.10 నుంచి మ.2 గంటల వరకు
- ప్రాంతాలు: సాయికృష్ణ కాలనీ ఏరియా, లహరి గ్రీన్ పార్కు పరిసరాలు, ఇందిరమ్మ కాలనీ
- ఉ.11 నుంచి మ.2 గంటల వరకు
- ప్రాంతాలు: రామభద్ర ఎన్‌క్లేవ్, నయరా పెట్రోల్ పంపు, హైరైస్ ఫేజ్-1, భవ్యాస్ ఆనందం, వెంకటసాయి ఎన్‌క్లేవ్, బాటా షోరూం ఏరియా, ఈశ్వర్ విల్లాస్, హెరిటేజ్, పాలంపల్లి విల్లాలు, బాలాజీ పార్కు టౌన్ పరిసరాలు

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించండి

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: సిమెంటు రోడ్ల నిర్మాణంలో విధిగా నాణ్యత పాటించాల్సిన బాధ్యత గుత్తేదార్లపై ఉందని రాష్ట్ర పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ మహ్మద్ జాకీర్ అన్నారు. 131 డివిజన్‌లోని వివిధ కాలనీల్లో రూ. కోటి వ్యయంతో చేపట్టిన సిమెంటు రహదారి నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్. బాలయ్య, రమేష్‌యాదవ్, రాములు తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న రాష్ట్ర పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ మహ్మద్ జాకీర్

బస్తీల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలి

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం డివిజన్‌లో కార్పొరేటర్ రావుల శేషగిరి శుక్రవారం ఉదయం పర్యటించారు. ఆయా కాలనీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందితో సమావేశమై.. డివిజన్‌లో పారిశుద్ధ్య పనులపై సమీక్షించారు. ఉదయం ఎన్ని గంటలకు విధులకు హాజరవుతున్నారు.. ఏఏ బస్తీల్లో సమస్య తీవ్రంగా ఉందని వారితో మాట్లాడి తెలుసుకున్నారు. సమస్యాత్మక బస్తీల్లో తెల్లవారుజాము నుంచే విధులు నిర్వహించాలని.. ఎప్పటికప్పుడు చెత్త తొలగించి డంపింగ్ యార్డును తరలించేలా కృషి చేయాలని సూచించారు.


కార్మికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శేషగిరి

చెస్ టోర్నీ రేపు

హైదరాబాద్, ఈనాడు: వారాస్ చెస్ అకాడమీ ఆదివారం హైదరాబాద్‌లో అంతర్జాతీయ ర్యాపిడ్ ఫిడె రేటింగ్ చెస్ టోర్నీ నిర్వహించనుంది. ఆదర్శ్ నగర్‌లోని జీపీ బిర్లా సెంటర్‌లో పోటీలు జరుగుతాయి. టోర్నీ ప్రైజ్ మనీ రూ.3 లక్షలు. మరిన్ని వివరాలకు 8187093036 నంబర్లో సంప్రదించవచ్చు.

కేక పుట్టించిన కూత

హైదరాబాద్, ఈనాడు: కబడ్డీ కబడ్డీ అంటూ స్టార్ ఆటగాళ్లు పాయింట్ల కూత పెడుతుంటే.. ప్రత్యర్థి రైడర్లను డిఫెండర్లు పట్టేస్తుంటే.. తెలుగు అభిమానులు కేరింతలు కొట్టారు. శుక్రవారం గచ్చిబౌలి స్టేడియంలో ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్ ఆరంభమైంది. ఈ కబడ్డీ మ్యాచ్‌లు అభిమానులను అలరించాయి. తొలి మ్యాచ్‌లో సొంతగడ్డపై తెలుగు టైటాన్స్ చెలరేగి బెంగళూరు బుల్స్‌ను మట్టికరిపించింది. మరో మ్యాచ్‌లో యు ముంబాపై దబంగ్ దిల్లీ గెలిచింది. బాలీవుడు నటీనటులు విద్యాబాలన్, కార్తీక్ ఆర్యన్ ముఖ్య అతిథులుగా సందడి చేశారు.

దేశ ముఖచిత్రాన్ని మార్చేది విద్యే

- హైసియా విద్యా సదస్సులో మంత్రి సీతక్క

రాయదుర్గం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు సీఎస్‌ఆర్ నిధులను వెచ్చించాలని, ఒక్కో గ్రామాన్ని దత్తతకు తీసుకుని అన్నివిధాలా దన్నుగా నిలవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ సంస్థ సమావేశం మందిరంలో శుక్రవారం హైసియా (హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్) ఆధ్వర్యంలో విద్యా సదస్సు నిర్వహించారు.

మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి కట్టుబడి ఉందని, ఇందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్న తెలిపారు. విద్యా సదస్సు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సారం లేని భూమి విద్య లేని జీవితం ఒకటేనని చెప్పారు. దేశముఖ చిత్రాన్ని మార్చగలిగేది విద్య మాత్రమేనని అన్నారు. సమాజంలో విద్య అందడంలో ఇంకా అంతరాలున్నాయని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యా అవకాశాల్లో ఆకాశానికి భూమికి ఉన్నంత తేడా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు మైదాన ప్రాంతాలు, అటవీ ప్రాంతాల మధ్య విద్య విషయంలో ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడలేకపోతున్నారని, అందుకే విద్యలో ఉన్న అంతరాలను తొలగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సమానత్వ సాధనలో విద్య కీలకమని, హైదరాబాద్‌లో తరహా విద్య మారుమూల పల్లెల్లోనూ ఉండాలన్నారు. తమ ప్రభుత్వం ఆ దిశగా కృషి చేస్తోందని తెలిపారు. ఇందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని కోరారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని, అప్పుడే సమాన అవకాశాలు లభిస్తాయని చెప్పారు. తమ ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యమిస్తోందని వివరించారు.

మల్కాజిగిరి-మేడ్చల్ జిల్లా టీపీసీసీ లేబర్ సెల్ అధ్యక్షుడిగా సుదర్శన్‌రెడ్డి

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: మల్కాజిగిరి- మేడ్చల్ జిల్లా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లేబర్ సెల్ అధ్యక్షుడుగా కొంపల్లికి చెందిన సుదర్శన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర లేబర్ సెల్ ఛైర్మన్ ఆర్.ప్రకాశ్‌గౌడ్ తన కార్యాలయంలో శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.


నియామక పత్రం అందజేస్తున్న ప్రకాశ్‌గౌడ్

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

ఈనాడు, హైదరాబాద్: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి శుక్రవారం తెలిపారు. నిర్వాహకులు ఈ నెల 24 లోగా డీసీపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అగ్నిమాపక అధికారి, జీహెచ్ఎంసీ, ప్రైవేటు వ్యక్తుల స్థలమైతే వారి నుంచి నిరంభ్యంతర పత్రం, గతేడాది లైసెన్స్, సైట్ ప్లాన్ జతచేసి.. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, గృహకల్ప బ్రాంచ్, నాంపల్లి పేరిట రూ.600 చలానా చెల్లించి తాత్కాలిక లైసెన్స్ పొందాలన్నారు. సరైన పత్రాలు లేని దరఖాస్తులు స్వీకరించబోమని పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: వివాహిత అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం... గాజులరామారం ప్రాంతానికి చెందిన వివాహిత(25) ఈనెల 11న భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లింది. ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ ఉంది. వారం రోజులుగా ఆమె ఆచూకీ కోసం వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్‌కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్వహణ లోపం.. వరికోత యంత్రాలకు తుప్పు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ సంస్థలో వ్యవసాయ యంత్రాల నిర్వహణను గాలికి వదిలేశారు. వ్యవసాయాభివృద్ధికి నిధులు వెచ్చించి కొనుగోలు చేసిన వరికోత వంటి యంత్రాలను ఆరుబయట ఉంచారు. రైతులకు రాయితీపై అందజేసేందుకు సమకూర్చుకున్న మరికొన్ని యంత్ర పరికరాలను చిన్న చిన్న మరమ్మతుల పేరిట పక్కన పెట్టారు. ఎండకు ఎండి.. వానకు తడిసి పనికిరాకుండాపోయాయి. యంత్రాలను అమ్మడానికి టెండర్లు నిర్వహించినా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాకపోడంతో తుక్కులో చేర్చి మిన్నకుండడం విమర్శలకు తావిస్తోంది.

ఐదేళ్లుగా ఆరుబయటే..

చింతల్‌లోని ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల ఆగ్రోస్ సంస్థ ప్రాంతీయ కార్యాలయం అధికారులు 2014లో సుమారు రూ.30 లక్షలు వెచ్చించి వరికోత యంత్రాన్ని కొనుగోలు చేశారు. మొదట్లో పొరుగు సేవల విభాగం డ్రైవర్‌ను నియమించి దాన్ని రైతులకు అద్దెకిచ్చారు. క్రమేణా సంస్థ కార్యశాలలో ఉత్పత్తులు స్తంభించిపోవడతో పొరుగు సేవల సిబ్బందికి వేతనాలు చెల్లించే పరిస్థితి లేక వారిని విధుల నుంచి తొలగించారు. వరికోత యంత్రం డ్రైవరు కూడా వైదొలగడంతో తాత్కాలిక డ్రైవర్‌ను నియమించి కొన్నాళ్లు పనిచేయించారు. అది మరమ్మతులకు రావడంతో ఐదేళ్లుగా కార్యాలయం ఆవరణలో పక్కన పెట్టారు. వానకు తడిసి, ఎండకు ఎండి తుప్పపట్టాక 2021 డిసెంబరులో ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించగా కొనడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో దాన్ని కార్యాలయం ఆవరణలోనే నిలిపారు.



జగిత్యాల యంత్రాలకు అదే గతి

జగిత్యాల జిల్లా ఆగ్రోస్ కార్యాలయానికి చెందిన రూ. 30 లక్షల విలువచేసే మరో వరి కోత యంత్రం.. రూ.1.5 కోట్ల విలువచేసే ఆరు డోజర్లు తుప్పుపట్టాయి. వాటిని కూడా విక్రయించడానికి టెండర్లు నిర్వహించగా ఎవరూ ముందుకు రాలేదు. స్థలాభావం వల్ల వాహనాలను ఇక్కడికే తరలించి ఆరుబయట పార్కింగ్ చేశారు.


గతంలో రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాల్లో అమ్ముడుపోగా మిగిలిన రూ. 10.50 లక్షల విలువచేసే పలు వ్యవసాయ యంత్ర పరికరాలు చింతల్‌లోని కార్యశాల షెడ్డులోనే ఉన్నాయి.

పరిస్థితి ఉన్నతాధికారుల దృష్టికి

– వెంకన్న, ప్రాంతీయ అధికారి చింతల్ ఆగ్రోస్ కార్యాలయం.

వరికోత యంత్రాలకు మూడేళ్ల క్రితం టెండర్లు నిర్వహించగా కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఆరుబయట పార్కింగ్ చేశాం. అవి వానకు తడిసి..ఎండకు ఎండి తుప్పుపడతున్నాయి. ఈ విషయాన్ని ఇటీవల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి అనుమతితో మరోసారి వాటి విక్రయానికి టెండర్లు నిర్వహించేందుకు చర్యలు చేపడుతాం.

ప్రమాదాల లెక్క.. తగ్గించాలి పక్కా



• నిర్వహణ లోపాలు.. లేని సూచికలు
• ఓయూ పరిశోధక బృందం అధ్యయనం

మెట్రో నగరాలు, జాతీయ రహదారులపై పెరుగుతున్న ప్రమాదాలను తగ్గించాలంటే రహదారి భద్రత గణన (రోడ్‌సేఫ్టీ ఆడిట్) నిర్వహించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పట్టణ పర్యావరణ అధ్యయన ప్రాంతీయ కేంద్రం పరిశోధక బృంద సభ్యులు నిర్ధారించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయిల్లో ఈ 9 నెలల్లో ప్రమాదాల సంఖ్య పెరిగిందని, వీటిని నియంత్రించపోతే పెరిగే అవకాశాలున్నాయని హెచ్చరించారు. రెండేళ్లలో మెట్రో నగరాలలోని రహదారులు, వాటికి సమీపంలోని జాతీయ రహదారులపై నమోదైన ప్రమాదాలను విశ్లేషించారు. నిర్వహణ లోపాల కారణంగా 40 శాతం జరుగుతున్నాయని గుర్తించారు. రోడ్ సేఫ్టీ ఆడిట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించి చర్యలు చేపడితే రోడ్డు ప్రమాదాలను 10 నుంచి 20 శాతానికి తగ్గించవచ్చని పట్టణ పర్యావరణ అధ్యయన ప్రాంతీయకేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ కుమార్ తెలిపారు.

రహదారుల నిర్మాణం... వాహనాల రాకపోకలు: ప్రమాదాలు తగ్గించేందుకు రహదారుల నిర్మాణం, వాహనాల రాకపోకలపై సమగ్ర సమాచారం ఉండాలి. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) మార్గదర్శకాలకు అనుగుణంగా వాహనాల రాకపోకల పెరుగుదలను అంచనా వేసి అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణంలో వినియోగించాలి. హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారుల నిర్మాణ సమయంలో, అందుబాటులోకి వచ్చాక లెక్కలన్నీ మారిపోయాయి. పండగ సెలవులొస్తే చాలు అన్ని టోల్‌గేట్ల వద్ద విపరీతమైన రద్దీ ఉంటోంది. దీంతో రహదారులపై ఒత్తిడి పెరిగి తరచూ ప్రమాదాలు నమోదవుతున్నాయి.

లెక్కల గణనలో అన్ని వివరాలు..

జాతీయ, రాష్ట్ర రహదారులపై చోటుచేసుకుంటున్న ప్రమాదాలపై ఉస్మానియా విశ్వవిద్యాలయం పట్టణ, పర్యావరణ అధ్యయన ప్రాంతీయ కేంద్రం పరిశోధక బృంద సభ్యులు అధ్యయనం చేశారు. నగరంలోని రహదారులు, బాహ్యవలయ రహదారి, హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-బెంగళూరు రహదారులపై సైన్‌బోర్డులు, రేడియం బోర్డులు కొన్ని ప్రాంతాల్లో లేవని గుర్తించారు. హైదరాబాద్-విజయవాడ రహదారిపై రాత్రివేళల్లో ట్రక్కులు, లారీలను నిలపడంతో వాహనదారులు వాటిని గమనించక ఢీకొడుతున్నారన్నారు.

ప్రయోజనాలు... నియంత్రణ

- రహదారి భద్రతను సమీక్షించే ఆడిట్ వ్యవస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద లేదు. జాతీయ రహదారి నిర్వహణ సంస్థ అధికారులు కొన్ని మార్గాల్లో వీటిని ఏర్పాటు చేయాలి.
- ఈ ఆడిట్‌ను పర్యవేక్షించే అధికారులు జాతీయ, రాష్ట్ర రహదారుల మరమ్మతులపై ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలను సమర్పించేందుకు వీలుంటుంది. నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.
- ఆడిట్ ద్వారా ఒక రహదారిపై ఎన్ని ప్రమాదాలు జరిగాయి? ఎందుకు జరిగాయి? తెలిస్తే ప్రమాదాలు తగ్గించే వీలుంటుంది.

- ఈనాడు, హైదరాబాద్

అభివృద్ధిలో కంపెనీ సెక్రటరీలు కీలకం



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

అమీర్‌పేట, న్యూస్‌టుడే: తెలివితేటలు, నైపుణ్యంతో ప్రగతిని పరుగులెత్తించడం, సామాజిక బాధ్యతలు నిర్వర్తించడంలో కంపెనీ సెక్రటరీల బాధ్యతలు కీలకమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. కంపెనీల పురోగభివృద్ధి, మేనేజ్‌మెంట్ రంగాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నారని కొనియాడారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) 16వ ప్రాంతీయ సదస్సును అమీర్‌పేటలోని సెస్ ఆడిటోరియంలో శుక్రవారం ప్రారంభించారు. 'ఇండెల్జెన్స్ ఆఫ్ ఇంటలిజెన్స్' అంశంతో ప్రారంభించిన సదస్సులో గవర్నర్ ప్రసంగించారు. కంపెనీల మధ్యవర్తిత్వం, దివాలా, వాల్యుయేషన్, ఫోరెన్సిక్ ఆడిట్, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి అంశాల్లో కంపెనీల సెక్రటరీలు అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. మారిటైమ్‌లా, క్యాపిటల్ మార్కెట్ వంటి రంగాల్లో ఐసీఎస్ఐ కంపెనీ సెక్రటరీలను తయారు చేస్తుండటం అభినందించాల్సిన విషయమన్నారు. కంపెనీ సెక్రటరీల కోర్సులు అభ్యసించే ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులకు ఫీజుల్లో మినహాయింపు ఇవ్వడం సంతోషించదగిన విషయమని ఐసీఎస్ఐ ప్రతినిధులను ప్రశంసించారు. కంపెనీ సెక్రటరీ 2023 పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచి హైదరాబాద్ చాప్టర్ టాపర్‌గా నిలిచిన కృష్ణ అగర్వాల్‌కు ప్రశంసాపత్రం అందజేశారు.

2047 నాటికి 2 లక్షల మంది అవసరం: ఐసీఎస్ఐ జాతీయ అధ్యక్షుడు బి.నరసింహన్ మాట్లాడుతూ.. 2047 నాటికి 30 ట్రిలియన్లుగా జీడీపీ వృద్ధి చెందినప్పుడు దేశానికి 2 లక్షల మంది కంపెనీ సెక్రటరీలు అవసరమవుతారన్నారు. మార్కులతో సంబంధం లేకుండా 10+2 తత్సమాన ఉత్తీర్ణత, బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన ఉత్తీర్ణత కలిగిన ఈశాన్య, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల విద్యార్థులకు ఫీజు మినహాయింపు ఇస్తామన్నారు. మారిటైమ్‌లాలో ఎంబీఏ కలిగిన కంపెనీ సెక్రటరీల కోసం గుజరాత్ న్యాయ వర్సిటీతో ఐసీఎస్ఐ ఒప్పందం చేసుకుందన్నారు. ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ భవన నిర్మాణానికి వచ్చేనెలలో భూమిపూజ నిర్వహించనున్నట్లు ఐసీఎస్ఐ సభ్యులు ఆర్.వెంకటరమణ తెలిపారు. ఐసీఎస్ఐ ఉపాధ్యక్షుడు ధనుంజయ్ శుక్లా, ప్రదీప్ బి.కులకర్ణి, మహదేవ్ తిరునగరి, జి.ఎస్.ఎల్.ఎన్.గుప్తా పాల్గొన్నారు.

మున్నూరుకాపు వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ నేడు, రేపు



ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక 'ఈనాడు పెళ్లిపందిరి' మున్నూరుకాపు అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ అవకాశం కల్పిస్తోంది. ఈనెల 19, 20 తేదీల్లో (శని, ఆదివారాల్లో) సోమాజిగూడలోని 'ఈనాడు' కార్యాలయంలో వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, వారి కుటుంబీకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 వరకు ప్రొఫైల్ రిజిస్టర్ చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 8008001686, 9154992572లో సంప్రదించవచ్చు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ వాట్సాప్ ద్వారానూ చేసుకోవచ్చని అందుకు వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన ఫోన్ నంబర్లకు పంపవచ్చన్నారు.



జాలీగా పెడితే.. నిర్లక్ష్యంతో ఊడితే

బీహెచ్ఈఎల్ చౌరస్తాలో ఇందిరాగాంధీ విగ్రహం చుట్టూ పచ్చ గడ్డికి బదులు పిచ్చి మొక్కలు పెరిగాయి. ఐల్యాండ్ చుట్టూ ఉన్న గ్రిల్స్ ఊడిపోయి కళావిహీనంగా మారింది

తల్లిదండ్రుల గొడవ
మనస్తాపంతో కుమారుడి ఆత్మహత్య

జవహర్‌నగర్: తల్లిదండ్రులు తరచూ గొడవ పడుతుండటంతో మనస్తాపానికి గురై కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జవహర్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాలాజీ నగర్ శ్రీరామ్‌నగర్ కాలనీలో రేపని స్వామి (22) కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. కొన్నిరోజులుగా అతడి తల్లిదండ్రులు తరచూ గొడవ పడుతున్నారు. స్వామి తల్లిదండ్రులకు గొడవలు పడొద్దని నచ్చజెప్పాడు. అయినా ఈనెల 17న మరోసారి తీవ్రస్థాయిలో గొడవపడుతున్నారు. దీంతో మనస్తాపం చెంది స్వామి తన గదిలోకి వెళ్లి తలుపేసుకున్నాడు. శుక్రవారం తల్లిదండ్రులు గమనించగా అప్పటికే స్వామి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం చేసేందుకు గాంధీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్ర నిర్మాణానికి పన్ను మినహాయించండి


సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించిన కుందారం గణేష్‌చారి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: యాదాద్రిలో విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం భవన నిర్మాణానికి పన్నులు, అనుమతి రుసుముల నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ బీసీ కుల సంఘాల ఐకాస రాష్ట్ర ఛైర్మన్ కుందారం గణేష్‌చారి కోరారు. శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులతో.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆయన విజ్ఞప్తి చేశారు. యాదాద్రిలో గతంలో వెయ్యి చదరపు గజాలలో ఉన్న విశ్వబ్రాహ్మణ సత్రం భవనాన్ని, స్థలాన్ని.. నూతన ఆలయ నిర్మాణం సందర్భంగా వాహనాల పార్కింగ్ నిమిత్తం స్వాధీనం చేసుకున్నారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో కొత్తగా నిర్మించనున్న నిత్యాన్నదాన సత్రం భవనానికి పన్నుల నుంచి తమకు మినహాంపునివ్వాలని విజ్ఞప్తి చేశారు.

కుల గణనకు పార్టీలు సహకరించాలి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కుల గణన ప్రక్రియకు అన్ని పార్టీలు సహకరించాలని బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శుక్రవారం బీసీ ప్రతినిధి బృందంతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, తెజస వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాంను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలిచ్చారు. ఈనెల 20న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశం ఉంటుందన్నారు.

మూసీ సుందరీకరణ చేపట్టాలి: కిషన్‌రెడ్డి

గాంధీనగర్, న్యూస్‌టుడే: మూసీకి ఇరువైపులా ప్రహరీ నిర్మించి సుందరీకరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ హరిత అపార్ట్‌మెంట్ వీధిలో రూ.54.45 లక్షలతో చేపట్టనున్న సీవరేజి పైపులైన్ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావనితో కలిసి ప్రారంభించారు. ముషీరాబాద్ తహశీల్దారు ప్రతాప్‌సింగ్, జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభావ శీలురు.. తప్పుడు ప్రకటనలు

అసాంఘిక కార్యకలాపాలకు సామాజిక మాధ్యమాల్లో వత్తాసు



ఈనాడు, హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో ప్రభావశీల (ఇన్‌ఫ్లుయెన్సర్) వ్యక్తుల పేరుతో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు వత్తాసు పలుకుతున్నారు. కాసులకు కక్కుర్తిపడి బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్, ట్రేడింగ్ తదితర యాప్‌లకు ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవపట్టిస్తున్నారు. రాష్ట్రంలో వీటిపై నిషేధమున్నా అవేవీ పట్టనట్లు ప్రచారం చేస్తున్నారు. గ్యాంబ్లింగ్‌కు అలవాటుపడి వేలాది మంది యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వందల సంఖ్యలో ఆత్మహత్యలు నమోదవుతున్నాయి. వీటి కట్టడికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటుంటే కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్ల మాటున బెట్టింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. గ్యాంబ్లింగ్‌ను ప్రోత్సహిస్తే చట్టప్రకారం చర్యలుంటాయని కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ(సీసీపీఏ) హెచ్చరించినా అదే ధోరణి కొనసాగుతోంది. కొన్ని నెలలుగా గేమింగ్, డేటింగ్ యాప్‌లపై సామాజిక మాధ్యమాల్లో ప్రచార వీడియోలు భారీగా పెరుగుతున్నాయి. ఈ తరహా వీడియోల్ని తమ దృష్టికి తీసుకొస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

ఒక్క రీల్‌కు రూ.లక్షలు

ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో వీడియోలు, రీల్స్ చేస్తూ వేలు, లక్షల సంఖ్యలో ఫాలోవర్లను పెంచుకుంటున్నారు. ఈ వీడియోలు వేర్వేరు ఖాతాల ద్వారా కొన్ని లక్షల మందికి చేరుతుంటాయి. ఇలా ఎక్కువ మంది ఫాలోవర్లు, ప్రజలపై ఎంతోకొంత ప్రభావం చూపే సామాజిక మాధ్యమ ఇన్‌ఫ్లుయెన్సర్లతో తమ ఉత్పత్తులకు ప్రచారం చేయించేందుకు అనేక సంస్థలు పోటీపడుతుంటాయి. దీన్ని బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల్లో ఉండే సైబర్ ముఠాలు కొన్ని నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్లు సృష్టించి వీరితో ప్రచారం చేయించుకుంటున్నాయి.

- ఓ యువకుడు తరచూ కొత్త ప్రాంతాలకు వెళ్తూ అక్కడి విశేషాలు, వింతలపై వీడియోలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తుంటాడు. కొత్త ప్రాంతాలకు వెళ్లడానికి డబ్బు ఎలావస్తుందని కామెంట్ చేయగా. బెట్టింగ్ యాప్‌తో డబ్బు సంపాదిస్తున్నానని ఏకంగా వీడియో పోస్టు చేశాడు.
- ఇన్‌స్టాగ్రామ్‌లో వేలల్లో ఫాలోవర్లున్న అతడి వీడియోలంటే తెలుగు రాష్ట్రాల్లో భలే క్రేజ్. అలాంటి వ్యక్తి బెట్టింగ్ యాప్ వాడి డబ్బు సంపాదించాలంటూ తన ఖాతాలో వీడియో పోస్టు చేశాడు.


నమ్మి మోసపోతున్నారిలా..!

బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ ప్రభావంపై అవగాహన లేని యువత ఇన్‌ఫ్లుయెన్సర్ల మాటల్ని గుడ్డిగా నమ్ముతూ మూల్యం చెల్లించుకుంటున్నారు. వేల సంఖ్యలో ఫాలోవర్లుండే ఖాతాదారులు తాము రూ.లక్షల్లో సంపాదిస్తున్నామంటూ దర్పం ప్రదర్శిస్తుంటారు. తాము కొన్ని బెట్టింగ్, ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లు వినియోగిస్తూ ఆదాయం పొందామని కొన్ని నకిలీ వీడియోలు చేసి పోస్టు చేయడం చూసి నిజమేనని భావిస్తున్నారు. ఇదంతా నిజమేనని భావించే కొందరు బెట్టింగ్, ట్రేడింగ్ చేసి చేస్తూ మోసపోతున్నారు.

గుర్తిస్తే కేసులే

- రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌పై గతంలోనే నిషేధం విధించింది. ఆన్‌లైన్ గేమింగ్‌ను ప్రోత్సహించినా శిక్షార్హులు అవుతారు. ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల్లో బెట్టింగ్‌కు ప్రచారం కల్పించడం, వాటిని ప్రోత్సహించడం నిషేధం.
- నకిలీ వెబ్‌సైట్లపై ప్రచారంతో ప్రజల్ని తప్పుదోవ పట్టించినందుకు క్రిమినల్ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

హోంవర్క్ చేయలేదని చొక్కా విప్పించి..
మోకాళ్లపై కూర్చోబెట్టిన ఉపాధ్యాయులు



మేడ్చల్ రూరల్ న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో ఇచ్చిన హోంవర్క్‌ను పూర్తి చేయలేదని విద్యార్థుల చొక్కాలు విప్పించి మోకాళ్లపై కూర్చొబెట్టి కొంతమంది ఉపాధ్యాయులు రాయించారు. ఈ విషయం విద్యార్థి సంఘాలకు తెలియడంతో వివాదమయ్యింది. మేడ్చల్ మున్సిపల్ పరిధి పూడూరు సెయింట్ మేరీస్ పాఠశాలలో శుక్రవారం 12 మంది విద్యార్థులు ఇచ్చిన పనిని చేయకుండా పాఠశాలకు వచ్చారు. విద్యార్థులను తరగతి గది బయటకు రప్పించి చొక్కాలు విప్పించారు. ఉపాధ్యాయులు దాంతో సరిపెట్టుకోకుండా గంటకుపైగా మోకాళ్లపై కూర్చోబెట్టి వారిని హోంవర్క్ చేయించారు. చొక్కా విప్పించిన ఘటనపై పాఠశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

నైపుణ్య మానవ వనరులకు కేంద్రంగా నగరం


మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

రాయదుర్గం, న్యూస్‌టుడే: ప్రతిభ, నైపుణ్యమున్న మానవ వనరులకు నగరం కేంద్రమని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రాయదుర్గం టీహబ్‌లో శుక్రవారం జీసీసీ(గ్లోబల్ కేపెబిలిటీ సెంటర్స్) ఇన్నోవేషన్ సమ్మిట్ (ప్రపంచ సామర్థ్య కేంద్రాల ఆవిష్కరణ సదస్సు)లో ఆయన ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. 'నగరంలోని జీసీసీలు ప్రపంచానికి సరికొత్త ఉత్పత్తులను అందిస్తున్నాయి.. రాష్ట్రం ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు ఆవిష్కరణలు, పారిశ్రామికాభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఏటా రాష్ట్రంలో 2.5 లక్షల వరకు గ్రాడ్యుయేట్లు శ్రామిక శక్తిలో వచ్చి చేరుతున్నారు. ఏఐకు ప్రాధాన్యం..: కృత్రిమ మేధ(ఏఐ)కు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ప్రపంచ ఏఐ సదస్సు నగరంలో నిర్వహించాం. 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటుచేస్తున్నాం. నగరంలో యూనికార్న్ సంస్థలు పెరిగేలా చూడాల్సిన అవసరం ఉంది. జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. టీహబ్‌తోపాటు నగరంలో మరో 64 ఇంక్యుబేటర్లున్నాయని తెలిపారు. పలు జీసీసీ సంస్థల ప్రతినిధులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో టీహబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ శ్రీకాంత్‌లంక, ఏఎస్ఎస్ఆర్ సహ వ్యవస్థాపకుడు విక్రమ్ అహూజా తదితరులు పాల్గొన్నారు.



దసరా సెలవుల అనంతరం విద్యార్థులు వసతిగృహాలకు చేరుతున్నారు. వారికి దుస్తులు, తినుబండాలు పెట్టెలనిండా నింపి వాటిని మోస్తూ వెళ్తున్న పెద్దలు చేవెళ్ల కూడలిలో కనిపించారిలా..

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి


అధికారులకు సూచనలు ఇస్తున్న ఇలంబర్తి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి నగర ప్రజలకు మెరుగైన సేవలందించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తి హెచ్ఓడీలకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు.

మేయర్‌ను కలిసిన కమిషనర్: జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.ఇలంబర్తి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

హైడ్రా కమిషనర్ భేటీ: ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యలపై ఇరు శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు.

నగరంలో ఈనాడు

- సాలార్‌జంగ్ మ్యూజియం ఈస్ట్ బ్లాక్ గ్యాలరీలో ఉదయం 11 గంటలకు 'హద్దులు లేని కళ: వైవిధ్యం' ఎగ్జిబిషన్ ప్రారంభం
- మెహిదీపట్నం గారిసన్‌లోని వీర్ కున్వర్ సింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బైసన్ డివిజన్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు రహదారి భద్రత సదస్సు
- గచ్చిబౌలి బ్రహ్మకుమారీస్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో సాయంత్రం 5 గంటలకు భరత నాట్య ప్రదర్శన
- రవీంద్రభారతిలో సాయంత్రం 6 గంటలకు 'పోటెత్తిన కెరటాన్ని', 'నియంత అంతం' పుస్తకాల ఆవిష్కరణ
- బంజారాహిల్స్ తాజ్ డెక్కన్‌లో సాయంత్రం 6 గంటలకు గ్లోబల్ పర్యాటక అవార్డుల ప్రదానం
- మాదాపూర్ హెచ్ఐసీసీలో సాయంత్రం 6 గంటలకు హైబిజ్ హెల్త్‌కేర్ అవార్డుల ప్రదానం.


మాజీ సీఎం అంజయ్యకు నివాళి


అంజయ్య విగ్రహం వద్ద స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య 38వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం లుంబినీ పార్కులోని ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలు వేసి నివాళి అర్పించారు. శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్‌అలీ, ఎంపీ గడ్డం వంశీ, ఎంఐఎం ఎమ్మెల్సీ రహమత్ అలీ బేగ్, తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, మీడియా అకాడమి ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, జితేందర్‌రెడ్డి, కేవీపీ రామచందర్‌రావు తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

క్షణికావేశం.. జీవితాలు బలి

ఈనాడు, హైదరాబాద్



• నగరంలో పెరుగుతున్న ఆత్మహత్యలు
• ఆర్థిక సమస్యలు, ఒత్తిడి భరించలేక పోవడమే కారణం

ప్రేమ, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు... కారణమేదైనా కొందరు ఆత్మహత్యే శరణ్యంగా భావిస్తున్నారు. నగరంలో కొన్ని రోజులుగా వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. బలవన్మరణాలకు ఎక్కువగా ఆర్థిక సమస్యలు, ఒత్తిడి భరించలేకపోవడం కారణంగా ఉన్నాయి. తాజాగా హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నష్టపోయిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని భరించలేక అతని తల్లి ఆత్మహత్యకు యత్నించారు. నార్సింగి రాణా పరిధిలో ఓ మహిళ మూడేళ్ల కూతురితో 18వఅంతస్తు నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు.

సమస్య చిన్నదైనా..: యుక్త వయసులో పలువురు ఒత్తిడి తట్టుకోలేకపోవడం, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. సమస్య చిన్నదే అయినా కొందరు తీవ్రంగా ఆలోచిస్తుంటారు. ఆత్మహత్యలకు ప్రధానంగా మూడు కారణాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. వ్యక్తిగత నేపథ్యంతో పాటు మానసిక, సామాజిక పరిస్థితులు విపరీత ప్రభావం చూపిస్తాయి. వృత్తిపరమైన ఒత్తిడి, ఆర్థిక పరిస్థితులు, జీవితంలో జరిగే కొన్ని ఘటనలు, సొంతమని భావించే వ్యక్తుల అకాల మరణంతో ఒక్కసారిగా మనోవేదన ప్రారంభమవుతుంది. మరణం తప్ప మరోదారి లేదనే భావనతో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు.

• నగరంలో 10 రోజుల్లో ఏకంగా 20 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. • రోడ్డు ప్రమాదాల్లో 15-29 ఏళ్ల మధ్య వయసున్న యువత ఎక్కువగా మరణిస్తుండగా.. రెండో స్థానంలో ఆత్మహత్యలుండడం కలవరపెడుతోంది.

90 శాతం నివారించొచ్చు..

• బాధితుల ప్రవర్తన గుర్తిస్తే ఆత్యహత్యల్లో 90 శాతం నివారించొచ్చని మానసిక వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు వారు పలు సూచనలు చేస్తున్నారు. • ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు కుటుంబసభ్యులు, సహచరులతో ప్రవర్తన కొత్తగా ఉంటుంది. • ఒంటరిగా ఉంటారు. ఇతర ప్రాంతాలు, వేడుకలు, కార్యక్రమాలకు వెళ్లేందుకు ఇష్టపడరు. • కొందరు తాము జీవించి లాభం లేదంటూ తరచూ బాధపడుతుంటారు. • కుటుంబ సభ్యులకు భారంగా మారామని ఆవేదన చెందుతారు. ఇష్టమైన పనులు చేయలేరు. • కుటుంబం, స్నేహితులకు దూరంగా ఉంటారు. ఖరీదైన వస్తువులను దానం చేస్తుంటారు. • పని అప్పజెబితే నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తారు. దేన్నీ తీవ్రంగా పరిగణించరు. డ్రగ్స్, మద్యం విపరీతంగా తీసుకోవడం ఒక లక్షణం. • నిరాశలో ఉంటూ చిరాకు పడుతుంటారు. సందేహం అనిపిస్తే వెంటనే వైద్యులకు చూపించాలి.

బాధితులను ఓదార్చాలి..

'కొందరు సమస్యను ధైర్యంగా ఎదుర్కోకుండా మానసిక ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడుతుంటారు. సమస్యల్లో ఉన్నవారిని ఓదారుస్తూ వారితో ఎక్కువ మాట్లాడేందుకు ప్రయత్నించాలి. ధైర్యం చెప్పి ఆలోచనలు మళ్లించాలి. సకాలంలో స్పందించడం అవసరం.

-డాక్టర్ నాగభైరవి, మానసిక వైద్య నిపుణులు

పూలు.. నేలపాలు


గుడిమల్కాపూర్ మార్కెట్‌లో శుక్రవారం వ్యాపారం సరిగా సాగక రైతులు సాయంత్రానికి పూలను ఇలా కుప్పలుగా పారేసి వెళ్లిపోయారు. మార్కెట్ నిర్వాహకులు వాటిని క్రేన్ సాయంతో తొలగించారు.

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌కు పురస్కారం


అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

ఈనాడు, హైదరాబాద్: విద్యా సంస్థలు.. అంకుర సంస్థల పరిశోధనలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న మొబైల్ కాంగ్రెస్-2024లో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ స్మార్ట్‌సిటీ లివింగ్ ల్యాబ్ రూపొందించిన నమూనాకు పురస్కారం లభించింది. దిల్లీలోని భారత్ మండపంలో శుక్రవారం జరిగిన సదస్సులో నమూనాను రూపొందించిన పరిశోధక విద్యార్థులు వైభవ్ నవారే, చీఫ్ టెక్నాలజీ ఆర్కిటెక్ట్ అనురాధ వట్టెం పురస్కారాన్ని అందుకున్నారని ట్రిపుల్‌ఐటీ అధికారులు ప్రకటనలో తెలిపారు. వైర్‌లెస్ ఆధారిత మౌలిక సదుపాయాలు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్.. నీటి సరఫరాకు అత్యాధునిక విధానాలను వీరు రూపొందించారు.

ఉన్మాదులకు శిక్షణ ఇచ్చే అడ్డాగా హైదరాబాద్: ఈటల



సంఘీభావం తెలుపుతున్న ఈటల రాజేందర్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: హైదరాబాద్ ఉన్మాదులకు శిక్షణ ఇచ్చే అడ్డాగా మారిందని, దీన్ని అణిచివేయకపోతే ప్రపంచానికే ముప్పు తప్పదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద చేపట్టిన శాంతి దీక్షలో ఆయన పాల్గొని ప్రసంగించారు. హిందూమతంపై ద్వేషం పెంచేలా సికింద్రాబాద్‌లోని మెట్రో పోలిస్ హోటల్‌లో 15 రోజులుగా సమావేశాలు నడుస్తున్నాయని, వాటికి ప్రభావితమైన ఓ వ్యక్తి ప్రార్థనా మందిరంపై దాడి చేశాడని తెలిపారు.

సదర్ సమ్మేళనాలు 31 నుంచి

గోల్నాక: జంటనగరాలలో యాదవుల సదర్ సమ్మేళనాలను ఈనెల 31, నవంబరు 1, 2న నిర్వహించనున్నట్లు గ్రేటర్ యాదవ సంఘం ఛైర్మన్ చిట్టబోయిన నందకిశోర్‌యాదవ్ ప్రకటించారు. ఏటా దీపావళి పురస్కరించుకుని దున్నరాజాల విన్యాసాలతో సదర్ సమ్మేళనాలను నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం యాదవ సంఘ మాజీ అధ్యక్షుడు పాండుయాదవ్, ట్రస్ట్ సభ్యులు, సదర్ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించి తేదీలను ప్రకటించారు. 31న సాయంత్రం నింబోలిఅడ్డా, కొత్తపేట, నార్సింగి, రామంతాపూర్ ప్రాంతాల్లో, నవంబరు 1న ఖైరతాబాద్, సైదాబాద్, కార్వాన్, ఆసిఫ్‌నగర్, అమీర్‌పేట, బోయిన్‌పల్లి, నల్లగుట్ట, బొల్లారం, మచ్చబొల్లారం, బజార్‌ఘాట్, గుడిమల్కాపూర్‌లలో, 2న వైఎంసీఏ నారాయణగూడ చౌరస్తాలో జరుగుతాయని వివరించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00	డ్రెస్డ్	206–00
రిటైల్	142–00	స్కిన్‌లెస్	234–00

ఎల్.బి.నగర్

• ఎల్.బి.నగర్ • మలక్‌పేట

రోడ్డు పునరుద్ధరణకు సహకరించాలి: ఎమ్మెల్యే


అటవీ శాఖ అధికారి రాకేష్ మోహన్‌తో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్: మన్సూరాబాద్ నుంచి ఆటోనగర్ మీదుగా ఉన్న పాత పోచంపల్లి రోడ్డు పునరుద్ధరణకు సహకరించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అటవీ శాఖను కోరారు. ముఖ్య అటవీ సంరక్షణ అధికారి రాకేష్ మోహన్‌ను శుక్రవారం నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి ఈ విషయమై చర్చించారు. గతంలోనూ పలుసార్లు ప్రస్తావించామని, రోడ్డుకు సంబంధించి కేవలం 200 మీటర్ల కంటే తక్కువ స్థలం మాత్రమే అటవీ శాఖ పరిధిలో ఉందని వివరించారు. రాకేష్ మోహన్ స్పందిస్తూ.. అధికారులతో మాట్లాడి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, రవి ముదిరాజ్, ఆశోకప్ప పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలుస్తాం.. దళారీ వ్యవస్థను అరికడతాం

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కమిటీ సభ్యులతో కలిసి మార్కెట్‌ను సందర్శించారు. రైతులు, వినియోగదారులు, వ్యాపారులు, హమాలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలుక నర్సింహారెడ్డి నూతన పాలక వర్గాన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు అండగా నిలుస్తూ, దళారీ వ్యవస్థను అరికడతామన్నారు. మార్కెట్ శుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. గడ్డిఅన్నారం మార్కెట్ వైస్ ఛైర్మన్ భాస్కరాచారి, డైరెక్టర్లు జైపాల్ రెడ్డి, బండి మధుసూదన్ రావు, రఘుపతి రెడ్డి, నరసింహా, గణేష్ నాయక్, ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, ఎన్టీఆర్ నగర్ మార్కెట్ కార్యదర్శి వాహీద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల సర్వే వేగవంతం చేయండి


మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక, చిత్రంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, అధికారులు

ఆదిభట్ల, న్యూస్‌టుడే: కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ కె.శశాంక చెరువుల సర్వే, ఎల్ఆర్ఎస్ 2020 దరఖాస్తుల పరిశీలన వేగవంతంపై ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లను గుర్తించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కూలిపోయి.. ఆనవాలు కోల్పోయి


ఇది ఒక్కప్పుడు ప్రాంగణంలోని వేదిక


పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో...

న్యూస్‌టుడే, ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురం నాలుగు ఫేజ్‌లతో ఆసియా ఖండంలోనే అతిపెద్ద కాలనీల్లో ఒకటి. 1980లో ఈ ప్రాంతంలో కొద్దిసంఖ్యలో మాత్రమే జనాభా ఉండేవారు. నివాసయోగ్యమైన ప్రాంతం కావడంతో కాలక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు జిల్లాల నుంచి ప్రజలు వచ్చి స్థిరపడ్డారు. నాలుగు ఫేజ్‌ల్లో కలిపి దాదాపు 50కి పైగా కాలనీలు ఏర్పడ్డాయి. రెండు లక్షల వరకు జనాభా ఉంటున్నారు. ఇక్కడి కాంప్లెక్స్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో 1998లో ప్రభుత్వ సంస్థ హుడా ఆధ్వర్యంలో ఎకరా స్థలంలో

అలంకారప్రాయంగా ఓపెన్ ఆడిటోరియం
అభివృద్ధి హామీలు ఆచరణలోకి రాని వైనం

ఓపెన్ ఆడిటోరియం నిర్మించారు. స్థానికులు సభలు, సమావేశాలు, శుభకార్యాల నిర్వహణకు అనువుగా తీర్చిదిద్దారు. రోజు వారీగా తక్కువ అద్దెకు అవసరమైన వారికి ఇచ్చేవారు. నిర్వహణ లోపంతో కాలక్రమేణ అలంకారప్రాయంగా మారింది. ప్రస్తుతం ఏడాదిలో ఒకటి రెండుసార్లు కేవలం చేనేత హస్త కళల ప్రదర్శన ఏర్పాటుకు మాత్రమే పరిమితమైంది. పలుమార్లు ప్రజాప్రతినిధులు సందర్శించి నగరంలోని రవీంద్రభారతి మాదిరిగా తీర్చిదిద్దుతామని హామీలిచ్చినా, కార్యాచరణలో అడుగులు ముందుకు పడటం లేదు.

శిథిలావస్థకు చేరడంతో....

ఆడిటోరియం మొత్తం అధ్వానస్థితికి చేరింది. వేదిక కూలిపోయింది. దీంతో కొన్నేళ్లుగా ఇక్కడ ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించడం లేదు. ప్రాంగణం అంతటా పిచ్చి మొక్కలు, చెత్తచెదారంతో అపరిశుభ్రత నెలకొంది. ఎవరూ అటువైపు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

అభివృద్ధి చేస్తే ..: ఆడిటోరియం మధ్యలో కొంత ప్రదేశం ఖాళీగా ఉంది. ఇక్కడ టెంటు వేసుకునేందుకు అవకాశం ఉండటంతో .. చేనేత హస్త కళ ప్రదర్శన నిర్వాహకులు ఉపయోగించుకుంటున్నారు. తద్వారా హుడా (ప్రస్తుత హెచ్ఎండీఏ)కు కొంత అద్దె వస్తుంది. ఆడిటోరియం దుస్థితిని చూసి కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిని మినీ రవీంద్రభారతిగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు. తద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు, సభలు, సమావేశాలు, శుభకార్యాలు నిర్వహించుకునేందుకు వీలుంటుందని, వచ్చే ఆదాయంతో మరింత అభివృద్ధి చేయవచ్చని సూచిస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య
ఎల్బీనగర్: 76759 19030
మలక్‌పేట: 80085 73284
హయత్‌నగర్: 98336 64897
కర్మన్‌ఘాట్: 94400 32872
బండ్లగూడ: 96034 78579
మూసారాంబాగ్: 79933 00559

వనస్థలిపురం, కర్మన్‌ఘాట్, సైదాబాద్, మూసారాంబాగ్, న్యూస్‌టుడే

? ఎన్జీవో కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. –రాజశేఖర్, వనస్థలిపురం

✓ సిబ్బందిని పంపించి పట్టుకుంటాం. –యాదగిరి, వెటర్నరీ అధికారి

? హస్తినాపురం డివిజన్ పరిధి టీకేఆర్ రోడ్డు నందనవనం కాలనీలోని పలు ప్రాంతాల్లో చెత్తను పారబోస్తున్నారు. ఒకటి రెండు రోజులు అలాగే ఉండటంతో దుర్వాసన వస్తోంది. – రాజుగౌడ్, నందనవనం

✓ సమస్య మా దృష్టిలో ఉంది. టీకేఆర్ రోడ్డులో పారబోసిన చెత్తను తరలిస్తూనే ఉన్నాం. మరోసారి పరిశీలించి రోడ్ల పక్కన చెత్త వేయకుండా చర్యలు చేపడతాం. – శంకర్, పారిశుద్ధ్య విభాగం జవాన్

? సైదాబాద్ లోకాయుక్త కాలనీలోని పుష్ప నిలయం వద్ద పాదబాటలపై చెట్ల కొమ్మలు తెచ్చి పడేశారు. నడిచే వారికి ఇబ్బందిగా ఉంది. – వేదవ్యాస్, సైదాబాద్

✓ ఆ ప్రాంత పారిశుద్ధ్య పర్యవేక్షకుడిని పంపించి.. తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ అనురాధ, ఏఎంవోహెచ్, మలక్‌పేట

? మూసారాంబాగ్ శ్రీపురం కాలనీలో నిత్యం మురుగు పారుతుండటంతో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు మ్యాన్‌హోల్‌పై మూత లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. – వేణు, శ్రీపురంకాలనీ

✓ పరిశీలించి మరమ్మతులు చేపడతాం. మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేయిస్తాం. – భాగ్యలక్ష్మి, కార్పొరేటర్

కుంగిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

స్పందనకు వందనం

హయత్‌నగర్: హయత్‌నగర్ జాతీయ రహదారి నుంచి నేతాజీ కాలనీకి వెళ్లే మార్గంలో మ్యాన్‌హోల్ కుంగింది. మరమ్మతులు చేయకపోవడంతో వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ దారిలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఈనెల 17న 'మహాప్రభో...మరమ్మతులు చేయండి' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, జలమండలి అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు.

ఉపకార వేతనాల విడుదలకు ఆందోళన


దిల్‌సుఖ్‌నగర్ సర్వీస్ రోడ్డులో టీఎస్ఎస్ఏ ర్యాలీ

మూసారాంబాగ్, న్యూస్‌టుడే: ఏళ్లుగా బకాయి ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) ప్రభుత్వాన్ని హెచ్చరించింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యపు ధోరణితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది. శుక్రవారం విద్యార్థులతో కలిసి దిల్‌సుఖ్‌నగర్ నుంచి మూసారాంబాగ్ వెళ్లే సర్వీస్ దారిలో ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.మహేశ్‌కుమార్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాలపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల ఉపకార వేతనాలపైనా పెట్టాలన్నారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల మెస్ రుసుంలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షురాలు ఎలిజబెత్, సమన్వయకర్త ప్రభాకర్, యోగేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

సైదాబాద్, న్యూస్‌టుడే: నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్ (సిటీ-8) సీబీడీ/ఏడీఈ ఇమ్రాన్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

● **ఉదయం 10 గంటల నుంచి ఉదయం 11.30 వరకు:** కుర్మగూడ పరిసర ప్రాంతాలు. ● **ఉ. 11.30.నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు:** దర్గా, రియాసత్‌నగర్, ఇందిరానగర్, హబీబ్‌నగర్, మొయిన్‌బాగ్, జవహర్ కాలనీ, ఫతేషానగర్, కంచన్‌బాగ్ రోడ్, జమాల్ కాలనీ, రాజునగర్, అబుబకర్ మసీదు పరిసరాలు. ● **మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు:** ఫైర్ స్టేషన్, ఆర్య సమాజ్, అమీర్ ఫాతిమా మసీదు, రామాలయం, అక్బర్‌బాగ్ క్రాస్‌రోడ్, దయానంద్‌నగర్, పల్టాన్ చౌరస్తా, ఆనంద్ నగర్, మలక్‌పేట పరిసర ప్రాంతాలు.

వనస్థలిపురం: మరమ్మతుల నేపథ్యంలో శనివారం వనస్థలిపురంలోని ఫేజ్1, 2, కాంప్లెక్స్ ఏరియా, రెండు పడకల గదుల సముదాయ ప్రాంగణం తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రామచంద్ర తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా గందె సురేష్



షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన గందె సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. హైదరాబాద్‌లోని సంఘం భవనంలో గురువారం ఆర్య వైశ్య సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్ష పదవి కోసం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. వారిలో ఐదుగురు అభ్యర్థులు శుక్రవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఊరె లక్ష్మణ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా గందె సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

లేబర్ అడ్డాల్లో రూ.5 భోజన వసతి కల్పించండి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు

హయత్‌నగర్ న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులందరూ కార్మిక సంక్షేమ బోర్డులో పేర్లను నమోదు చేసుకోవాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు కోరారు. బహుళ అంతస్తుల నిర్మాణాల ద్వారా వచ్చే 2 శాతం సెస్‌ను కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాల్సిన ప్రభుత్వాలు, ఆ నిధులను దారి మళ్లించడం దారుణమని విమర్శించారు. యూనియన్ హయత్‌నగర్ మండల కార్యదర్శి రమావత్ సక్రునాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కార్మిక అడ్డాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. లేబర్ అడ్డాల వద్ద రూ.5 భోజన వసతి కల్పించాలని కోరారు. సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల కోసమే వినియోగించాలని, ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 55 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

గోపాలకృష్ణపురంలో తీరనున్న మురుగు ఇక్కట్లు


ఆనంద్‌నగర్ చౌరస్తాలో పైపులైన్ ఏర్పాటుపై చర్చిస్తున్న జీఎం శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

బండ్లగూడ, న్యూస్‌టుడే: నాగోల్ డివిజన్ ఆనంద్‌నగర్ చౌరస్తా సమీపంలోని గోపాలకృష్ణపురం కాలనీలో భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చౌరస్తాలో మరొక పైపులైను నిర్మించాల్సి ఉందని జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే చౌరస్తాలో రేడియల్ రోడ్డు నిర్మాణం జరుగుతున్నందున వెంటనే పైపులైన్ ఏర్పాటుకు తవ్వకాలు చేపట్టాలని మేనేజర్‌ను ఆదేశించారు. లేకపోతే సీసీ రోడ్డు వేశక దానిని తవ్వడానికి అనుమతులతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులుంటాయన్నారు. గోపాలకృష్ణపురం డ్రైనేజీ లైన్‌ను అవగాహన లేకుండా నేరుగా తీసుకొచ్చి ప్రధాన లైన్‌కు కలపడంతో మురుగు వెనక్కి పారుతోందన్నారు. ఇప్పుడు మరోలైన్ ఏర్పాటు ద్వారా ఏళ్ల తరబడి ఉన్న సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. అంతకు ముందు ఆయన బండ్లగూడ చౌరస్తాలో జీహెచ్ఎంసీ తవ్వకాల్లో ధ్వంసమైన డ్రైనేజీ పైపులైను పరిశీలించారు. మరమ్మతులు చేయాలని జీహెచ్ఎంసీ ఏఈ దీపక్‌ను ఆదేశించారు. జలమండలి డీజీఎం మాధవి, మేనేజర్లు అర్చన, ప్రేంకుమార్, భారాస, భాజపా నాయకులు చిరంజీవి, సురేందర్‌యాదవ్ పాల్గొన్నారు.


చార్మినార్ పంజేషాలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

విశ్వకర్మ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: సామాజిక, రాజకీయ, విద్య, వైద్యం, సాంస్కృతిక రంగాల్లో విశేష సేవలందించిన విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ కులస్థుల సేవలను గుర్తిస్తూ విశ్వకర్మ అవార్డులను ప్రధానం చేయనున్నారు. వచ్చే నెల 12న దిల్లీలోని అంబేడ్కర్ భవన్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథుల పుష్పగిరి తెలిపారు. శుక్రవారం ఎల్బీనగర్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... అర్హులైన వారు తమ పూర్తి వివరాలను ఈ నెల 20లోపు 9666435426 నంబరుకు వాట్సప్ చేయాలని సూచించారు.

ట్రాక్టరు బోల్తా .. డ్రైవరు దుర్మరణం

నాగోలు: ట్రాక్టరు బోల్తా పడి డ్రైవరు మృతిచెందిన సంఘటన ఎల్బీనగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి షేక్ మౌలానా(57) డ్రైవరుగా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం హస్తినాపురంలోని మ్యాక్స్ షోరూం భవనం సెల్లార్ నుంచి తన ట్రాక్టరులోకి మట్టిని నింపుకున్నాడు. భారీ లోడుతో ఉన్న ట్రాక్టరు సెల్లార్ నుంచి బయటికి వచ్చే క్రమంలో ఇంజిన్ ఒక్కసారిగా పైకిలేచి మౌలానాపై పడింది. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం రాత్రి భార్య బిపాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రేతల అరెస్టు

నాగోలు: గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని ఎల్బీనగర్ ఠాణా, ఎస్వోటీ పోలీసులు సంయుక్తంగా అరెస్టుచేశారు. పోలీసుల కథనం ప్రకారం... మధ్యప్రదేశ్‌కు చెందిన విజయ్‌కుమార్ సోని(45), రాజస్థాన్‌కు చెందిన హేమ్‌సింగ్(40) కొన్నాళ్లక్రితం బతుకు తెరువు కోసం నగరానికి వచ్చారు. భరత్‌నగర్ సమీపంలోని సాయిబాబా కాలనీలో విజయ్‌కుమార్, నాగోలు జైపురీకాలనీలో హేమ్‌సింగ్ ఉంటున్నారు. మార్బుల్ బండల పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో గంజాయికి అలవాటు పడ్డారు. కష్టపడితే వచ్చే సంపాదనతో సంతృప్తి చెందక సులువుగా సంపాదించేందుకు గంజాయిని తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకోవాలనుకున్నారు. బుధవారం నాగోలుకు చెందిన సంజు ఎల్బీనగర్‌లోని సిరీస్‌రోడ్డులో ఉన్న డీవీఎం కళాశాల వద్ద వీరికి 6 ప్యాకెట్లలోని 539 గ్రాముల గంజాయిని విక్రయించాడు. ఆ గంజాయిని తెలిసినవారికి అమ్మేందుకు వీరు ప్రయత్నిస్తుండగా నిఘా ఉంచిన పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు సంజు పరారీలో ఉన్నాడు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు

హయత్‌నగర్: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్, కండెక్టర్‌పై దాడిచేసిన ఇద్దరిపై హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం హయత్‌నగర్-1 డిపోకు చెందిన డ్రైవర్ ఎన్.శ్రీనివాస్, కండక్టర్ వై.వెంకటయ్య ఈనెల 15న జేబీఎస్ నుంచి కుంట్లూర్ బయలుదేరారు. దారిలో హయత్‌నగర్‌కు రాగానే ఓ కారు ఆగి ఉండటంతో ముందుకెళ్లాలంటూ డ్రైవర్ శ్రీనివాస్ హారన్ కొట్టాడు. కారులో ఉన్న ఇద్దరు యువకులు ఆగ్రహంతో కిందకు దిగి డ్రైవర్‌ను దుర్భాషలాడి వెళ్లిపోయారు. తర్వాత బస్సు కుంట్లూర్ గ్రామంలో ఆపి ఉండగా తిరిగి అక్కడికి చేరుకున్న యువకులు డ్రైవర్, కండక్టర్లను తీవ్రంగా కొట్టారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు నిందితులను వీరన్నగుట్టకు చెందిన సంకరి భాను(19), బంజారా కాలనీకి చెందిన కావలి వెంకట్(26)గా గుర్తించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కో-ఆపరేటివ్ సొసైటీ కొత్త శాఖ ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎండీ కేవీ సుబ్బయ్య

వనస్థలిపురం, న్యూస్‌టుడే: వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ పక్కన శుక్రవారం ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ శాఖా కార్యాలయాన్ని ఎండీ కె.వి.సుబ్బయ్య, అధ్యక్షులు పి.ఆర్.వి..పి.ఎస్. రాజు ప్రారంభించారు. వైస్ ఛైర్మన్ మూర్తి, జీఎం గోవిందరాజన్, మేనేజర్ సరిత, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఏ బకాయిల విడుదలకు డిమాండ్


మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ

మూసారాంబాగ్, న్యూస్‌టుడే: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయలేదని రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తులసీ సత్యనారాయణ కోరారు. శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లో కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. పింఛన్‌దారులకు ఆరోగ్య పథకం అమలు కావడం లేదని, ఎన్నోసార్లు గత ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగ విరమణ ప్రయోజనాలను తక్షణమే చెల్లించేలా చొరవ తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గౌరవ అధ్యక్షుడు శివశరణప్ప, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిభతో మెరిసి.. విజేతలుగా నిలిచి





'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం నాగోల్ డివిజన్ ఫత్తుల్లాగూడ రోడ్డులోని లిటిల్ మాస్టర్ స్కూల్లో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు', 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై వ్యాస రచన పోటీలో 8,9,10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 10 తరగతి విద్యార్థులు కె.బన్నీ (ప్రథమ), సీహెచ్.దీపిక (ద్వితీయ), కె.కీర్తి (తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ హరీష్, కరస్పాండెంట్ అనసూయ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తాయని స్కూల్ డైరెక్టర్ ఎస్.ఎ.ఖాదర్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, బండ్లగూడ

న్యాయమూర్తులకు ఘనంగా వీడ్కోలు



మాట్లాడుతున్న రంగారెడ్డిజిల్లా కోర్టుల ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు: రంగారెడ్డి జిల్లా కోర్టుల్లో నూతనంగా వచ్చే న్యాయమూర్తులకు స్వాగతం, ఇక్కడి నుండి బదిలీపై వెళ్లే వారికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసే సాంప్రదాయం అభినందనీయమని స్థానిక ప్రధాన న్యాయమూర్తి ఎస్.శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడి ఉంచి ఇటీవలే పదోన్నతిపై బదిలీ అయిన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్లు ఉషాక్రాంతి, ఉషశ్రీలకు స్థానిక న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వై.కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమర్థమంతంగా పని చేస్తే బదిలీ తర్వాత కూడా ఆ అధికారిని అందరూ గుర్తుంచుకుంటారన్నారు. కొత్త చోట కూడ కేసుల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి డా.పట్టాభి రామారావు సూచించారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, సంఘం ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, క్రీడా సాంస్కృతిక కార్యదర్శి అండేకార్ అశోక్, సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి గోలి విప్లవరెడ్డి, న్యాయవాదులు కళ్యాణ్‌కార్ నర్సింగ్‌రావు, నిరంధర్‌రెడ్డి, పీపీలు సునీత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకొంటున్న వైజ్ఞానిక, పారిశ్రామిక ప్రదర్శన


రాకెట్ల పనితీరు తెలుసుకుంటున్న విద్యార్థులు

నాగోలు, న్యూస్‌టుడే: వైజ్ఞానిక, పరిశోధన రంగంలో దేశవ్యాప్తంగా రాణిస్తున్న ప్రముఖ పారిశ్రామిక సంస్థల నమూనాలతో కూడిన ఎగ్జిబిషన్ దిల్‌సుఖ్‌నగర్‌లోని పుల్లారెడ్డి మెమోరియల్ స్కూల్లో కొలువుతీరింది. శాస్త్రవేత్తలు కావాలని కలలుగనే విద్యార్థులకు ఏయే రంగాల్లో ఎలాంటి భవిష్యత్తు ఉందో తెలుసుకునేందుకు ఈ ప్రదర్శన దోహదపడనుంది. శుక్రవారం భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ జి.నాగరత్న ప్రారంభించారు. శని, ఆదివారాల్లోనూ కొనసాగనుంది. రాకెట్లు, ఉపగ్రహాలు, చంద్రయాన్, గగన్‌యాన్ మిషన్ మోడళ్లు, డ్రోన్లు, విమానాల పనితీరు గురించి విపులంగా చెప్పేందుకు శాస్త్రవేత్తలు సైతం అందుబాటులో ఉన్నారని ప్రిన్సిపల్ జయశ్రీ సూచించారు. జాగృతి యూత్ అసోసియేషన్ సహకారంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు.

సర్కిల్ కార్యాలయం చెంత.. స్వచ్ఛతకు తూట్లు



చాదర్‌ఘాట్-దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో నల్గొండ కూడలి వద్ద తెలంగాణ వికలాంగుల సంక్షేమ శాఖ భవన సముదాయం ఉంది. కొంతకాలం క్రితం ఇందులో బల్దియా మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారానికి దగ్గరలో రహదారిపై స్వచ్ఛత స్ఫూర్తికి విఘాతం కలిగేలా పారిశుద్ధ్య సిబ్బంది చెత్త నిల్వ చేస్తున్నారు. దీంతో ఇతరులూ ఇక్కడే వ్యర్థాలను వేస్తున్నారు. – న్యూస్‌టుడే, సైదాబాద్

లీకేజీతో వృథా.. పట్టని వ్యథ



వాల్వు వద్ద లీకవుతున్న తాగునీరు రహదారిపై ప్రవహిస్తూ హస్తినాపురం డివిజన్ భూపేష్‌గుప్తానగర్ టీకేఆర్ కమాన్ పెద్ద మడుగులా మారింది. ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఒకవైపు తాగునీటి వృథాతోపాటుగా, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్మన్‌ఘాట్

గుంతల దారి.. ప్రమాదకరంగా మారి



మూసారాంబాగ్ నుంచి అంబర్‌పేట వెళ్లే దారిలో వంతెన వద్ద గుంతలతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇటీవల వానలు కురిసిన సమయంలో వరద ఉద్ధృతికి రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. ఇటుగా నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. కనీస మరమ్మతులూ చేయకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, మూసారాంబాగ్

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

జంతు ప్రదర్శనశాలకు వాహనం అందజేత



వాహనం నడిపిస్తున్న డా.సునీల్ ఎస్ హిరేమత్

చార్మినార్: జూలోని జంతువులకు వెటర్నరీ వైద్య బృందం అత్యవసర వైద్య సేవలు అందించే నిమిత్తం కెనరా బ్యాంకు సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో బ్యాటరీ వాహనాన్ని శుక్రవారం అందించింది. డిప్యూటీ బ్యాంకు ఏజీఎం అనురాగ్ ప్రకాశ్, బహదూర్‌పుర మేనేజర్ అజార్‌అక్తర్‌తో కలిసి బ్యాంకు హైదరాబాద్ సౌత్ రీజనల్ డీజీఎం కృష్ణకాంత్‌రాయ్ జూ క్యూరేటర్ డా.సునీల్ ఎస్ హిరేమత్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా కృష్ణకాంత్‌రాయ్ మాట్లాడుతూ... జూ నిర్వహణ బాగుందన్నారు. జంతు విజ్ఞానాన్ని, వినోదాన్ని, వన్య ప్రాణి సంరక్షణ స్ఫూర్తిని జూ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యూరేటర్ బర్నొబా తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం అనుసరణీయం

జియాగూడ, న్యూస్‌టుడే: మనిషి నుంచి మహర్షిగా ఎదిగిన వాల్మీకి జీవితం అనుసరణీయమని భాజపా గోల్కొండ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాజేందర్‌కుమార్ డిగాన్ సూచించారు. సీతారాముల జీవిత చరిత్రను మానవాళికి అందించిన వాల్మీకి ఆదికవిగా ఖ్యాతిపొందారని కొనియాడారు. జియాగూడ వాల్మీకి సమాజ్ అధ్యక్షుడు ఆర్. విజయ్ నేతృత్వంలో గురువారం రాత్రి సంజయ్‌నగర్‌లోని వాల్మీకి భవన్‌లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.



పూజల్లో రాజేందర్‌కుమార్, విజయ్ తదితరులు

ఉచిత నేత్రవైద్య శిబిరం



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చంద్రప్రకాశ్‌రావు

నాంపల్లి, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గాంధీభవన్ ట్రస్టు, లయన్స్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సామాజిక ఆసుపత్రి సహకారంతో నాంపల్లిలోని గాంధీభవన్ ట్రస్టు కార్యాలయంలో శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని గాంధీభవన్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ చంద్రప్రకాశ్‌రావు ప్రారంభించారు. ట్రస్టీలు ఎం.సూర్యనారాయణ, పి.వి.ప్రభాకర్‌రావు, బూర్గుల ఉత్తీకాంత్, ఉదయభాస్కర్, వి.నారాయణ, గాంధీభవన్ ట్రస్ట్ మేనేజర్ విజయభాస్కర్, గాంధేయవాదులు, వైద్యులు పాల్గొన్నారు. 152 మంది కళ్ల పరీక్ష చేయించుకున్నారు. మందులు, కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. 40 మందికి శస్త్రచికిత్సలు ఉచితంగా చేయనున్నట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

దీపావళి ప్రత్యేక పూజలకు ఆహ్వానం



చార్మినార్: చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయంలో ఈ నెల 31న నిర్వహించనున్న దీపావళి ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామికి భాగ్యలక్ష్మీ ఆలయ ట్రస్టీ శశికళ కోరారు. దివ్య సాకేతంలో చిన్నజీయర్ స్వామిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

మురుగు నివారణకు ప్రత్యేక చర్యలు

90 రోజుల ప్రణాళిక అమలు

న్యూస్‌టుడే, మాదన్నపేట, ఆసిఫ్‌నగర్, చాంద్రాయణగుట్ట, జియాగూడ

పాతనగరంలో బస్తీల్లో తరచూ రోడ్లపై మురుగు పొంగడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మురుగు సమస్యకు చెక్ పెట్టేందుకు జలమండలి అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. యాకుత్‌పురలో మూడు జెట్టింగ్ యంత్రాలు, ఒక ఎయిర్‌టెక్ యంత్రంతో మురుగు సమస్యను పరిష్కరిస్తున్నారు. జలమండలి డీజీఎం పరిధిలోని సెక్షన్లలో 90 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. నియోజకవర్గంలో సంతోష్‌నగర్, మాదన్నపేట, యాకుత్‌పుర సెక్షన్లు ఉన్నాయి.

రోజూ 10 నుంచి 15 ఫిర్యాదులు

ఒక్కో సెక్షన్ పరిధిలో మురుగు సమస్యపై రోజు 10 నుంచి 15 వరకు ఫిర్యాదులు వస్తున్నాయి. వర్షాలు కురిసినప్పుడు నిత్యం 20 నుంచి 25 వరకు ఫిర్యాదులు నమోదవుతున్నాయి. 90 రోజుల ప్రణాళిక ప్రకారం ఏడాది లేదా రెండేళ్లలో ఆయా సెక్షన్లలో మురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తిస్తారు. ఈ ప్రాంతాల్లో జెట్టింగ్ యంత్రాలు లేదా ఎయిర్‌టెక్ యంత్రాలతో పూడికతీత చేపడతారు. యాకుత్‌పుర పరిధిలో డబీర్‌పుర, రెయిన్‌బజార్, మౌలాకా ఛిల్లా, బడాబజార్, ఆమన్‌నగర్, భవానినగర్ గల్లీల్లో



సీతారాంబాగ్‌లో మ్యాన్‌హోల్ నుంచి పూడిక తొలగింపు

ప్రణాళికను అమలు చేస్తున్నారు.

పూడిక తొలగింపు

నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల పరిధిలోని జలమండలి డివిజన్-3లో 14 సెక్షన్లు ఉన్నాయి. సంబంధిత మేనేజర్లు పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్నారు. కొత్తగా సీవరేజీ పైపులైన్లు నిర్మించిన, మురుగు సమస్య నెలకొన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రోజూ దాదాపు 150 రన్నింగ్ మీటర్ల పూడికను తొలగిస్తున్నట్లు డీజీఎం షకీల్ తెలిపారు. గుడిమల్కాపూర్, జిరాబాగ్, తాజ్‌నగర్, మల్లేపల్లి, మెహిదీపట్నం, లంగర్‌హౌస్ ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి.

● జియాగూడలోని కేశవస్వామినగర్, గోశాల వీధి, శాంతినగర్, దుర్గానగర్ ప్రాంతాల్లో పూడిక తొలగింపు పనులు పూర్తయినట్లు జియాగూడ సెక్షన్ మేనేజర్ సత్యనారాయణ తెలిపారు.

● బాలాపూర్ సబ్ డివిజన్ పరిధిలో 17 రోజులుగా మురుగు సమస్య పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. లలితాబాగ్, తానాజీనగర్, జంగమ్మెట్, జహానుమా, అహ్మద్‌నగర్, ఫతేషాహీనగర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే డ్రైనేజీ పైపులైన్లను శుభ్రం చేశారు.



సంతోష్‌నగర్‌లో...

సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు: మురళి, డీజీఎం, జలమండలి, చంచల్‌గూడ

90 రోజుల ప్రణాళికలో భాగంగా ఏ ప్రాంతాల్లో మురుగు సమస్య అధికంగా ఉందో గుర్తించి ఎప్పటికప్పుడు పరిస్థితి అంచనా వేసి జెట్టింగ్ లేదా ఎయిర్‌టెక్ యంత్రాలతో పనులు చేపడుతున్నాం. ఆయా ప్రాంతాల్లో పూడికతీత చేపట్టి వ్యర్థాలు తరలిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

న్యూస్‌టుడే, చార్మినార్, కార్వాన్, ఉస్మానియా ఆసుపత్రి

? పురానాపూల్ సిప్లిగంజ్ మార్గంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసనతో నానాయాతన పడుతున్నాం.
– సురేందర్, శ్రీనివాస్, పద్మావతి, సిప్లిగంజ్

✓ సిప్లిగంజ్ మార్గంలో వ్యర్థాలు తొలగిస్తాం.
– డా.జ్యోతిబాయి, ఏఎంహెచ్‌వో, చార్మినార్

? జీవన్‌కల్యాణ్‌నగర్, క్రాంతినగర్, అయోధ్యనగర్ ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగటం లేదు. అక్కడక్కడ వెలుగుతున్నా చెట్లకొమ్మలు అడ్డు ఉండడంతో వెలుగు కిందికి ప్రసరించటం లేదు.
– ఫణీంద్ర, జీవన్‌కల్యాణ్‌నగర్, డా.యశోద, క్రాంతినగర్

✓ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతాం.
– మహ్మద్ ముషారఫ్, వీధిదీపాల విభాగం అధికారి

? ఉస్మానియా ఓపీ చీటీల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కేంద్రం వద్ద రోగులు రోజూ బారులు తీరుతున్నారు. రెండు కంప్యూటర్లు ఉన్నా తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కేంద్రాలు పెంచాలి. – సాయినాథ్, రోగి

✓ తొమ్మిది కేంద్రాల ద్వారా మందులు పంపిణీ చేస్తున్నాం. ఓపీ చీటీల ఆన్‌లైన్ కేంద్రాల సంఖ్యను పెంచేందుకు అనువైన స్థలం కోసం పరిశీలిస్తున్నాం.
– డా.రాకేశ్‌సహాయ్, సూపరింటెండెంట్, ఉస్మానియా ఆసుపత్రి

జిల్లా విద్యాశాఖాధికారికి సత్కారం



డీఈవో రోహిణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

గన్‌ఫౌండ్రీ, న్యూస్‌టుడే: జిల్లాలో డీఎస్సీ ప్రక్రియ సక్రమంగా జరగడంపై సంతోషం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయ సంఘాల నేతలు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి, బండ్లగూడ మండల ఉప పర్యవేక్షణ అధికారి కె. దశరథ్‌లను సత్కరించారు. ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.గిరివర్ధన్, బి.నర్సింహ, టీఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అహ్మద్‌ఖాన్, ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు హమీద్‌ఖాన్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్, నగర ఉపాధ్యక్షుడు భాస్కర్, మోయిన్, హలీం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ఆసిఫ్‌నగర్: రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత అందరిపై ఉందని ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రావు అన్నారు. మెహిదీపట్నం ఆర్మీ బైసన్ డివిజన్-47 ఇన్‌ఫ్యాంట్రీలో ప్రమాదాల నివారణపై సైనికులకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపొద్దని, బైక్ ఎక్కితే శిరస్త్రాణం ధరించాలని ఏసీపీ సూచించారు. కమాండింగ్ ఆఫీసర్ బ్రిగేడియర్ సంజయ్ వి కులకర్ణి, డిప్యూటీ కమాండర్ కల్నల్ గులియాని ఉన్నారు.

టపాసుల దుకాణాలు స్థానికులకు కేటాయించండి

ఆసిఫ్‌నగర్: గుడిమల్కాపూర్‌లోని జాంసింగ్ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు స్థానికులకే అవకాశం కల్పించాలని గుడిమల్కాపూర్ చిరు వ్యాపారుల సంఘం నేత ఎర్ల రాజు దేవాదాయ శాఖ అధికారులను కోరారు. ఆలయ ఇన్‌ఛార్జి ఈవో శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

బెండకాయ కిలో రూ.45

మెహిదీపట్నం: రైతుబజార్‌లో (శుక్రవారం నాటి ధరలు, కిలో రూ.లో) టమాటా 43, వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజీ 25, బీన్స్ 125, క్యారెట్ 40, దొండ 25, చిక్కుడుకాయ 65, గోకరకాయ 35, బీట్‌రూట్ 28, క్యాప్సికం 75, ఆలుగడ్డ 37, కీర 23, దోసకాయ 35, సొరకాయ 17, పొట్లకాయ 23, ఉల్లిగడ్డ 45, చామగడ్డ 40.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

బేగంబజార్: శనివారం ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు సనా హోటల్, ఆర్యసమాజ్, మున్సిపల్ పార్కు, తాళ్లగడ్డ, జాంబాగ్, పూసలబస్తీ, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇసామియాబజార్, గుజరాతీగల్లీ, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆంధ్రాబ్యాంకు, ఎక్స్‌రోడ్డు, ఏకే భవన్, మల్లన్న దేవాలయం, ఏకేఎం ఫంక్షన్ హాల్. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 వరకు శివ్‌లాల్‌నగర్, కుమ్మర్‌వాడీ, మార్వాడీ బస్తీ, బాబాబాలక్‌దాస్ మఠ్, గాంధీ విగ్రహం, హనుమాన్ పీటీ. మధ్యాహ్నం 3 గంటల సాయంత్రం 4.30 వరకు టప్పాచబుత్ర ఠాణా, న్యూఅంబేడ్కర్‌నగర్, సర్వర్‌నగర్, బాల్‌రెడ్డి పీటీ, తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదు.

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి

బేగంబజార్, న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని బేగంబజార్ ఏడీఈ ఎ.నాగిరెడ్డి తెలిపారు. ఇక్కడ పనిచేసిన సంపత్‌కుమార్ మెదక్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నల్గొండ జిల్లాలోని వివిధ సెక్షన్లలో విధులు నిర్వర్తించిన నాగిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ఇంకుడు గుంతల్ని ఏర్పాటు చేసుకోవాలి

కార్వాన్: భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో ఇంకుడు గుంతల్ని ఏర్పాటు చేసుకోవాలని జలమండలి డివిజన్-3 డీజీఎం మహ్మద్ షకీల్ అహ్మద్ సూచించారు. ఇంకుడు గుంతల ఏర్పాటు, మురుగు సమస్యను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం విజయనగర్‌కాలనీ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో పర్యటించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. విజయనగర్‌కాలనీ సెక్షన్ మేనేజర్ కె.రాంబాబు, రహీముద్దీన్ ఉన్నారు.

ప్రభాకర్‌రావుకు గ్లోబల్ శాంతి పురస్కారం



చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: గౌలిపుర ప్రాంతానికి చెందిన ప్రముఖ విద్యావేత్త వి.ప్రభాకర్‌రావు మహాత్మాగాంధీ గ్లోబల్ శాంతి పురస్కారం-2024కు ఎంపికైనట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎం.రాజ్‌నారాయణ ముదిరాజ్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 22న అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో అవార్డు అందజేస్తామన్నారు.

నీటి నాణ్యత పరిశీలన

ఆసిఫ్‌నగర్: గుడిమల్కాపూర్, నవోదయకాలనీలో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ శుక్రవారం పర్యటించారు. తాగునీటి సరఫరా తీరుతెన్నులు, నీటి నాణ్యత, ప్రెషర్స్ లెవల్స్, మురుగు నిర్వహణ చూశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆపరేషన్స్-1 జీఎం విజయరామారావును ఆదేశించారు.

జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి మొక్క అందజేస్తున్న ఆదిల్ షరీఫ్ తదితరులు

అబిడ్స్, న్యూస్‌టుడే: జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ కోరారు. శుక్రవారం కమిషనర్ ఇలంబర్తికి మొక్క అందజేసి సన్మానించారు. ఆరోగ్య కార్డులు, బదిలీలు, ఒప్పంద, పొరుగు సేవల కార్మికులకు వేతనాల పెంపు తదితర అంశాలపై కమిషనర్‌తో చర్చించారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు ఎం.మోజెస్, అనుబంధ ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి పీఎస్ ఉమేష్‌బాబు, నాయకులు మహ్మద్ రఫీక్, రమేష్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు అన్ని రంగాల్లో నిర్లక్ష్యం



ఐక్యత ప్రదర్శిస్తున్న సంఘం నాయకులు

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కమ్మరి, వడ్రంగి, కంచరం, శిలాశిల్పి, స్వర్ణకార వృత్తులు చేస్తున్న వారందరినీ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలుగా పరిగణించాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, అధ్యక్షుడు వేములవాడ మదన్మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారిలు మాట్లాడారు. గతంలో జనగణనలో వృత్తులనే కులాలుగా భావించడం వల్ల ప్రభుత్వాలు విశ్వబ్రాహ్మణులను అన్ని రంగాల్లో నిర్లక్ష్యం చేశాయని గుర్తు చేశారు. సంఘం నేతలు పులిగిల్ల శ్రీనివాసాచారి, దేవరకొండ వీరాచారి, నాగారం భాస్కరాచారి, జగ్జీవన్, సదానందం పాల్గొన్నారు.

దేవునికుంట శ్మశానవాటికలో వసతులు కల్పిస్తాం



శ్మశానవాటికలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: దేవునికుంట హిందూ శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పిస్తామని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ తెలిపారు. మెహిదీపట్నంలోని శ్మశానవాటికను శుక్రవారం ఆయన సందర్శించారు. పనుల ప్రతిపాదనలు తయారు చేయాలని ఈఈ లాల్‌సింగ్‌ను ఆదేశించారు. శ్మశానవాటిక బాధ్యుడు నాగరాజు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీపావళి నాటికి చెట్ల కొమ్మలు, పొదలు తొలగించాలని ఈఈకి సూచించారు. ఎన్ని వీధి దీపాలు అవసరమో వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని శాఖ డీఈఈ నర్సింగ్‌రావుకు సూచించారు.

యూజీసీ వేతనాలు అమలు చేయాలని వినతి



మురళికి వినతిపత్రం సమర్పిస్తున్న ఒప్పంద అధ్యాపకులు

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: ఒప్పంద అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్స్ అమలు చేయాలని ఒప్పంద అధ్యాపకుల సంఘం నేతలు రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని ఎస్‌సీఈఆర్‌టీ భవన్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న సమస్యలు, కాంట్రాక్టు అధ్యాపకుల పరిస్థితి, వేతనాల చెల్లింపు, అకాడమిక్ పరిస్థితి తదితర అంశాలపై మురళితో చర్చించినట్లు తెలిపారు. డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ విజేందర్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ వెంకటేష్, డాక్టర్ మాధవి, డాక్టర్ సునీత, డాక్టర్ సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ.. కబడ్డీ



కబడ్డీ కబడ్డీ అంటూ స్టార్ ఆటగాళ్లు పాయింట్ల కూత పెడుతుంటే.. ప్రత్యర్థి రైడర్లను డిఫెండర్లు పట్టేస్తుంటే.. తెలుగు అభిమానులు కేరింతలు కొట్టారు. శుక్రవారం గచ్చిబౌలి స్టేడియంలో ప్రో కబడ్డీ లీగ్ 11వ సీజన్ ఆరంభమైంది. ఈ కబడ్డీ మ్యాచ్‌లు అభిమానులను అలరించాయి. తొలి మ్యాచ్‌లో సొంతగడ్డపై తెలుగు టైటాన్స్ చెలరేగి బెంగళూరు బుల్స్‌ను మట్టికరిపించింది. మరో మ్యాచ్‌లో యు ముంబాపై దబంగ్ దిల్లీ గెలిచింది. బాలీవుడ్ నటీనటులు విద్యాబాలన్, కార్తీక్ ఆర్యన్ ముఖ్య అతిథులుగా సందడి చేశారు.

జీపీ బిర్లా సెంటర్‌లో రేపు చెస్ టోర్నీ

హైదరాబాద్, ఈనాడు: వారాస్ చెస్ అకాడమీ ఆదివారం హైదరాబాద్‌లో అంతర్జాతీయ ర్యాపిడ్ ఫిడె రేటింగ్ చెస్ టోర్నీ నిర్వహించనుంది. ఆదర్శ్ నగర్‌లోని జీపీ బిర్లా సెంటర్‌లో పోటీలు జరుగుతాయి. టోర్నీ ప్రైజ్‌మనీ రూ. 3 లక్షలు. మరిన్ని వివరాలకు 8187093036 నంబర్లో సంప్రదించవచ్చు.

కొత్త వ్యక్తుల కదలికలపై కన్నేయండి: సీపీ



మాట్లాడుతున్న సీవీ ఆనంద్, ఎస్బీ డీసీపీ చైతన్యకుమార్

ఈనాడు, హైదరాబాద్: పోలీసుశాఖలో నిఘావిభాగం కీలకపాత్ర పోషిస్తుందని నగర సీపీ సీవీ ఆనంద్ అన్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తుగా అప్రమత్తం చేయటంలో నిఘా అధికారులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని స్పష్టంచేశారు. బంజారాహిల్స్ పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో శుక్రవారం స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. నగరానికి వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చే కొత్త వ్యక్తుల కదలికలపై మరింత నిఘా ఉంచాలని ఆదేశించారు. హోటళ్లు, కాలనీలు, బస్తీల్లోకి చేరే కొత్త వ్యక్తుల సమాచారం ఎప్పటికప్పుడు అందేలా స్థానికంగా వ్యవస్థను బలోపేతం చేసుకోవాలన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు తమ పరిధిలోని అని ప్రాంతాలపై అవగాహన పెంచుకొని, అప్రమత్తంగా ఉన్నపుడు అక్కడ జరిగే అవాంఛనీయ ఘటనలను కట్టడి చేయగలరన్నారు. పాస్‌పోర్టు పరిశీలనలో నిజాయితీగా, ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పని చేస్తే గుర్తింపు వస్తుందన్నారు. సమావేశంలో ఎస్బీ డీసీపీ ఎస్.చైతన్యకుమార్, అధికారులు పాల్గొన్నారు.

హోటల్ యజమానులు జాగ్రత్తలు పాటించాలి

ఆసిఫ్‌నగర్: హోటళ్లు, లాడ్జీలు, ఫంక్షన్‌హాళ్లలో వసతి పొందుతున్న వివరాలు పూర్తి స్థాయిలో సేకరించాలని సౌత్ వెస్ట్ డీసీపీ చంద్రమోహన్ సూచించారు. తమ తనిఖీల్లో రికార్డులు లేనట్లు తేలితే కేసులు నమోదు చేస్తామని డీసీపీ హెచ్చరించారు. వాటి నిర్వాహకులతో డీసీపీ శుక్రవారం మెహిదీపట్నంలో సమావేశం నిర్వహించారు. బసచేసే వారి ఆధార్ కార్డు సేకరించాలని.. ఎప్పుడొస్తున్నారు.. వెళ్తున్నారో వివరాలు ఉండాలన్నారు. వివరాలు ఎప్పటికప్పుడు పోలీసులకు సమర్పించాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో కార్యకలాపాలు కొనసాగాలన్నారు. ఏసీపీలు విజయ శ్రీనివాస్, ఫయాజ్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నారాయణగూడ: సైఫాబాద్, నాంపల్లి, బేగంబజార్, అబిడ్స్, లేక్ పోలీసు ఠాణాల పరిధిలోని హోటళ్ల యాజమాన్యాలు, అధికారులతో పోలీసులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మధ్యమండలం డీసీపీ అక్షాంశ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హోటల్ యాజమాన్యాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడానికి పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్, అబిడ్స్ ఏసీపీ శేఖర్, డీఐలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్ర



చాంద్రాయణగుట్ట: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ విజయం సాధించి, కేంద్ర మంత్రి కావడంతో మొక్కు తీర్చుకోవడానికి భాజపా యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లి శివచంద్రగిరి శుక్రవారం శబరిమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. గౌలిపురా శ్రీరాంనగర్ కాలనీలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు చేసి పయనమయ్యారు.

కలుషిత నీటి సరఫరాకు అడ్డుకట్ట వేయండి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

గోషామహల్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని గౌలిగూడలో రెండు నెలలుగా తాగునీరు కలుషితం అవుతోందని, అడ్డుకట్ట వేయాలని భారాస నేత ఆనంద్‌కుమార్‌గౌడ్ జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి శుక్రవారం విన్నవించారు. మురుగు, తాగునీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హిందీనగర్‌లో మురుగు కాలువ నిర్మాణానికి నిధులు మంజూరై ఏడాది అవుతున్నా పనులు ప్రారంభించలేదన్నారు. ఆంధ్ర బ్యాంక్ దగ్గర తాగునీటి పైపులైన్ పనులు కూడా ప్రారంభం కాలేదన్నారు. పార్టీ నేతలు మనోహర్ గైక్వాడ్, ప్రదీప్, మహ్మద్ అహ్మద్, మహ్మద్ గౌస్ ఉన్నారు.

ఎడిటర్ మృతికి సంతాపం

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: ప్రజాటైమ్స్ ఎడిటర్ పి. రాములుగౌడ్ మృతిపై హైదరాబాద్ రైటర్స్ అండ్ ఆర్టిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సూర్యప్రకాశ్, ప్రజా చైతన్య సమితి అధ్యక్షుడు జి.చంద్రమోహన్ గౌడ్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి.. కుంటలో శవమయ్యాడు

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: అదృశ్యమైన వ్యక్తి కుంటలో శవమై తేలిన ఘటన హబీబ్‌నగర్ ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లిలోని అఫ్జల్‌సాగర్ ప్రాంతానికి చెందిన విజయరామ్(40) నిలోఫర్ ఆసుపత్రిలో అసిస్టెంట్ ధోబీగా పని చేస్తున్నారు. ఈ నెల 13న ఇంట్లో నుంచి బయటకి వెళ్లి అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సీతారాంబాగ్ ద్రౌపది గార్డెన్‌లోని నీటి కుంటలో కుళ్లిపోయిన స్థితిలో శవమై కనిపించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిమ్, ఆధార్ డీయాక్టివ్ అవుతాయని బెదిరించి..

రూ.13.91 లక్షల మోసం

నారాయణగూడ, న్యూస్‌టుడే: బెదిరించి నగదు కొట్టేశారంటూ బాధితురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 80 ఏళ్ల విశ్రాంత మహిళ ఉద్యోగికి ట్రాయ్ అధికారినంటూ ఫోన్ చేశాడు. సాయంత్రం 5 గంటలలోపు మీ సిమ్, ఆధార్ కార్డులు డీయాక్టివ్ చేయబడతాయని హెచ్చరించాడు. 15 నిమిషాల్లోనే లఖ్‌నవూ ఠాణా ఎస్సైనంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి మీ చరవాణి నంబరు దుర్వినియోగం చేశారని, మనీలాండరింగ్ కేసులో ప్రమేయం ఉందని, అరెస్టు చేస్తామని బెదిరించాడు. బాధితురాలు మొదట ఖండించారు. వెంటనే ఈడీ, ఆర్‌బీఐలకు పంపించామని, వారు కేసు దర్యాప్తు చేస్తున్నారన్నాడు. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేశామన్నాడు. అయితే ఈ కేసు దర్యాప్తు అయ్యే వరకు ఎవరికీ చెప్పొద్దని బాధితురాలితో చెప్పారు. భయంతో తన కుమారుడు, మనవడి నుంచి డబ్బులు వసూలు చేసి నేరస్థుడు ఇచ్చిన ఖాతాకు రూ.13.91 లక్షలు పంపించేశారు. విచారణ పూర్తయ్యాక తిరిగి పంపిస్తామన్నారు. నేరస్థుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇది జరిగిన మూడు రోజులకే మరో వ్యక్తి ఫోన్ చేసి రూ.10 లక్షలు డిమాండ్ చేశాడు. దాంతో అనుమానం వచ్చి.. బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు.

ఆలయాలపై దాడులకు నిరసనగా ఆందోళన నేడు

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆలయాలపై పెరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్ విమర్శించాయి. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, ప్రచార ప్రముఖ్ పి.బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

అధ్వానంగా బస్ షెల్టర్

సాలార్‌జంగ్ మ్యూజియానికి సమీపంలో పర్యాటకులకు ప్రత్యేకంగా బస్‌షెల్టర్ ఏర్పాటు చేశారు. దాని నిర్వహణ పట్టించుకునే వారు కరవయ్యారు. దీంతో అధ్వానంగా మారింది.



రాజేంద్రనగర్

●రాజేంద్రనగర్ ● షాద్‌నగర్ ● చేవెళ్ల

మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం



కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించిన మేయర్ లత

బండ్లగూడజాగీర్: ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్లు బండ్లగూడజాగీర్ మేయర్ ఎం.లత తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌కాలనీలో రూ.23 లక్షల నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. బండ్లగూడజాగీర్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు చక్రవర్తి, విజయరాకూర్, తిరుమలేష్‌గౌడ్, అనిల్, అక్తర్‌అలీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



విద్యార్థులతో టీజీఏఎన్‌బీ అధికారులు

మొయినాబాద్: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో అధికారులు సూచించారు. కొంతమంది విద్యార్థులు వాటికి బానిసగా మారి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ పట్ల తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. శుక్రవారం మొయినాబాద్ మండలం అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీ విద్యాసంస్థల కళాశాలలో ర్యాగింగ్, డ్రగ్స్‌పై టీజీఏఎన్‌బీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్, ర్యాగింగ్‌కు పాల్పడితే ఎలాంటి శిక్షలకు గురవుతారో వివరించారు. కార్యక్రమంలో టీజీఏఎన్‌బీ డీఎస్పీలు సుబ్బరామిరెడ్డి, హరిశ్చంద్రరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, గోపి, ప్రిన్సిపల్ పీసీ కృష్ణమాచారి, జేబీఈఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సుమగ్నాపట్నాయక్, సంజయ్ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు



బండ్లగూడజాగీర్: విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో మరమ్మతుల కారణంగా కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎస్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. 33/11కేవీ గంధంగూడ, స్నేహితహిల్స్ ఉపవిద్యుత్తు కేంద్రాల పరిధిలోని 11కేవీ పీఅండ్‌టీ, హైదర్షాకోట్, భాగ్యనగర్, కేదార్‌నగర్ ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు హిమాయత్‌సాగర్ సెక్షన్ ఏఈ అమరసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.

శంషాబాద్: శంషాబాద్‌లోని మధురానగర్, ఆర్జీఐనగర్, ఆర్జీఐఏ రాజా, రాళ్లగూడ, సీఎస్‌కే విల్లాస్, సామ ఎన్‌క్లేవ్, తహసీల్దార్ కార్యాలయం, బృందావన్ కాలనీ, మిషన్ కాంపౌండ్, సిద్ధేశ్వర కాలనీ, ఎయిర్‌పోర్ట్ కాలనీ, కొత్వాల్‌గూడ, కవ్వగూడలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరా ఉండదని శంషాబాద్ ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు.

కొనసాగుతున్న ఉస్మాన్‌సాగర్ నీటి విడుదల

నార్సింగి: ఉస్మాన్‌సాగర్ జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి వరద కొనసాగుతుండటంతో జలమండలి అధికారులు రెండు గేట్లను అడుగు మేర ఎత్తి నీటిని వరసగా నాలుగో రోజు దిగువకు వదిలారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు జలాశయ నీటి మట్టం 1,790 అడుగులుగా పేర్కొన్నారు. జలాశయంలోకి వరద (ఇన్‌ఫ్లో) 300 క్యూసెక్కులు కాగా ఔట్‌ఫ్లో 242 క్యూసెక్కులుగా ఉందన్నారు.

పురపాలిక కార్మికులకు వైద్యపరీక్షలు

షాద్‌నగర్: షాద్‌నగర్ పురపాలిక కార్మికులకు శుక్రవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతినిత్యం పారిశుద్ధ్య పనులను చేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్మికుల ఆరోగ్యం నిమిత్తం ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కమిషనర్ చీమ వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని పురపాలికఛైర్మన్ నరేందర్ ప్రారంభించారు.

వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తం

● పలు బస్తీల్లో అంధకారం ● రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఫిర్యాదులకు స్పందించని అధికారులు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొంత కాలంగా పలు బస్తీల్లో లైట్లు వెలగడం లేదని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా సంబంధిత సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా చోట్ల వీధిలైట్లు వెలగకపోవడంతో బస్తీల్లో రాత్రి వేళల్లో అంధకారం నెలకొంటుంది. ఏ బస్తీలో చూసినా వెలగని వీధి దీపాలు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నాయి. అత్తాపూర్, శివరాంపల్లి, పద్మశాలిపురం, రాజేంద్రనగర్, హైదర్‌గూడ, కాంతారెడ్డినగర్, కేశవ్‌నగర్, ఉప్పర్‌పల్లిలో వీధిలైట్లు వెలగడం లేదంటూ స్థానికులు 'ఈనాడు' దృష్టికి తెస్తున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించడం లేదు. వీధిలైట్ల నిర్వహణ బాధ్యతలను ఈఈఎస్ఎల్ సంస్థ చూస్తుండగా ఆ సంస్థ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండటం లేదనే విమర్శలున్నాయి. రెండుమూడు నెలలుగా లైట్లనిర్వహణకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో మరమ్మతులు మాత్రమే చేస్తున్నట్లు సంస్థ ఛీత సిబ్బంది ఒకరు తెలిపారు. కొత్త సామగ్రి లేని కారణంగా లైట్లు పాడైనా కొత్తవి ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పట్టించుకోని అధికార యంత్రాంగం

నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థకు అప్పజెప్పినా ఆ సంస్థ ఎలా పనిచేస్తుందనే విషయంపై సర్కిల్ అధికారులు పర్యవేక్షణ చాలి. కానీ రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు ఏ మాత్రం వీధి దీపాల నిర్వహణను పర్యవేక్షించడం లేదనే ఆరోపణలున్నాయి. ఆ సంస్థ సభ్యులు రోజు ఎక్కడ పనిచేస్తున్నారో, లైట్లు బాగు చేస్తున్నారనే విషయంపై సమీక్ష నిర్వహించడం లేదు. ఈ సంస్థ సభ్యులు ప్రభుత్వం నుంచి వచ్చే బిల్లుల్లో కమిషన్ రూపంలో ప్రతి నెలా కొంత ముట్టజెప్పుతున్న కారణంగా సర్కిల్ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించడం లేదనే ఆరోపణలున్నాయి. అంతర్గత బస్తీల్లో వీధిదీపాలు బాగు చేయకున్నా చేసినట్లు తప్పుడు లెక్కలు రాస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం

– రామారావు, డీఈఈ, దక్షిణమండలం విద్యుత్ విభాగం, జీహెచ్ఎంసీ

వీధి దీపాల సమస్యను త్వరలో పూర్తిగా పరిష్కరిస్తాం. గతంతో పోలిస్తే 10-15 రోజులుగా లైట్ల నిర్వహణ మెరుగుపడింది. రాబోయే వారం పదిరోజుల్లో పరిస్థితి మరింత మెరుగవుతుంది. ప్రతిరోజు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

సర్కిల్లో మొత్తం వీధి దీపాలు:	25,600
ప్రస్తుతం పనిచేస్తున్నవి: (అధికారుల లెక్కల ప్రకారం)	24,500
రోజూ అందుతున్న ఫిర్యాదులు	
ఆన్‌లైన్‌లో:	40
ఆఫ్‌లైన్‌లో	30 నుంచి 45
పరిష్కరిస్తున్న ఫిర్యాదులు:	25
పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు	
ఆన్‌లైన్‌వి:	310
ఆఫ్‌లైన్‌వి:	500
సామగ్రి సరఫరా లేనిది:	రెండు నెలల నుంచి

రూ.8.10 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం



కోకాపేటలో శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నాగపూర్ణ, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు

నార్సింగి, న్యూస్‌టుడే: నార్సింగి పురపాలక సంఘం పరిధిలోని వివిధ వార్డుల్లో రూ.8.10 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాల మేరకు మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అందరు కలిసికట్టుగా కృషిచేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఎమ్మెల్యే ప్రారంభించిన పనుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజి పనులతో పాటు మున్సిపల్ కార్యాలయంపై నిర్మించిన అదనపు అంతస్తు భవనం ఉంది. అలాగే వార్డు కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, అశోక్‌యాదవ్, శివారెడ్డి, దుర్గేష్‌యాదవ్, అమరేందర్ రెడ్డి, అరుణజ్యోతి, లక్ష్మీప్రవళిక కిరణ్, ఉషారాణి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్:	8008573330
శంకర్‌పల్లి :	8008573266
షాద్‌నగర్:	8008573907
శంషాబాద్:	9963096353

శంషాబాద్, చేవెళ్ల, కేశంపేట, కొందుర్గు, న్యూస్‌టుడే:

? శంషాబాద్‌లోని రుద్ర కాలనీలో నెల రోజులుగా తాగునీటి సరఫరా పైపులు లీకేజీ అవుతున్నాయి. ఇళ్లకు చేరాల్సిన నీరు రహదారిపై వృథాగా పారుతోంది. – రాజు, రుద్ర కాలనీ, శంషాబాద్

✓ రుద్ర కాలనీలో తాగునీటి పైపుల లీకేజీ సమస్య నా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయిస్తాం – బి.సుమన్‌రావు, కమిషనర్ శంషాబాద్ మున్సిపాలిటీ

? చేవెళ్ల నుంచి శంకర్‌పల్లి మార్గంలో ఉదయం బస్సులు సక్రమంగా రావడం లేదు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు హాజరయ్యేందుకు ఇబ్బందులు పడుతున్నారు. –అమరేందర్‌రెడ్డి, చేవెళ్ల

✓ బస్సు బ్రేక్‌డౌన్ సమస్య కారణంగా రెండు రోజులు సమస్య వచ్చింది. ఇక మీదట ఇబ్బందులు లేకుండా బస్సు సర్వీసులు నడిపిస్తాం. –అనురాధ, ఆర్టీసీ డిపో మేనేజరు

? ఇప్పలపల్లి ఒకటో వార్డులోని రహదారిలో వాన నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. రోజుల తరబడి అలాగే ఉంటోంది. –ఎల్లయ్య, ఇప్పలపల్లి

✓ క్షేత్రస్థాయిలో సమస్య పరిశీలించి పరిష్కరిస్తాం. అవసరమైతే అక్కడ రహదారి ఎత్తు పెంచే ఆలోచన ఉంది. –రవిచంద్రకుమార్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, కేశంపేట

? షాద్‌నగర్ డిపో బస్సులు కొన్ని రాత్రి వేళల్లో కొందుర్గు బస్టాండ్‌లోకి రాకుండా వెళ్తున్నాయి. దీంతో అక్కడ నిరీక్షిస్తున్న ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. –శ్రీనివాస్. కొందుర్గు

✓ ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా బస్సులను బస్టాండ్‌లో నిలిపేలా చర్యలు తీసుకుంటాం. –ఉష, షాద్‌నగర్ ఆర్టీసీ డీఎం

వెస్టెండ్ మిడోస్ కాలనీలో తొలగిన అంధకారం

స్పందనకు వందనం

నార్సింగి, న్యూస్‌టుడే: నార్సింగి మున్సిపాలిటీ వెస్టెండ్ మిడోస్ కాలనీలో నెలకొన్న అంధకారంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో గురువారం ప్రచురితమైన సమస్యకు అధికారులు స్పందించారు. గురు, శుక్రవారాల్లో కాలనీలో 10 వీధి దీపాలను అమర్చడంతో పాటు పాత వాటికి మరమ్మతు చేయించారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా గండె సురేష్



షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన గండె సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. హైదరాబాద్‌లోని సంఘం భవనంలో గురువారం ఆర్యవైశ్య సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్ష పదవి కోసం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. వారిలో ఐదుగురు అభ్యర్థులు శుక్రవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఊరె లక్ష్మణ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా గండె సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

శబరిమలకు పాదయాత్రగా అయ్యప్ప స్వాములు



చిలుకూరు బాలాజీ ఆలయం నుంచి బయల్దేరిన స్వాములు

మొయినాబాద్, న్యూస్‌టుడే: అయ్యప్ప దీక్ష, పాదయాత్ర ఎంతో పవిత్రమైనయని చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు సీఎస్ రంగరాజన్ అన్నారు. మొయినాబాద్ మండలం చిలుకూరుకు చెందిన 21 మంది అయ్యప్ప మాలధారణ భక్తులు శుక్రవారం శబరిమల అయ్యప్పస్వామి దేవాలయానికి పాదయాత్రగా బయల్దేరారు. ఈ సందర్భంగా బాలాజీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇరుముడులు కట్టుకొని పాదయాత్ర మొదలుపెట్టారు. పాదయాత్ర విజయవంతంగా పూర్తికావాలని రంగరాజన్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో గురుస్వామి కేశవ, సహదేవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ వ్యక్తిని వీసీగా నియమించడంపై హర్షం

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి తొలిసారిగా ఉపకులపతిగా బీసీ కులానికి చెందిన వ్యక్తిని నియమించడంపై విశ్వవిద్యాలయం బీసీ ఉద్యోగుల సంఘం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. వర్సిటీ వీసీగా ప్రొ.అల్దాస్ జానయ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో బీసీ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు బిక్షపతి, ప్రధాన కార్యదర్శి దశరథ్, రమేష్, కృష్ణ, కవిత, సంతోష్‌గౌడ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభావంతుడైన ప్రొ.అల్దాస్ జానయ్యను వీసీగా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



వత్తుల కేంద్రం వద్ద మహిళా సంఘం సభ్యులు

నందిగామ, న్యూస్‌టుడే: గ్రామీణ మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని డీఆర్డీవో శ్రీలత అన్నారు. నందిగామ మండలం సంఘీగూడలో మహిళా సంఘం రుణాలు రూ.5 లక్షలతో లబ్ధిదారు వడ్డె కవిత ఏర్పాటు చేసిన దీపం వత్తుల కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాలను మహిళా సంఘాల సభ్యులు తీసుకోవడంతో పాటు చెల్లింపులు జరిపి జిల్లాలోనే నందిగామ మండలాన్ని ఆదర్శంగా నిలపాలని సూచించారు.

ప్రజాభవన్‌లో 627 అర్జీలు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి శుక్రవారం 627 అర్జీలు అందాయి. అధికంగా ఇళ్ల కోసం 185 రాగా, సాంఘిక సంక్షేమ శాఖ-108, రెవెన్యూ-60, విద్యుత్-57, ఎన్ఆర్ఐ విభాగం-4, ఇతర శాఖలకు 213 వచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటిని పరిష్కరించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డితో పాటు నోడల్ అధికారి దివ్య అధికారులకు సూచించారు.

సంపాదనలో కొంత సమాజానికి కేటాయించాలి

శంషాబాద్: సంపాదనలో కొంత సమాజ శ్రేయస్సు కోసం ఖర్చు చేయడం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా భావించాలని లిమ్స్ హాస్పిటల్స్ ఛైర్మన్ డా.దిద్యాల రామరాజ్ పేర్కొన్నారు. శంషాబాద్ మండలం ఘాన్సిమియాగూడలో జాతీయ రహదారిపై, శంకరాపురం రోడ్లపై వాహనాల వేగ నియంత్రణ కోసం డా.రామరాజ్ సొంత నిధులతో బారికేడ్లను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఘాన్సిమియాగూడ గ్రామస్థులు శంషాబాద్‌లో డా.రామరాజ్‌ను శాలువాలతో సన్మానించారు. ప్రతిమను అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై ద్విచక్రవాహనాలు, బస్సుల జోరు





కాటేదాన్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ నుంచి మెహిదీపట్నం సరోజిని కంటి ఆసుపత్రి వరకు 11 కిలోమీటర్ల మేర ఉన్న పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ప్రత్యేక గుర్తింపున్న ఈ ఫ్లైఓవర్‌పై కేవలం నాలుగు చక్రాల వాహనాలకే అనుమతి ఉంది. ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా నగరంలో నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి నేరుగా ప్రయాణించడానికి ఉద్దేశించి నిర్మించిన ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రస్తుతం ఇష్టారాజ్యంగా ద్విచక్ర వాహనాలు, బస్సులు ప్రయాణిస్తున్నాయి. దీంతో త్వరగా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లాలనుకునే వారు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ద్విచక్ర వాహనాలపై పలువురు యువకులు ఫీట్లు చేస్తూ వెళ్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశమూ ఉంది. దీనిపై రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. పీవీఎన్ఆర్ ఫ్లైఓవర్‌పై నాలుగు చక్రాల వాహనాలు మినహా 2, 3, 5, ఆపై ఆరుకుపైగా చక్రాలున్న వాహనాలకు అనుమతులు లేవన్నారు. అవి వెళ్తున్నట్లయితే వాటిపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కేక పుట్టించిన కూత



ఈనాడు, హైదరాబాద్: కబడ్డీ కబడ్డీ అంటూ స్టార్ ఆటగాళ్లు పాయింట్ల కూత పెడుతుంటే.. ప్రత్యర్థి రైడర్లను డిఫెండర్లు పట్టేస్తుంటే.. తెలుగు అభిమానులు కేరింతలు కొట్టారు. శుక్రవారం గచ్చిబౌలి స్టేడియంలో ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్ ఆరంభమైంది. ఈ కబడ్డీ మ్యాచ్‌లు అభిమానులను అలరించాయి. తొలి మ్యాచ్‌లో సొంతగడ్డపై తెలుగు టైటాన్స్ చెలరేగి బెంగళూరు బుల్స్‌ను మట్టికరిపించింది. మరో మ్యాచ్‌లో యు ముంబాపై దబంగ్ దిల్లీ గెలిచింది. బాలీవుడు నటీనటులు విద్యాబాలన్, కార్తీక్ ఆర్యన్ ముఖ్య అతిథులుగా సందడి చేశారు.

మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు

'ఈనాడు' చిత్ర వార్తకు స్పందన



కాటేదాన్, న్యూస్‌టుడే: ఆరాంఘర్ నుంచి పాతబస్తీ వెళ్లే బెంగళూరు జాతీయరహదారిలో ధ్వంసమైన మ్యాన్‌హోల్ మూతను కొత్తది ఏర్పాటు చేసి గుంతను కొత్తగా నిర్మించారు. 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురితమైన 'మూత ధ్వంసం... ప్రమాదకరంగా మ్యాన్‌హోల్' చిత్ర వార్తకు అధికారులు స్పందించారు.

ప్రజాసంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయం: భాజపా



ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వం అందజేస్తూ..

మొయినాబాద్: ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని భాజపా రాష్ట్ర నాయకుడు గున్నాల గోపాల్ రెడ్డి అన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. మొయినాబాద్ మండలం అమ్డాపూర్ చౌరస్తాలో శుక్రవారం యువమోర్చా ఆధ్వర్యంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యువమోర్చా నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, మల్లారెడ్డి, విక్రంరెడ్డి, సంజీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం: ఏబీవీపీ

చేవెళ్ల: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ.. ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక పేద విద్యార్థుల చదువులు అర్ధాంతరంగా నిలిచిపోయే ప్రమాదం ఉందని వాపోయారు. విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందని దుయ్యబట్టారు. బకాయిలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కిషోర్, విజయ్, ప్రశాంత్, శివ, అఖిల, ప్రవళిక, సంధ్య, పావని, భాను తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం నేడు

చేవెళ్ల, న్యూస్‌టుడే: చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం స్థానిక కేజీఆర్ గార్డెన్స్‌లో శనివారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, శాసనమండలి ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరు కానున్నారని పేర్కొన్నారు.

సత్ప్రవర్తనతో సమాజాభివృద్ధికి పాటుపడాలి

షాద్‌నగర్ న్యూటౌన్: విద్యార్థి దశనుంచే సత్ప్రవర్తన అలవర్చుకుని సమాజాభివృద్ధికి పాటుపడాలని విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు సూచించారు. అలాగే క్రమశిక్షణ, ఆసక్తితో చదివి భవిష్యత్‌కు బంగారుబాట వేసుకోవాలన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడలోని షాద్‌నగర్ ఐటీఐ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న హత్యలు, అఘాయిత్యాలను నివారించడంలో విద్యార్థుల పాత్ర చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్, అధ్యాపకులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల ప్రగతికి కార్పొరేట్ సంస్థల కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాబాద్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అమెజాన్ వెబ్ సర్వీసెస్(ఏడబ్ల్యూఎస్)లాంటి కార్పొరేట్ సంస్థలు కృషి చేస్తున్నాయని టీఎస్ఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఏడబ్ల్యూఎస్ సహకారంతో షాబాద్ మండలం మాచనపల్లిలో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, చెరువు పునరుద్ధరణ, సోలార్ విద్యుత్ దీపాలను ఆయన ఏడబ్ల్యూఎస్ అధికారి సాజీ పీకేతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణిత విద్యను ప్రోత్సహించేందుకు థింక్ బిగ్ స్పేసెస్‌ను ఏర్పాటు చేశారని సాజీ పీకే తెలిపారు. కార్యక్రమంలో ఆదిత్య చౌదరి, మహేందర్‌రెడ్డి, రాంరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్ పట్టణంలోని యువతి(19) కొంత కాలంగా ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 13న రోజూ మాదిరిగా కుటుంబసభ్యులు పనులకు వెళ్లారు. సాయంత్రం తిరిగొచ్చేసరికి ఆమె కనిపించలేదు. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ దొరకలేదు. దీంతో యువతి తల్లి ఫిర్యాదు చేయగా ఆర్జీఐఏ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రహదారిపై బుసకొట్టిన నాగుపాము



శంషాబాద్: శంషాబాద్ మండల పరిధి నర్కూడ సమీపంలో శంషాబాద్-షాబాద్ రహదారిపై గురువారం రాత్రి ఓ నాగుపాము అరగంట తిష్టవేసింది. ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులపై పడగ విప్పి బుసలు కొట్టడంతో భయభ్రాంతులకు గురయ్యారు. నాగుపామును గమనించిన వాహనదారులు కొందరు ఆగి సెల్‌ఫోన్లలో చిత్రీకరించి ఆ దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో స్థానికంగా అవి చక్కర్లు కొట్టాయి.

విష రసాయనాలతో చనిపోయిన చేపలు



కాశన్నకుంట చెరువులో..

కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరులోని కాశన్నకుంట చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. శుక్రవారం ఉదయం వేటకు వెళ్లిన మత్స్యకారులు నీటిలో తేలిన చేపలను చూసి నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం అందించారు. సంబంధిత అధికారులు వచ్చి చెరువును పరిశీలించారు. ఎగువవైపున్న ఓ పాలిమర్ పరిశ్రమ నుంచి రసాయన వ్యర్థ జలాలు చెరువులో కలుస్తున్నట్లు మత్స్యకారులు గుర్తించి వారికి తెలిపారు. దీంతో నీటిపారుదల శాఖ అధికారులు పరిశ్రమ నిర్వాహకులతో మాట్లాడి రసాయన జలాలు కలవకుండా చూడాలని హెచ్చరించారు. చేపల మృతితో సుమారు రూ.2 లక్షలు నష్టపోయినట్లు స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

డీసీఎం డ్రైవర్ అనుమానాస్పద మృతి

శంషాబాద్, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ డ్రైవర్ మృతి చెందిన సంఘటన శంషాబాద్‌లో చోటు చేసుకుంది. ఆర్జీఐఏ పోలీసుల వివరాల ప్రకారం.. కర్ణాటకలోని కొప్పాల్ జిల్లాకు చెందిన అమీర్(50) డీసీఎం డ్రైవింగ్ చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తన వాహనంలో కర్ణాటక నుంచి సరకును నింపుకొని సాతంరాయి పారిశ్రామిక వాడలోని మీనాక్షి పరిశ్రమకు వచ్చాడు. సరకును అన్‌లోడింగ్ చేస్తుండగా స్పృహ కోల్పోయాడు. గమనించిన పరిశ్రమ నిర్వాహకులు వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతదేహాన్ని ఉస్మానియా శవాగారానికి తరలించారు.

బస్టాపు ఏర్పాటుకు వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తమకు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించినా.. సమీపంలో బస్టాప్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని అబ్దుల్లాపూర్‌మెట్ డబుల్ బెడ్ రూం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు వాపోయారు. డబుల్ బెడ్ రూం కాలనీ వద్ద బస్టాప్ లేకపోవడంతో అబ్దుల్లాపూర్‌మెట్ లేదా ఇనాంగూడ వరకు నడిచి వెళితేనే ఆర్టీసీ బస్సులు ఎక్కేందుకు అవకాశం ఉంటోందని, కాలనీ వద్ద ఆర్టీసీ బస్టాప్ ఏర్పాటు చేయాలని శుక్రవారం సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో హయత్‌నగర్ ఆర్టీసీ డిపో 2 మేనేజర్ శ్రీనివాస్‌ను, డిపో 1 సీఐ తదితరులను కలిసి విన్నవించారు. ఆర్టీసీ అధికారులు బస్టాప్ ఏర్పాటుకు చర్యలు చేపడితే 180 కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కర గోపిశంకర్, సొసైటీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్, కార్యదర్శి అవినాష్ సింగ్, కోశాధికారి కె.శ్రీనివాస్, ఆయా విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహేశ్వరం

•మహేశ్వరం •ఇబ్రహీంపట్నం •కల్వకుర్తి

108 వాహనంలో ప్రసవం

ఆమనగల్లు, న్యూస్‌టుడే: పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను ఆస్పత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామానికి చెందిన లావణ్య పురిటి నొప్పులు రావటంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. దారిలో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రం సమీపంలోకి చేరుకోగానే ప్రసవించింది. అనంతరం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. డెలివరీ చేసిన ఈఎంటీ కల్యాణ్, పైలట్ శ్రీనివాస్‌రెడ్డిని కుటుంబ సభ్యులు, వైద్యులు అభినందించారు.



లావణ్య, శిశువుతో అంబులెన్స్ ఈఎంటీ కల్యాణ్, పైలట్ శ్రీనివాస్‌రెడ్డి

సీఎం కప్ 2024 టార్చ్ ర్యాలీ నేడు

ఆదిభట్ల, న్యూస్‌టుడే: గాయత్రినగర్‌లోని టీకేఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ కమాన్ దగ్గర నుంచి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వరకు శనివారం సీఎం కప్ 2024 టార్చ్ ర్యాలీ ఉంటుందని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ క్రీడలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 3న ఈ ర్యాలీని ప్రారంభించారని, 33 జిల్లాల్లో తిరిగి శనివారం సాయంత్రం 4 గంటలకు టీకేఆర్ కమాన్ వద్దకు చేరుకుని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం చేరుకుంటుందన్నారు.

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

తుర్కయంజాల్ పురపాలిక: మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 3.30 వరకు తుర్కయంజాల్ మున్సిపాలిటీ బ్యాంక్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, రామానుజ నగర్ కాలనీ, మల్లికార్జున నగర్, యాదాద్రి నగర్, ఆదర్శనగర్, వడ్డెర బస్తీ, ప్రగతినగర్, శనీశ్వర దేవాలయం, ఆదిత్యనగర్, మునగనూర్ పంచాయతీ, గణేష్‌నగర్, శివ సాయిరాం నగర్ తదితర కాలనీల్లో కరెంటు ఉండదని ట్రాన్స్‌కో ఏఈ రాములు తెలిపారు.

పాఠశాల మరమ్మతుకు సాయం

తలకొండపలి: తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో మరమ్మతుల కోసం స్థానిక నాయకుడు రాజేందర్ రెడ్డి శుక్రవారం సాయాన్ని అందించారు. పాఠశాలకు విద్యుత్తు కనెక్షన్లు, ఇతర సామగ్రి కొనుగోలు కోసం రూ.30 వేలతో పనులను పూర్తి చేయడంతో ఉపాధ్యాయులు సన్మానించారు.

నిలువ నీడ.. కూర్చునే వసతి లేదు

బస్టాపుల్లో నిత్యం ప్రయాణికుల అవస్థ



అబ్దుల్లాపూర్‌మెట్‌లో బస్ షెల్టర్ లేక రోడ్డు మీదే వేచి ఉన్న ప్రయాణికులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, ఆర్కేపురం, మంచాల, న్యూస్‌టుడే

సామాన్యుడికి ఆర్టీసీ బస్సు ఎక్కనిదే రోజు గడవదు. బస్సు ఎక్కాలంటే తప్పనిసరిగా బస్టాప్‌నకు వెళ్లాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రవేశపెట్టడంతో బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఏ బస్టాప్ చూసినా విద్యార్థులు, ప్రయాణికులతో కళకళలాడుతోంది. నగరంలోని బస్టాపుల్లో షెల్టర్లు ఉన్నా.. ప్రయాణికులు కూర్చునేందుకు బల్లలు, కుర్చీలు లేవు. మరో పక్క గ్రామీణ ప్రాంతాల్లో బస్ షెల్టర్ల జాడ లేక ప్రయాణికులు రోడ్ల వెంట, కూడళ్లలో వేచి ఉండాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో స్థితిగతులపై 'న్యూస్‌టుడే' పరిశీలనాత్మక కథనం..



విక్టోరియా మెమోరియల్ వద్ద వాహనాలు నీడలో.. ప్రయాణికులు ఎండలో..

ప్రధాన కూడళ్లలోనూ..

ఇబ్రహీంపట్నం ప్రాంతంలోని కళాశాలలకు నిత్యం వేలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వేలాది మంది రాకపోకలు సాగించే ఇబ్రహీంపట్నం, శేరిగూడ, మంగళ్‌పల్లి గేట్ తదితర రద్దీ ప్రాంతాల్లోనూ బస్ షెల్టర్ల జాడ లేదు.

కోసం వేచి ఉంటున్నారు. విక్టోరియా మెమోరియల్ వద్ద నీడలో వాహనాలు ఉంటే.. ప్రయాణికులు ఎండలో ఉండాల్సిన దుస్థితి. ఆర్కేపురం నుంచి నాగోల్ వెళ్లే ప్రధాన రహదారిలోని బస్ షెల్టర్లలో ప్రయాణికులు కూర్చునే సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో..

మంచాల మండలంలోని జాపాల, చిత్తాపూర్, ఎల్లమ్మతండ, లోయపల్లి తదితర గ్రామాల్లో బస్ షెల్టర్లు ఊసే లేదు. రంగాపూర్, కాగజ్‌ఘాట్, లింగంపల్లి, ఆగపల్లి తదితర చోట్ల షెల్టర్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మంచాల, ఆరుట్లలో బస్ షెల్టర్లు ప్రయాణికులకు ఉపయోగపడుతున్నాయి.

నగరంలోనూ తిప్పలే..

ఎన్‌హెచ్ 65లోని ఎన్టీఆర్‌నగర్‌లో బస్ షెల్టర్లు ఉన్నా.. కూర్చునే సౌకర్యం లేక ప్రయాణికులు నిల్చునే బస్సుల

వేలాది ప్రయాణికులు..

అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంతో పాటు ఇనాంగూడ, బాటసింగారం పరిసర ప్రాంతాల్లోని విద్యాలయాలకు నిత్యం వేలాది మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లోనే వచ్చి వెళతారు. వారు బస్సుల కోసం వేచి ఉండేందుకు బస్ షెల్టర్లు లేకపోవడంతో రోడ్డుపైనే నిలిచి ఉండాల్సిన దుస్థితి. వేలాది మంది విద్యార్థులు, మహిళలు వేచి ఉండేందుకు అనువుగా బస్టాపులు లేకపోగా.. కనీసం శౌచాలయాలు అందుబాటులో లేవు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్ పురపాలిక, యాచారం, ఆదిభట్ల, కందుకూరు, న్యూస్‌టుడే:

? శేరిగూడ నుంచి ఇబ్రహీంపట్నం రహదారిలో దీపాలు వెలగట్లేదు. – రాజేష్, ఇబ్రహీంపట్నం.

✓ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –రవీంద్రసాగర్, కమిషనర్, ఇబ్రహీంపట్నం

? తుర్కయంజాల్ గ్రామం నుంచి మన్నెగూడ విద్యుత్ ఉపకేంద్రం వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. –వెంకట్, స్థానికుడు

✓ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. –కె.అమరేందర్‌రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్

? యాచారంలో సెల్‌టవర్ వద్ద చెత్త పేరుకుపోయింది. దుర్వాసన వస్తోంది. దోమల బెడద పెరిగింది. – ప్రవీణ్, యాచారం

✓ సమస్యలు పరిష్కరిస్తాం. – తిరుపతయ్య, కార్యదర్శి, యాచారం

? బొంగుళూరులో దోమల బెడద ఎక్కువగా ఉంది. సమస్య పరిష్కరించండి. –వేణు, బొంగుళూరు

✓ ఫాగింగ్ నిర్వహించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. – బాలకృష్ణ, కమిషనర్, ఆదిభట్ల

? కందుకూరులో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలో కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ నిలిచిపోతోంది. –శ్రీనివాస్, కందుకూరు

✓ కూరగాయల దుకాణాలను తరలించేందుకు చర్యలు చేపడతాం. –సరిత, ఎంపీడీఓ, కందుకూరు

ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్న ద్విచక్రవాహనం

యువకుడి మృతి.. మరొకరికి గాయాలు



మహేశ్వరం, న్యూస్‌టుడే: అమీర్‌పేట- గొల్లూరు రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో యువకుడు తీవ్ర గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుందని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గొల్లూరు గ్రామానికి చెందిన **కత్తుల నర్సింహా** (30), అదే గ్రామానికి చెందిన మరో యువకుడు మంద రాజులు అమీర్‌పేట నుంచి గొల్లూరుకు ద్విచక్రవాహనంపై వెళుతూ ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని బలంగా ఢీకొట్టారు. బైక్ నడుపుతున్న నర్సింహా అక్కడికక్కడే మృతిచెందాడు. రాజు తీవ్రంగా గాయపడగా.. చికిత్స నిమిత్తం పోలీసులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పనులు నిలిచిపోవటంతో ఇబ్బందులు



సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న భారాస నాయకులు

బాలాపూర్, న్యూస్‌టుడే: నాదర్‌గుల్ రహదారి విస్తరణ పనుల్లో డివైడర్, సెంట్రల్ లైటింగ్‌ను వెంటనే ఏర్పాటు చేయించాలని స్థానిక భారాస నాయకులు రామోజీ నరేష్‌చారి, కోటగిరి జంగయ్య తదితరులు ఎమ్మెల్యే సబితారెడ్డికి విన్నవించారు. ఈ మేరకు ఆమెకు వినతి పత్రం అందజేశారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గాంధీనగర్ నుంచి నాదర్‌గుల్ వరకు రహదారిని విస్తరించారనీ.. డివైడర్, సెంట్రల్ లైట్ సిస్టమ్ పనులు నిలిచిపోయాయని వివరించారు. దీని వల్ల అటుగా ప్రయాణించే పలు గ్రామాల ప్రజలతోపాటు టీసీఎస్, టాటా ఏరోస్పేస్ ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మధ్యలో రోడ్డు కట్ చేసి ఉండటంతో వాహనాలను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే పనులు పూర్తి చేయించాలని కోరారు.

మార్కెట్‌లో దళారీ వ్యవస్థను అరికడతాం



మాట్లాడుతున్న చిలుక మధుసూదన్ రెడ్డి

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కమిటీ సభ్యులతో కలిసి మార్కెట్‌ను సందర్శించారు. రైతులు, వినియోగదారులు, వ్యాపారులు, హమాలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలుక నర్సింహారెడ్డి నూతన పాలక వర్గాన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అండగా నిలుస్తూ, దళారీ వ్యవస్థను అరికడతామన్నారు. మార్కెట్ శుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. గడ్డి అన్నారం మార్కెట్ వైస్ ఛైర్మన్ భాస్కరాచారి, మార్కెట్ డైరెక్టర్లు జైపాల్ రెడ్డి, బండి మధుసూదన్ రావు, రఘుపతి రెడ్డి, నరసింహా, గణేష్ నాయక్, నవరాజ్, గోవర్ధన్ రెడ్డి, అంజయ్య, వెంకట్ గుప్త, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, ఎన్టీఆర్ నగర్ మార్కెట్ కార్యదర్శి వాహీద్ పాల్గొన్నారు.

'స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఉండదా?'

బాలాపూర్, న్యూస్‌టుడే: బడంగ్‌పేటలోని రంగారెడ్డి జిల్లా కేంద్రం గ్రంథాలయ ఛైర్మన్‌గా నియమితులైన మధుసూదన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి సమాచారం ఎందుకు ఇవ్వలేదని కార్పొరేషన్ భారాస ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థలం కేటాయింపు మొదలు భవన నిర్మాణం, గ్రంథాలయాన్ని ఇక్కడికి తరలించేందుకు ఆమె చేసిన కృషి ఇక్కడి ప్రజలు ఎన్నడూ మరువరన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో పార్టీ కార్యక్రమంలా నిర్వహించారని, సమాచారం ఇవ్వనందుకు ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తొలుత అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

పిడుగుపాటుకు 23 గొర్రెల మృత్యువాత



ఆమనగల్లు, న్యూస్‌టుడే: మాడ్గుల మండలం అంతంపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై 23 గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన ముచ్చర్ల చిన్న బక్కయ్య అనే రైతు పొలాల్లో గొర్రెలను మేపుతుండగా వర్షం కురవడంతో గొర్రెలతోపాటు చెట్టు కిందకు వెళ్లారు. అదే సమయంలో పిడుగుపాటుకు గురై గొర్రెలు మృతిచెందినట్లు తహసీల్దార్ వినయ్‌సాగర్ చెప్పారు.

'హైటెన్షన్ విద్యుత్తు లైన్‌తో నష్టం'

కడ్తాల్ (ఆమనగల్లు): కడ్తాల్ మండల కేంద్రం సమీపంలో నుంచి నిర్మిస్తున్న 765 కేవీ విద్యుత్తు పవర్ గ్రిడ్ హైటెన్షన్ లైన్ మార్చాలని కోరుతూ రైతులు, గ్రామస్థులు శుక్రవారం తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రం సమీపంలో నుంచి హైటెన్షన్ విద్యుత్తు లైన్ నిర్మిస్తే రైతులు, విద్యాలయాలకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

హమాలీలకు ఆరోగ్యకార్డులివ్వాలి

మహేశ్వరం, న్యూస్‌టుడే: హమాలీ కార్మికులకు ప్రమాదాలు జరిగితే ఆదుకోవడానికి ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దత్తునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మహేశ్వరం పౌరసరఫరాల గోదాము ముందు కార్మికులతో ఆయన మాట్లాడారు. వృద్ధాప్యంలో పింఛన్ సౌకర్యం లేకపోవడంతో తమ బతుకులు అగమ్యగోచరంగా మారే పరిస్థితి ఉందన్నారు. ఈనెల 20న రాజేంద్రనగర్‌లో జరిగే హమాలీల సమావేశంలో పాల్గొనాలని కోరారు.

పట్టాభూమిలోకి మురుగు వెళ్లకుండా చర్యలు

మహేశ్వరం: మహేశ్వరం మండలం ఏనుగు చెరువు తండాను జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, ఎంపీడీవో శైలజారెడ్డిలు శుక్రవారం సందర్శించారు. ప్రజాపాలనలో ఓ రైతు ఇచ్చిన ఫిర్యాదుతో సమస్యను పరిష్కరించేందుకు వెళ్లి పరిశీలించారు. పట్టాభూమిలోకి తండా మురుగునీరంతా వచ్చి చేరుతుండటంతో ఇంటిని నిర్మించుకోవాలంటే ఇబ్బందిగా ఉందని ఫిర్యాదు చేయడంతో గ్రామాన్ని సందర్శించినట్లు చెప్పారు. ముందుగా మురుగునీరు పట్టాభూమిలోకి వెళ్లకుండా రోడ్డు వెంట కచ్చా కాలువను తీయాలని కార్యదర్శి జానయ్య ఆదేశించారు.

చెరువుల సర్వే వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక, చిత్రంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇతర అధికారులు

ఆదిభట్ల, న్యూస్‌టుడే: కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ కె.శశాంక చెరువుల సర్వే, ఎల్ఆర్ఎస్ 2020 దరఖాస్తుల పరిశీలన వేగవంతంపై ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెరువుల సర్వే త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించి ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లను గుర్తిస్తూ సర్వే పూర్తి చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ పాల్గొన్నారు.

బస్సు పునరుద్ధరించాలంటూ ఆందోళన

తలకొండపల్లి: అప్జల్‌గంజ్ నుంచి తలకొండపల్లి మండలంలోని జూలపల్లి, చంద్రధన, రాంపూర్, గట్టుఇప్పలపల్లి మీదుగా నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండపేట వరకు వెళ్లే ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక యువకులు ఆందోళన చేశారు. ఈ గ్రామాల మీదుగా ప్రయాణించే మహేశ్వర్ డిపో బస్సును కొన్ని రోజుల నుంచి నిలిపివేశారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారాస దసరా సమ్మేళనం విజయవంతానికి పిలుపు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: భారాస అధికారంలో లేకపోయినా నిరంతరం ప్రజల మధ్యనే ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతూనే ఉండాలని భారాస రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం భారాస కార్యాలయంలో యువజన, విద్యార్థి విభాగాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 20న బొంగులూరు సమీపంలోని ప్రమిద కన్వెన్షన్‌లో నిర్వహించే దసరా సమ్మేళనానికి ముఖ్య అతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నందున నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు హజరుకావాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని కాపలాదారు దుర్మరణం

యాచారం, న్యూస్‌టుడే: యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. నల్గొండ జిల్లా దిండి మండలం కానాపూర్ గ్రామ నివాసి తుపాకుల మల్లేశ (40) యాచారం మండలం నందివనపర్తి రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్‌లో కాపలాదారు (సెక్యూరిటీ గార్డు)గా పని చేస్తుంటాడు. ఇతడు మోటారు సైకిల్‌పై నానక్‌నగర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా.. పిల్లిపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. యాచారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దారంతా గతుకులే



మహేశ్వరం మండలం మన్‌సాన్‌పల్లి నుంచి పెద్దగోల్కొండ వెళ్లే దారిలో నాగారం గ్రామం వద్ద రహదారి అధ్వానంగా మారింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

– న్యూస్‌టుడే, మహేశ్వరం

మద్యం తాగుతూ ప్రాణాలొదిలాడు

బాలాపూర్, న్యూస్‌టుడే: మద్యం తాగుతూ అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందని ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు తెలిపారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు ప్రాంతానికి చెందిన కేశవరావు(60) భార్య కుమారులతో కలిసి అల్మాస్‌గూడలోని వినాయకహిల్స్‌లో నివసిస్తూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పక్కనే టీచర్స్ కాలనీలో ఉన్న వైన్ దుకాణానికి వెళ్లి మద్యం తాగుతూ అక్కడే అకస్మాత్తుగా కిందపడిపోయి చనిపోయాడు. వెంటనే అక్కడున్న వారు 100కు డయల్ చేయగా.. మీర్‌పేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి అతడి కుమారుడు ప్రశాంత్‌కు సమాచారం అందించారు. మృతికి కారణంపై దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిన పండగ ప్రత్యేక ఛార్జీ వసూలు

ఈనాడు కథనాలకు స్పందన

యాచారం: దసరా పండుగ ప్రత్యేక బస్సుల పేరుతో అదనపు ఛార్జీ వసూలును ఆర్టీసీ అధికారులు శుక్రవారం నిలిపి వేశారు. దసరా పండగ దాటి రోజులు గడిచిపోతున్నా బస్సుల్లో స్పెషల్ బోర్డు పెట్టి అదనపు ఛార్జీ వసూలు చేస్తున్నారు. ఈ తీరుపై ఈనాడులో 'ఆగని ఆర్టీసీ పండుగ స్పెషల్ దోపిడీ' శీర్షికతో శుక్రవారం వచ్చిన కథనానికి స్పందించారు. బస్సుల్లో స్పెషల్ బోర్డును తొలగించారు. సాధారణ ఛార్జీ వసూలు చేశారు.

పాదబాటపై చెట్ల కొమ్మల తొలగింపు

ఆర్కేపురం: ఆర్కేపురంలోని గ్రీన్‌హిల్స్ కాలనీ రోడ్డు నం-4లో పాదబాటపై నరికేసిన చెట్ల కొమ్మలు గుట్టలుగా పడి ఉన్నాయి. వాన కురిసిన ప్రతిసారి దోమలు, ఈగలతో స్థానికులు సతమతం అవుతున్నారంటూ గురువారం పాదచారులకు దారేది? శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. వెంటనే చెట్ల కొమ్మలను తొలగించారు.

పేద దంపతుల ఉపాధికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల చేయూత



ఏర్పాటు చేసిన అల్పాహార కేంద్రం

బాలాపూర్, న్యూస్‌టుడే: నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా ఉన్న విద్యార్థులు పేద దంపతులకు ఉపాధి కల్పించారు. నాదర్‌గుల్‌కు చెందిన రాజు, లావణ్యలు దంపతులు పేదవారు కావడంతో వారికి ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో విద్యార్థులే సొంతంగా రూ.20 వేల వరకు జమ చేసి కళాశాల ప్రహరీకి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఒక డబ్బాను ఏర్పాటు చేశారు. దానికి స్నాక్ -24 పేరు పెట్టి అల్పాహార కేంద్రంగా శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థుల ఉదారతను స్థానికులు అభినందించారు.

నాటిన ప్రతి మొక్కను బతికించాలి

మంచాల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నాటిన ప్రతి మొక్కను బతికించాలని మంచాల ఎంపీడీఓ బాలశంకర్, ఏపీఓ వీరాంజనేయులు కోరారు. శుక్రవారం మంచాల మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సాంకేతిక సహాయకుడు స్వామి, విమల, మహేష్, ప్రభాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై నిరసన



నినాదాలు చేస్తున్న ఫార్మసీ కళాశాల విద్యార్థులు

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజ్ రియింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం వెంటనే మంజూరుచేయాలని కోరుతూ శుక్రవారం తుర్కయంజాల్ పట్టణంలోని సెయింట్ పాల్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. గత రెండున్నరేళ్లుగా బకాయిలు పేరుకుపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ట్యూషన్, విద్యార్థుల నిర్వహణ ఫీజులను మంజూరుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

మంచాల: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఇబ్రహీంపట్నం డివిజన్ కమిటీ కార్యదర్శి ఏర్పుల తరంగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాల యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరిపి సమ్మెను విరమింపచేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే సచివాలయం ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా గందె సురేష్



షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన గందె సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. హైదరాబాద్‌లోని సంఘం భవనంలో గురువారం ఆర్యవైశ్య సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్ష పదవి కోసం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. వారిలో ఐదుగురు నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఊరె లక్ష్మణ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా గందె సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు

'ప్రధాని మోదీ పాలనలో సమ్మిళిత అభివృద్ధి'

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశం సమ్మిళిత అభివృద్ధి సాధిస్తోందని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్త అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. గౌరెల్లిలో గ్రామశాఖ అధ్యక్షుడు కొద్ది వేమన ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలువురికి పార్టీ సభ్యత్వం అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

తలకొండపల్లి: తలకొండపల్లి మండలంలో భాజపా సభ్యత్వానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.రవిగౌడ్ తెలిపారు. శుక్రవారం చీపునుంతల గ్రామంలో ఆయన సభ్యత్వ నమోదును చేపట్టారు.

సికింద్రాబాద్

• సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

భావితరాలకు విజ్ఞానం అందించాలి



జ్యోతి వెలిగిస్తున్న ప్రొఫెసర్ సుధాకర్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్క రిలో విజ్ఞానం ఉంటుందని, దాన్ని భావితరాలకు అందించాలని ఉస్మానియా రిటైర్డ్ ప్రొఫెసర్, డీన్ వి. సుధాకర్ తెలిపారు. సికింద్రాబాద్ ఎస్డీ రోడ్డులోని సెయింట్ ఆన్స్ బీఈడీ కళాశాలలో నిర్వహిస్తున్న సదస్సుకు ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చిన్నతనంలోనే విద్యార్థులు రామాయణం, భారతం, పంచతంత్రం వంటివి బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఓయూ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి ప్రొఫెసర్ మృణాళిని, కళాశాల ప్రిన్సిపల్ మేరి కుట్టి, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ ఆంథోనియా పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విద్యుత్తు ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 19న పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు కంటోన్మెంట్ ఏడీఈ నాగరాజు తెలిపారు. ● ఉదయం 10.30 నుంచి 11 వరకు: 11 కేవీ హెచ్‌ఎంటీ ఆఫీసర్స్ కాలనీ, యాదమ్మనగర్ ఫీడర్ల పరిధిలోని హెచ్‌ఎంటీ, పంచశీల్‌కాలనీ, గ్రీన్‌ఫీల్డ్‌కాలనీ, మధుమ్‌నగర్, శివానగర్, తిలకానగర్, సర్దార్ ఎన్‌క్లేవ్, కానాజిగూడ. ● ఉదయం 11 నుంచి 11.30 వరకు: 11 కేవీ జ్యోతికాలనీ, అయ్యప్పనగర్ ఫీడర్ల పరిధిలోని జ్యోతికాలనీ, కాకాగూడ, బీటీకాలనీ, బ్రిటిష్‌కాలనీ, జూపిటర్, సిరిపురి, గృహలక్ష్మి, సూర్యానపవినగర్, ఇషాక్ కాలనీ, ఎన్‌కేపీకాలనీ, ఎర్రపకట బస్తీ, ధర్మారెడ్డికాలనీ, ఎంఈఎస్ కాలనీ, గోల్నాకగర్. ● ఉదయం 11:30నుంచి 12 వరకు: 11 కేవీ పాడర్ బాలయ్యనగర్ ఫీడర్ పరిధిలోని ఎవీబీనగర్, భవానీనగర్, సిటిజన్ కాలనీ, అయ్యప్పనగర్, అంబేడ్కర్‌నగర్. ● మధ్యాహ్నం 12నుంచి 12:30వరకు: బృందావన్ ఆసుపత్రి, ఎంసీహెచ్ లైన్, వాటర్ వర్క్స్ లైన్. ● మధ్యాహ్నం 12:30 నుంచి ఒకటి వరకు: మధురా ఎన్‌క్లేవ్, శ్రీనివాసనగర్, బాల్‌ఖాన్, భారతీనగర్. ● 1 నుంచి 1.30 వరకు: బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, ఎస్పీ రోడ్డు, హాకీ స్టేడియం, రసూల్‌పురా, ఉషోగార్డెన్, జగదీష్‌నగర్, శ్రీలంక బస్తీ, ఇందిరమ్మనగర్, రామ్‌నగర్, మారుతీనగర్, దినకర్ నగర్, జోషినగర్, రామచంద్రయ్యకాలనీ.

హస్త కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రదర్శనలు

కార్ఖానా: హస్త కళాకారులను ప్రోత్సహించి, వారి ఉత్పత్తులు దేశవ్యాప్తంగా విక్రయించడానికి పలుచోట్ల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దేవి దేవకీ తెలిపారు. సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఏర్పాటుచేసిన ప్రదర్శనకు సంబంధించిన వివరాలను గురువారం విలేకరులకు వెల్లడించారు. కేవలం హస్తకళలే కాకుండా వినోదభరిత కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మినీ మోండా.. నిర్లక్ష్యమే నిండా

ప్రతిపాదనలకే పరిమితమైన ఏర్పాటు



నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం ఇదే

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: ప్రజాప్రయోజనానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చేసిన ప్రతిపాదనలవి. అందుకు అవసరమైన స్థలాన్ని గుర్తించి, నిధులను కూడా మంజూరు చేశారు. పనులకొచ్చేసరికి అడుగు కూడా ముందుకు పడలేదు. ఇదీ సికింద్రాబాద్‌లోని మినీ మోండా మార్కెట్ ఏర్పాటు పరిస్థితి. సికింద్రాబాద్ నియోజకవర్గం మెట్టుగూడ డివిజన్ పరిధిలోని చిలకలగూడ ఠాణా వెనక ఉన్న ఖాళీ స్థలంలో నిర్మించడానికి ప్రతిపాదించారు. వాస్తవానికి అక్కడే గతంలో అత్యాధునిక మోడల్ చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందుకు రూ.2.5 కోట్లు కూడా మంజూరయ్యాయి. స్థానికుల నుంచి విముఖత రావడంతో దాని స్థానంలో మినీ మోండా మార్కెట్ కట్టాలని నిర్ణయించారు. మోండా మార్కెట్‌లో ఉన్నట్లుగానే అన్ని రకాల దుకాణాలతోపాటు మాంసం, చేపల దుకాణాలు ఉంటాయని ప్రకటించారు. ప్రజోపయోగమైనదేనని ఎవరూ కాదనలేకపోయారు.

వివాదంలో స్థలం...

మినీ మోండా కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రకటించిన స్థలం ఏళ్ల తరబడి వివాదంలో ఉంది. అది తమదని జీహెచ్ఎంసీ చెబుతుండగా.. తమదేనని ప్రైవేటు వ్యక్తులు వాదిస్తున్నారు. ఆ వివాదం ఇప్పటికీ అలానే ఉంది. జీహెచ్‌ఎంసీ ఆ స్థలం తమదేనని పూర్తి వివరాలు ప్రభుత్వానికి నివేదించాల్సి ఉండగా.. ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. మరోవైపు యంత్రాంగం అక్కడే మినీ మోండా నిర్మిస్తామని చెబుతోంది. స్థలం విషయంలో స్పష్టత లేకపోవడంతో కొంత గందరగోళం నెలకొంది. ఇప్పటికే సగం నిధులు మంజూరై ఉన్నందువల్ల మినీ మోండా ఏర్పాటుకోసం కృషిచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఓ ఉన్నతాధికారి స్పందిస్తూ... మార్కెట్ ఏర్పాటుకు అంతా సుముఖంగానే ఉన్నారని, స్థల వివాదమే అడ్డంకిగా ఉందన్నారు. పరిష్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

మామూళ్లు మామూలే

● కాసులు కురిపిస్తున్న ఫ్లెక్సీ బోర్డులు ● ఐటీ శిక్షణా సంస్థల నుంచి అక్రమ వసూళ్లు



ఆదిత్యా ఎన్‌క్లేవ్ భవనంలో ఐటీ సంస్థల ఫ్లెక్సీలు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: అమెరికాలో ఐటీ ఉద్యోగం చేస్తున్న వారిలో చాలావరకు అమీర్‌పేటలోని కంప్యూటర్, ఇతర కోర్సుల్లో శిక్షణ తీసుకుంటుంటారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అత్యధిక ఐటీ శిక్షణా సంస్థలున్న ఈ ప్రాంతం కొందరికి బంగారు బాతులా మారింది. సాఫ్ట్‌వేర్ శిక్షణా సంస్థల ప్రచార ఆర్భాటాన్ని జీహెచ్‌ఎంసీ కింది స్థాయి సిబ్బంది సొమ్ము చేసుకుంటున్నారు. నెలనెలా మామూళ్లు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. అమీర్‌పేట, మైత్రీవనం, ఎస్సార్‌నగర్ ప్రాంతంలోనే సుమారు 200 వరకు ఐటీ శిక్షణా సంస్థలున్నాయి. ముఖ్యంగా ఆదిత్యా ఎన్‌క్లేవ్‌లోని అన్నపూర్ణ బ్లాక్, నీలగిరి బ్లాక్‌లతో పాటు మైత్రీవనం, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, మైత్రీ విహార్‌తో పాటు చుట్టుపక్కల ప్రతీ భవనం, చివరికి చిన్నచిన్న ఇళ్లలోనూ సాఫ్ట్‌వేర్ శిక్షణా సంస్థలు నిర్వహిస్తున్నారు. కాగా తమ వద్ద అందుబాటులో ఉండే కోర్సుల వివరాలు, కాల వ్యవధి, ఇతర ప్రత్యేకతలను పేర్కొంటూ నిర్వాహకులు అమీర్‌పేట ప్రాంతంలో భారీ ఎత్తున ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేస్తుంటారు. భవనంలోకి కనీసం గాలి కూడా చొరబడకుండా వీటిని పెడుతున్నారు. భవనాలపైనా, కిటికీలు, తలుపులకు అడ్డంగా, ఫుట్‌పాత్‌లపైనా, రహదారికి ఇరుపక్కలా, ప్రహరీల కప్పేస్తూ ఏర్పాటు చేస్తున్నారు.

తొలగిస్తున్నా మళ్లీ మళ్లీ ఏర్పాటు

నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదాలకు ఆస్కారం కలిగించే రీతిన, ఎటువంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేసే ఫ్లెక్సీ బోర్డులను గతంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక దాడులు చేసి తొలగించారు. కొందరు శిక్షణా సంస్థల నిర్వాహకులకు జరిమానాలు, నోటీసులు కూడా ఇచ్చారు. ఇటువంటి దాడుల అనంతరం మళ్లీ ఫ్లెక్సీ బోర్డులు వెలుస్తూనే ఉన్నాయి. ఇందుకు జీహెచ్‌ఎంసీ శానిటేషన్ విభాగానికి చెందిన కొందరు ఎస్ఎఫ్ఏల సహకారం ఉందని సమాచారం. వాస్తవానికి ప్రచార బోర్డులు, ఫ్లెక్సీల ఏర్పాటు, అనుమతులు డీఆర్ఎఫ్ విభాగం పరిధిలోకి వస్తాయి. కొందరు ఐటీ శిక్షణా సంస్థల నిర్వాహకులను బెదిరించి, ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేసుకునేందుకు నెలనెలా మామూళ్లు వసూలు చేస్తున్నారు. పెద్ద పెద్ద బోర్డులకు నెలకు రూ.10వేలు, రోడ్డు పక్కన పెట్టే చిన్నచిన్న బోర్డులకు రూ.5 వేలు, కరపత్రాలు పంచిన వారి నుంచి మరికొంత పిండుకుంటున్నారని తెలుస్తోంది. వీరితో పాటు కొందరు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఐటీ సంస్థ నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. మొత్తంమీద ఐటీ సంస్థ ప్రచార ఆర్భాటం కొందరికి కాసుల పంట పండిస్తోంది.

మేమున్నాం..మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

సికింద్రాబాద్	:	8008573368
కంటోన్మెంట్	:	8008573361
సనత్‌నగర్	:	8008573356

మారేడుపల్లి, న్యూస్‌టుడే:

? ఈస్ట్ మారేడుపల్లి పెట్రోల్ బంక్ సమీప ప్రధాన రహదారి పక్కన వీధిదీపాలకు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నాయి. రాత్రిళ్లు వెలుతురు సరిగా ఉండటం లేదు.
– భవాని, అడ్డగుట్ట

✓ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో మాట్లాడి చెట్ల కొమ్మల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. – శ్రీకాంత్, విద్యుత్ దీపాల నియంత్రణ అధికారి

స్పందనకు వందనం

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: సిఖ్ రోడ్డులోని కిరణ్ ఎన్‌క్లేవ్‌లోని వీధులను 20 రోజులు పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్రంగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకురాగా.. 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సంబంధిత అధికారులు పరిసరాలు శుభ్రం చేయించారు.

★ న్యూబోయిన్‌పల్లి భావనాకాలనీలో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కాలనీలోని వీధి దీపాలకు మరమ్మతులు చేశారు.

పేద వ్యాపారులను ఇబ్బందులు పెట్టొద్దు: తలసాని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అమీర్‌పేట, న్యూస్‌టుడే: పేద వ్యాపారులను ఇబ్బందులు పెట్టకుండా ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ట్రాఫిక్ పోలీసు అధికారులను కోరారు. ట్రాఫిక్ పోలీసులు తమను ఇబ్బందులు పెడుతున్నారంటూ అమీర్‌పేట, మైత్రీవనం ప్రాంతాలకు చెందిన ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడు బండ్ల నిర్వాహకులు మాజీ కార్పొరేటర్ శేషుకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి మొరపెట్టుకున్నారు. స్పందించిన ఆయన పోలీసు అధికారులతో మాట్లాడారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని వ్యాపారులకు సూచించారు.

దీపావళి వేడుకలకు ఆహ్వానం

సనత్‌నగర్: ఈ నెల 31న చార్మినార్ వద్దగల భాగ్యలక్ష్మి ఆలయంలో జరిగే దీపావళి వేడుకలకు హాజరుకావాలని నిర్వాహకులు ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వానం అందజేశారు. శుక్రవారం మారేడుపల్లిలోని క్యాంపు కార్యాలయానికి హాజరైన ఆలయ ట్రస్టీ శశికళ, ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



చెక్కులు ఇస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: సీతాఫలమండి లోని ఎం.ఎల్.ఏ. కార్యాలయంలో సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 55 మందికి రూ.20 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే పద్మారావు సీతాఫల్‌మండిలోని తన కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసురి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మి, భారాస నేతలు సుంకు రాంచందర్, రామేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మూతలు.. వెతలు



సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు నెట్ ప్లానెట్ ముందు..



ఎస్సార్టీ 285 సమీపంలో..



కూరగాయల మార్కెట్ దారిలో..

సనత్‌నగర్, న్యూస్‌టుడే: జలమండలి, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడంతో సనత్‌నగర్‌లో మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. దెబ్బతిన్న రోడ్లను చాలా రోజులుగా పునరుద్ధరించకపోవడం, గతంలో వేసిన రోడ్ల మధ్య మ్యాన్‌హోల్ మూతలను రోడ్డుకు సమాంతరంగా సరిచేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తక్షణం మ్యాన్‌హోళ్ల మూతలను సరిచేయాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు.

వాంబే గృహాలను పరిశీలించిన అధికారులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ రెండోవార్డు కృష్ణానగర్ బస్తీలో శిథిలావస్థకు చేరిన వాంబే గృహాలపై ఈ నెల 18న 'వామ్మో వాంబే' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం హౌసింగ్, రెవెన్యూ అధికారులు బస్తీలో పర్యటించారు. ఎక్కడెక్కడ నిర్మాణాలు దెబ్బతిన్నాయో నివేదిక రూపొందించే ప్రక్రియను ప్రారంభించారు. నివాసాల మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శ్రీ గణేష్‌తో పాటు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చెత్త తరలింపు — స్పందనకు వందనం

అడ్డగుట్ట, న్యూస్‌టుడే: అడ్డగుట్ట చౌరస్తా నుంచి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే దారి పక్కన చెత్తకుప్పలు పేరుకుపోయాయి. ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'ముక్కు మూసుకోవాల్సిందే' శీర్షికతో ఈ నెల 18న ఈనాడులో ప్రచురించిన చిత్ర కథనానికి జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించారు. డీఈ వెంకటేష్ ఆదేశాలతో చెత్తకుప్పలు తొలగించారు.

స్టార్టప్ కంపెనీల ప్రోత్సాహంలో ఇంక్యుబేటర్స్ పాత్ర కీలకం



కార్యక్రమానికి హాజరైన అతిథులు

లాలాపేట, న్యూస్‌టుడే: స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలో ఇంక్యుబేటర్స్ పాత్ర కీలకమని సమాచార సాంకేతిక ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో శుక్రవారం ఇండియన్ సైన్స్, టెక్నాలజీ ఎంట్రప్రెన్యూర్స్ పార్క్స్, బిజినెస్ ఇంక్యుబేటర్స్ అసోసియేషన్ సదస్సు-2024 (ఇస్బాకాన్)కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 2030 ప్రణాళికలో స్టార్టప్ కంపెనీల వ్యవస్థాపకతపై ప్రభుత్వ విధానాలను వివరించారు. ఐఎస్‌బీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.సురేష్‌కుమార్ మాట్లాడుతూ అంకుర సంస్థలు వ్యాపారం ఎలా చేయాలనే దానిపై సరైన అవగాహన కల్పించడంలో ఇంక్యుబేటర్లు తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో సీసీఎంబీ డైరెక్టర్ డా.వినయ్ కే నందుకూరి, ఏఐసీ సీఈఓ మధుసూదనరావు పాల్గొన్నారు.

'పేదలకు విద్యను దూరం చేస్తున్న సీఎం'



సంజయ్‌కుమార్‌ను అరెస్టు చేస్తున్న ఓయూ పోలీసులు

లాలాపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల విద్యను దూరం చేస్తున్నారని బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ విమర్శించారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఓయూ పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. ఫెడరేషన్ నాయకులు చెరల వంశీనేత, రేవెల్లి అజయ్, పంజల రేవంత్‌గౌడ్, అనిల్‌యాదవ్, రాజు, దేవునూరి సంపత్ తదితరులను అరెస్టు చేశారు.

వీసీ నియామకంపై హర్షం

లాలాపేట: ఓయూ ఉపకులపతిగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్.ఎం.కుమార్‌ను నియమించడంపై మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. పరిపాలన అనుభవం, సీనియారిటీ, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు అకడమిక్‌పరంగానూ అన్ని అర్హతలు ఉన్న ప్రొఫెసర్‌ను ఎంపిక చేశారని ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ అన్నారు.

రెచ్చగొట్టే మాటలు పట్టించుకోవద్దు

అమీర్‌పేట: మతవికృత రాజకీయాల నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రజలకు రక్షణ కల్పిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డా.కోట నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఓ ఆలయంలో జరిగిన ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారని, భాజపా, ఇతర అనుబంధ సంస్థలు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో రెచ్చగొట్టే వారి మాటలను పట్టించుకోవద్దని కోరారు.

పనులు పూర్తి చేయాలని వినతి

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్‌లో అభివృద్ధి పనులను త్వరగా పూరి చేయాలని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శుక్రవారం జలమండలి కార్యాలయంలో జీఎం వినోద్‌కుమార్‌ను వినతిపత్రం అందించారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ముత్యాలమ్మకు సామూహిక సాక సమర్పణ



సాకతో బయలుదేరిన జోగిని శ్యామల, కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

రెజిమెంటల్‌బజార్: ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం వేదపండితుల సూచన మేరకు అమ్మవారికి సామూహిక సాక సమర్పించారు. జోగిని శ్యామలతో పాటు మహిళలు పెద్దసంఖ్యలో సాక పోశారు. ఆలయం వద్ద పోలీసులు భద్రత చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, భాజపా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సరికారెడ్డి, కార్పొరేటర్ కొంతం దీపిక, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

బోధనా రుసుము బకాయిలు విడుదల చేయాలంటూ ధర్నా



ఎస్సార్‌నగర్ కూడలిలో ధర్నా చేస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

అమీర్‌పేట: బోధనా రుసుము బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్సార్‌నగర్ చౌరస్తాలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఏబీవీపీ కూకట్‌పల్లి, సికింద్రాబాద్ విభాగాలకు చెందిన నాయకులు, విద్యార్థులు ఉమేష్‌చంద్ర విగ్రహం కూడలిలో బైఠాయించారు. అంతకుముందు రాస్తారోకో చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత తలెత్తింది. ఏబీవీపీ నాయకులు శ్రీనాథ్, బాలు తదితరులను అరెస్టు చేసి ఎస్సార్‌నగర్ ఠాణాకు తరలించారు.

క్రీడలు దేశ ప్రగతికి సోపానాలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సంజీవరెడ్డి, భరత్ తదితరులు

మారేడుపల్లి: క్రీడలు దేశ ప్రగతికి సోపానాలని, విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని ఆర్టీసీ మాజీ ఛైర్మన్ కొత్త సంజీవరెడ్డి తెలిపారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకొని వెస్ట్ మారేడుపల్లి తపాలా శాఖ కార్యాలయం సమీపంలోని మైదానంలో రెండ్రోజులుగా జరుగుతున్న సాగర్ బబ్లు సాయి రంజిత్ క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. విజేతగా స్టార్స్ ఓయూ జట్టు, రెండో స్థానంలో గాంధీనగర్‌కు చెందిన సాయి జట్టు నిలిచింది. విజేతలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గజ్వేల్ భరత్‌తో సంజీవరెడ్డి ట్రోఫీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో విశాల్, సాగర్, సాయి, రాహుల్, రంజిత్ పాల్గొన్నారు.

వయోధికులకు సన్మానం



వయోధికులతో నిర్వాహకులు, బ్యాంకు అధికారులు

సనత్‌నగర్: వయోధికుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం సుందర్‌నగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 80 ఏళ్లు నిండిన వారిని సత్కరించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన 9 మంది వయోధికులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె.నజీర్ అహ్మద్, యు.పూర్ణచందర్‌రావు, యూబీఐ రీజనల్ డిప్యూటీ హెడ్ బాలకృష్ణ, సుందర్‌నగర్ బ్రాంచి హెడ్ ఎ.సునీతకుమారి హాజరయ్యారు.

అనుమానితులుంటే సమాచారం ఇవ్వాలి: డీసీపీ



మాట్లాడుతున్న డీసీపీ విజయ్‌కుమార్

అమీర్‌పేట, న్యూస్‌టుడే: లాడ్జీలు, హోటళ్లలో బస చేసే అనుమానితుల పట్ల నిర్వాహకులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం అమీర్‌పేటలోని వివేకానంద కమ్యూనిటీహాల్‌లో ఎస్సార్‌నగర్, బోరబండ పోలీసుస్టేషన్ల పరిధిలోని ఓయో హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ లాడ్జీల్లో బస చేసేవారి పూర్తి వివరాలను, గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. అనుమానితుల వివరాలను తక్షణం పోలీసులకు చేరవేయాలన్నారు. అన్ని కోణాల్లో దృశ్యాలను చిత్రీకరించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సార్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్లు శ్రీనాథ్‌రెడ్డి, వీరశేఖర్, ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లాలాపేట, న్యూస్‌టుడే: లాలాపేటలోని కమాన్ వీధిలో రూ.కోటి వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు నేతికార్ బ్రహ్మాజీ పలువురు పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. రహదారి నిర్మాణానికి కృషి చేసిన సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సభ్యత్వ నమోదుకు స్పందన




సికింద్రాబాద్: భాజపా సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావిలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

సత్కారం

లాలాపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా నియామకమైన బాలకృష్ణారెడ్డి, ఇటికలా పురుషోత్తంను శుక్రవారం ఓయూ విద్యార్థి నాయకులు నోముల శేషు, కొమ్మనబోయిన సైదులు యాదవ్, వల్లమళ్ల సూర్యప్రకాష్ తదితరులు సత్కరించారు.

రైల్లో వస్తున్న సైనికుడి అదృశ్యం



సతీష్‌కుమార్

రెజిమెంటల్‌బజార్: రైల్లో సికింద్రాబాద్‌కు బయలుదేరి వస్తున్న ఓ సైనికుడు అదృశ్యం అయ్యాడు. సికింద్రాబాద్ జీఆర్పీ ఎస్సై రమేష్ కథనం ప్రకారం... ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లాకు మీర్పూర్, ఉస్మా గ్రామానికి చెందిన సతీష్‌కుమార్(35) తిరుమలగిరి మిలటరీలో సైనాకుగాటీ ఏ బెటాలియన్‌లో పనిచేస్తున్నారు. ఇతను అనారోగ్యంతో బాధపడుతుండటంతో సికింద్రాబాద్ మిలటరీ ఆసుపత్రిలో చేర్చారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పుణేలోని మిలటరీ ఆసుపత్రికి తరలించారు. ఈ నెల 5న డిశ్చార్జి అయ్యారు. అతడిని తీసుకొచ్చేందుకు సైనికుడు ధర్మరాజ్‌సింగ్‌ను అక్కడికి పంపించారు. ఈ నెల 6న ఇద్దరూ దురంతో రైల్లో సికింద్రాబాద్ బయలుదేరారు. రైలు బేగంపేట స్టేషన్‌కు చేరుకున్నాక సతీష్‌కుమార్ వాష్‌రూమ్‌కు వెళ్లి కనిపించకుండా పోయారు. ఆచూకీ కోసం ప్రయత్నించినా దొరకలేదు. ఈ నెల 12న సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

ఓయూ విశ్రాంత ఆచార్యుడి మృతి

లాలాపేట, న్యూస్‌టుడే: ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం విశ్రాంత ఆచార్యుడు వడ్డేపల్లి సత్యనారాయణ (60) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. గజ్వేల్‌లోని ఒక ప్రైవేటు యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ నియామకాల కోసం జరిగిన ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఉదయం 12.30 గంటలకు గుండెపోటు రావడంతో కుప్పకూలారు. ఆయనకు భార్య ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు. జులైలో ఉద్యోగ విరమణ చేసిన ఆయన నాచారంలో ఉంటున్నారు. ఈ సందర్భంగా పలువురు సంతాపం తెలిపారు.

మారియట్‌లో ఆకృతి ఎలైట్ ప్రదర్శన

సికింద్రాబాద్: దీపావళి పండగను పురస్కరించుకొని మారియట్ హోటల్‌లో శుక్రవారం ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో జువెలరీ, వస్త్ర ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో సంప్రదాయ దుస్తులు, ఆభరణాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. నిర్వాహకురాలు శశినెహతా మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (శుక్రవారం నాటివి..కిలో రూ.లో) టమాటా 43, వంగ 35, బెండ 45, పచ్చిమిర్చి 40, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 25, క్యారెట్ 40, దొండ 28, ఆలు 37, ఉల్లి 39, సొర 17, పొట్ల 23, బీన్స్ 125, గోరుచిక్కుడు 35, చిక్కుడు 65, దోస 35, బీర 45, కాకర 35, చామగడ్డ 45, కీర 45, క్యాప్సికం 75, బీట్‌రూట్ 28, కందగడ్డ 50, చిలకడదుంప 35, మామిడి 105, మునగ 75, ముల్లంగి 6(ఒకటి).

రామకృష్ణాపురంలో..
డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: టమాటా కిలో రూ.43, వంగ 35, బెండ 55, పచ్చిమిర్చి 40, కాకర 35, బీర 45, క్యాబేజీ 21, బీన్స్ 125, క్యారెట్ 53, దొండ 35, చిక్కుడు 65, క్యాప్సికం 70, ఆలు 37, కీర 23, దోస 35, చామగడ్డ 40, అరటి 9, బీట్‌రూట్ 32, సొర 17, గోకర 40, చిలకడదుంప 36, మామిడి 105, మునగ 77.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

డిఫెన్స్‌కాలనీ: నేరేడ్‌మెట్ డివిజన్‌కు చెందిన ఇద్దరు అనారోగ్యంతో బాధపడుతూ సహాయం నిమిత్తం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రాజ్‌కిరణ్‌కు రూ.28,500, విఘ్నేష్‌గౌడ్‌కు రూ.60 వేలు మంజూరు చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి చెక్కు రూపంలో బాధితులకు అందజేశారు. భారాస నాయకులు నంది కంటి శ్రీధర్, అంజయ్య తదితరులు ఉన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

పింఛనర్ల అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న సాయిలత

గౌతంనగర్, న్యూస్‌టుడే: పింఛనర్ల సమస్యల పరిష్కారానికి ఎస్‌బీఐ ప్రత్యేక చొరవ చూపుతోందని వెస్ట్‌మల్కాజిగిరి శాఖ మేనేజర్ సాయిలత అన్నారు. శుక్రవారం సాయంత్రం కార్యాలయంలో నిర్వహించిన పింఛనర్ల అవగాహన సదస్సులో ఆమె మట్లాడారు. 60 నుంచి 79 ఏళ్ల లోపు పింఛనర్లు తమ జీవన ధ్రువీకరణ పత్రాలను నవంబరు 30లోగా సమర్పించాలన్నారు.

కాశీవిశాలాక్షికి ప్రత్యేక పూజలు



మల్కాజిగిరి, న్యూస్‌టుడే: తూర్పు ఆనంద్‌బాగ్‌లోని కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి భక్తులు పెద్దఎత్తున పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

జలమండలి ప్రణాళిక.. పకడ్బందీగా సాగాలిక


అల్వాల్‌లో అవగాహన ర్యాలీ

అల్వాల్, న్యూస్‌టుడే: బస్తీలు, కాలనీలు అన్న తేడా లేకుండా అల్వాల్‌లో మురుగుతో ప్రజలు సతమతం అవుతున్నారు. కొన్ని ప్రధాన రహదారుల్లో మురుగు వరదల పారుతూ ఇబ్బంది పెడుతోంది. ఇళ్ల ముందు నిత్యం పారే మురుగుతో పాటు.. రోడ్లపై నిల్వ ఉండే మురుగుకు సంబంధించి నిత్యం ఫిర్యాదులు వస్తూనే ఉంటున్నాయి. యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకుంటున్నా..తిరిగి రెండు రోజుల్లోనే సమస్య పునరావృతమవుతోంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని జలమండలి ఆధ్వర్యంలో చేపడుతున్న 90 రోజుల ప్రణాళికతో సత్ఫలితాలు ప్రారంభమయ్యాయి.

ఇదీ పరిస్థితి.. డివిజన్ పరిధిలో అల్వాల్, వెంకటాపురం, మచ్చబొల్లారం, పాదర్‌బాలయ్యనగర్ సర్కిళ్లు ఉన్నాయి. ఒక్కో సర్కిల్ పరిధిలో నిత్యం మురుగుపై 15 నుంచి 20 వరకు ఫిర్యాదులు వస్తున్నాయి. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తున్నారు. మళ్లీ రెండ్రోజుల్లోనే అదే సమస్య ఎదురవుతోంది. డివిజన్‌కు ఒక్కో ఎయిర్‌టెక్ యంత్రం, మరో రెండు అత్యవసర యంత్రాలు ఉన్నా ఫలితం ఉండటం లేదు. ఈ నేపథ్యంలో జలమండలి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

మురుగు సమస్య.. ఇంకుడు గుంతలపై ప్రధానంగా దృష్టి

జల సంరక్షణ వట్టి మాట.. ఐదు సంవత్సరాల నుంచి ఇంకుడు గుంతల నిర్వహణ మరచిపోయారు. ఇంకుడు గుంత ఉంటేనే నల్లా కనెక్షన్ ఇవ్వాలన్న నిబంధనను పట్టించుకోవడం లేదు. దీంతో చాలా మంది గుంతల నిర్మాణానికి తిలోదకాలిచ్చారు. ఇటువంటి అపార్టుమెంటుల్లో వేసవిలో నీటి సమస్య ఉత్పన్నమవుతుంది.

అమలు ఇలా.. 90 రోజుల ప్రణాళికలో భాగంగా సర్కిల్ వారీగా ప్రతి రోజూ మూడు గంటల పాటు ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఆ తర్వాత 3 గంటలు మురుగు పరిష్కారానికి, నీటి గుంతల ఏర్పాటుకు అవగాహన, తాఖీదులు ఇవ్వడం జరుగుతోంది. 300 గజాలకు పైన ఉన్న భవనంలో తప్పనిసరిగా ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో తాఖీదు ఇస్తున్నారు. గడిచిన 20 రోజులుగా చేపట్టిన 90 రోజుల ప్రణాళికతో మురుగు పరిష్కారం, ఇంకుడు గుంతల నిర్మాణం ముమ్మరంగా సాగుతోంది. నెలలుగా పరిష్కారం కాని సమస్యలు 90 రోజుల ప్రణాళికతో కొలిక్కి వస్తున్నాయని జలమండలి సెక్షన్ మేనేజర్ రమేశ్ తెలిపారు.


పూడిక తీస్తున్న సిబ్బంది

అక్టోబరు 17నాటికి అమలైన ప్రణాళిక

మురుగు కాలువల్లో పూడిక తీత:	11,394 మీటర్లు
పూడిక తీసిన మ్యాన్‌హోళ్లు:	1,078
మొత్తం శాతం:	20
తనిఖీ చేసిన భవనాలు:	140
తాఖీదులిచ్చిన భవనాలు:	80

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

గౌతంనగర్, డిఫెన్స్ కాలనీ, అల్వాల్, న్యూస్‌టుడే:

? గౌతంనగర్ డివిజన్ జయగిరి లక్ష్మీ నర్సింహస్వామినగర్‌లో విద్యుత్తు దీపాలు పగలు సైతం వెలుగుతూనే ఉన్నాయి. ఎంతో విద్యుత్తు వృథా అవుతోంది. – పరమేష్, జేఎల్ఎన్ఎస్‌నగర్

✓ టైమర్లతో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. క్షేత్ర స్థాయిలో పరిశీలించి మరమ్మతులు నిర్వహిస్తాం. – వెంకటేష్, ఏఈ, వీధి దీపాల నిర్వహణ

? నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి హరిజనబస్తీ- బాలాజీ కాలనీకి వెళ్లే ప్రధాన మార్గంలో రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోయింది. అపరిశుభ్రతతో ఇబ్బందులు పడుతున్నాం. –నారాయణ, హరిజనబస్తీ

✓ పరిశీలించి చెత్తాచెదారాన్ని డంపింగ్‌యార్డుకు తరలిస్తాం. –నాగరాజు, పారిశుద్ధ్య అధికారి

? సర్వేసన్‌గుట్ట సమీపంలోని ఈద్గా ఎదురుగా రహదారి చెంతనున్న విద్యుత్తు నియంత్రిక చుట్టూ నిర్మించిన ప్రహరీ కూలిపోయింది. దీనివల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది. – నారాయణరెడ్డి, స్థానికుడు

✓ పరిశీలించి కొత్తగా ప్రహరీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటా. – రామాచారి, ఏడీఈ

ఆరోగ్య సంరక్షణకు ధరలు అందుబాటులో ఉండాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


జ్యోతి వెలిగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వైద్యులు ద్వారకానాథ్‌రెడ్డి, ఎన్.వెంకట్‌రెడ్డి, డీఎస్.దీనదయాళ్ తదితరులు

శామీర్‌పేట: నాణ్యమైన ఆరోగ్య సంరక్షణకు బాధ్యత వహిస్తునే.. అందరికీ అందుబాటులోకి వివిధ సేవల ధరలను తగ్గించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలం తూంకుంట పుర పాలికలో ది అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా సౌత్‌జోన్ (ఏఓఐఎస్‌జెడ్) ఆధ్వర్యంలో ఈఎన్‌టీలో అధునాతన పురోగతులపై మూడు రోజుల పాటు చర్చించే సౌత్ జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా వచ్చి, జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. . ఈకాన్ఫరెన్స్ విద్యాపరమైన ప్రయత్నం కాదు.. అత్యున్నత విజ్ఞాన వేదుకగా అభివర్ణించారు. హైదరాబాద్ వైద్య కేంద్రంగా మారి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ది అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా సౌత్‌జోన్ ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ డీఎస్.దీనదయాళ్ మాట్లాడుతూ..ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని, ఏఐతో ఆరోగ్య సంరక్షణ విప్లవాత్మకంగా మార్చబోతున్నట్లు వివరించారు.

దేవాలయ కమిటీల ప్రమాణ స్వీకారం


లలితా పరమేశ్వరి దేవాలయ కమిటీ సభ్యులు


జ్ఞాన సరస్వతి ఆలయ కమిటీ సభ్యులు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: మల్కాజిగిరి డివిజన్ ఆనంద్‌బాగ్‌లోని లలితా పరమేశ్వరి దేవాలయ నూతన కమిటీ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ ఛైర్మన్‌గా దాసరి లింగేశ్వరరావు, సభ్యులుగా శారద, శ్యామల, సాయినాథ్, ఏడుకొండలు, రాజేశ్, రాగం రాజుయాదవ్‌లతో దేవాలయ అధికారి మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో నేతలు జీఎన్వీ సతీష్‌కుమార్, సంపత్‌గౌడ్, కొండాగౌడ్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతీ దేవాలయంలో.. తూర్పుఆనంద్‌బాగ్ డివిజన్ అనంత సరస్వతీనగర్ కాలనీలోని జ్ఞాన సరస్వతి దేవాలయం పాలక మండలి ఛైర్మన్‌గా కోకల హరీశ్, సభ్యులుగా రామచంద్రాచారి, గోపీనాథ్, బాలస్వామి, మంగమ్మ, బుచ్చిబాబు, శ్రీకాంత్‌లతో ఆలయ అధికారి మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ నేతలు ఉమేశ్‌సింగ్, వెంకటేశ్‌యాదవ్, శ్రీనివాస్, బాబు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయ స్థలాన్ని కాపాడుతాం

అల్వాల్, న్యూస్‌టుడే: ఒకప్పటి మచ్చబొల్లారం వార్డు కార్యాలయం స్థలాన్ని ప్రజాప్రయోజనాలకు ఉపయోగించేలా యోచిస్తున్నట్లు కార్పొరేటర్ జితేంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం శిథిలమైన వార్డు కార్యాలయ స్థలాన్ని డీసీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సందర్శించారు. శిథిల భవనాన్ని కూల్చి కొత్త భవనం నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ స్థలాల కొరతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఉపయోగపడేలా కార్యాలయాలు, ఇతర సేవలకు ఉపయోగపడేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. స్థానిక నేతలు సురేందర్‌రెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.


శిథిలావస్థలో ఉన్న వార్డు కార్యాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ జితేంద్రనాథ్, శ్రీనివాస్‌రెడ్డి

కుప్పగా వ్యర్థాలు.. తొలగించాలని విన్నపాలు

అల్వాల్, న్యూస్‌టుడే: మచ్చబొల్లారంలోని సర్వేసన్‌గుట్ట శ్మశాన వాటికను స్థానికులే శుభ్రం చేసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ఆరు నెలలుగా వ్యర్థాలను తొలగించడం లేదు. దీపావళి వేడుకలు సమీపిస్తుండటంతో స్థానికులు స్పందించి వాటికలోని వ్యర్థాలు, పొదలు తొలగించారు. వాటిని కుప్పగా పోశారు. కనీసం పోగుపెట్టిన వ్యర్థాలనైనా ప్రభుత్వ యంత్రాంగం తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు



మల్కాజిగిరి, న్యూస్‌టుడే: ఆనంద్‌బాగ్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని అనంత సరస్వతీ నగర్, బాలసరస్వతీనగర్ విద్యుత్తు ఫీడర్ల పరిధిలో శనివారం మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కల్యాణ్‌నగర్, ఎన్ఎండీసీ కాలనీ, తూర్పుఆనంద్‌బాగ్, తాళ్లబస్తీ పరిధిలో సరఫరా ఉండదు. బాల సరస్వతీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు రాజీవ్‌గాంధీనగర్, విష్ణుపురి ఎక్స్‌టెన్షన్ కాలనీ, విమలాదేవి నగర్, శివపురి ప్రాంతాలలో సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరావు తెలిపారు. ● గీతాభవాని ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పాత మల్కాజిగిరి, వెంకటేశ్వరనగర్, బాల సరస్వతీనగర్, దుర్గానగర్, హైదర్‌నగర్‌లలో సరఫరా ఉండదు. ● గణేశ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వసంతపురికాలనీ, వెంకటేశ్వరనగర్, ప్రశాంత్‌నగర్, చింతల్ బస్తీ ప్రాంతాలలో సరఫరా ఉండదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

అల్లుకుంటున్న తీగ.. పెరిగితే ముప్పు

గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లోని విద్యుత్తు నియంత్రిక వద్ద మొక్కలు పెరిగి నియంత్రికకు అల్లుకుంటున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన కేబుల్ వైర్లు చేతికందే ఎత్తులో ఉండటంతో పాటు తీగలు అల్లుకోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు మొక్కలను తొలగించి రక్షణగా కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.
–న్యూస్‌టుడే, గౌతంనగర్



భూగర్భ డ్రైనేజీ లీకేజీకి పరిష్కారం


మరమ్మతులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లో కాలనీవాసులు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యను కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పరిష్కరించారు. కొన్ని రోజులుగా భూగర్భ డ్రైనేజీ నుంచి మురుగు పొంగి కాలనీ వీధులు అస్తవ్యస్తంగా మారాయి. కాలనీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె గురువారం సంబంధిత జలమండలి సిబ్బందితో కాలనీలో పర్యటించారు. సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. జలమండలి ఏఈ కృష్ణ ప్రసాద్, కాలనీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ఓం ప్రకాష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను భాగస్వాములు చేయండి


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్, తదితరులు

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబురాల్లో విద్యార్థులను భాగస్వాములు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో చెకుముకి సంబురాల గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సమాజంలో శాస్త్ర ప్రచారం, శాస్త్ర దృక్పథం పెంపొందించడంలో జన విజ్ఞాన వేదిక కృషి అభినందనీయమని ప్రశంసించారు. విద్యార్థుల్లో బాల్యదశ నుంచే మూఢనమ్మకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాధికారిణి ఐ.విజయకుమారి, జనవిజ్ఞాన వేదిక పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య బీఎన్.రెడ్డి, ఎం.శ్రీనివాస్, జెన్నీ, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'పింఛనుదారుల హామీలు విస్మరిస్తున్న ప్రభుత్వం'

అల్వాల్: ఎన్నికల సమయంలో పింఛన్‌దారులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం(టైటా) పేర్కొంది. శుక్రవారం అల్వాల్‌లో జరిగిన సంఘం సదస్సులో అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడారు. వృద్ధులైన పింఛన్‌దారులకు ఈహెచ్ఎస్ ద్వారా వైద్య సదుపాయం అందకపోగా.. రీయింబర్స్‌మెంట్ సైతం సకాలంలో అందడం లేదన్నారు. మార్చి 2024 నుంచి పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగుల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధాన కార్యదర్శి పెద్దిరమేష్, శివానందం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సభ్యత్వ నమోదులో ముందుండాలి

మౌలాలి, న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదులో నియోజకవర్గంలోనే మౌలాలి డివిజన్ ప్రథమ స్థానంలో ఉండాలని కార్పొరేటర్ గున్నాల సునీత అన్నారు. డివిజన్‌లోని సంతోషిమానగర్ కాలనీలో శుక్రవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ ఈటల రాజేందర్ పంపిన సందేశాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలకు చరవాణి ద్వారా వినిపించారు. కులమతాలకు అతీతంగా పార్టీ సభ్యత్వాలు నమోదు చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

గుండెపోటుతో విశ్రాంత న్యాయమూర్తి మృతి

నాచారం: నాచారం రవీంద్రనగర్ కాలనీలో ఉంటున్న విశ్రాంత న్యాయమూర్తి తోట అశోక్‌కుమార్(75) గుండెపోటుతో మృతిచెందారు. సెషన్స్ జడ్జిగా పదవీ విరమణ పొందారు. శుక్రవారం లాలాపేటలోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

'విలీన సభ'ను విజయవంతం చేయండి

నల్లకుంట: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ)లో భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్టీయూ) విలీన సభను విజయవంతం చేయాలని ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం పిలుపునిచ్చారు. సభ ఈ నెల 20న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగనుందని ఎర్కొన్నారు.

కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం సుందరయ్య కళానిలయంలో కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) 67వ వార్షికోత్సవ సభ జరిగింది. తాడి, ఈత వనాల పెంపునకు సైతం చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

మాజీ ముఖ్యమంత్రి అంజయ్య సేవలు చిరస్మరణీయం

ముషీరాబాద్: మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య ఉమ్మడి రాష్ట్రానికి అందించిన సేవలు ఎనలేనివని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా లుంబిని పార్కు సమీపంలో ఉన్న విగ్రహం వద్ద పలువురు నివాళులర్పించారు. అంజయ్య సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

యూజీసీ వేతనాలు అమలు చేయాలని వినతి

బషీర్‌బాగ్: ఒప్పంద అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్స్ అమలు చేయాలని ఒప్పంద అధ్యాపకుల సంఘం నేతలు రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని ఎస్‌సీఈఆర్‌టీ భవన్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.

ప్రజావాణితో పట్టాదారు పాస్ పుస్తకం వచ్చింది

సోమాజిగూడ , న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంతో అనేక సమస్యలు పరిష్కారం అవుతున్నాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.జి.చిన్నారెడ్డి పేర్కొన్నారు. అనేక పర్యాయాలు అధికారుల చుట్టూ తిరిగి, చివరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారమైందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, ఘట్‌కేసర్ మండలం. ఏదులాబాద్ గ్రామానికి చెందిన రుక్మిణి శుక్రవారం ప్రజాభవన్‌కు వచ్చి సంతోషం వ్యక్తం చేశారు. ధరణి తప్పిదాల వల్ల తన 16 గుంటల భూమికి పట్టా ఇవ్వలేదని, మూడేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ప్రజావాణిలో దరఖాస్తు చేయగా, మూడునెలల్లోనే పట్టాదారు పాసు పుస్తకం వచ్చిందని తెలిపారు.


పట్టాదారు పాస్ పుస్తకాన్ని చూపుతున్న రుక్మిణి, చిత్రంలో దివ్య దేవరాజన్, డా.చిన్నారెడ్డి తదితరులు

627 అర్జీలు: ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి శుక్రవారం 627 అర్జీలు అందాయి. అధికంగా ఇళ్ల కోసం 185 రాగా, సాంఘిక సంక్షేమ శాఖ-108, రెవెన్యూ-60, విద్యుత్-57, ఎన్ఆర్ఐ విభాగం-4, ఇతర శాఖలకు 213 వచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటిని పరిష్కరించాలని చిన్నారెడ్డితో పాటు నోడల్ అధికారి దివ్య అధికారులకు సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతనాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. విద్యారంగ సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే సమీక్ష నిర్వహించి, పరిష్కరించాలని కోరింది. శుక్రవారం సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ వై.జంక్షన్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉన్నా దృష్టిని సారించకపోవడం బాధాకరమన్నారు. మూడు సంవత్సరాలుగా బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తమ కోర్సులు పూర్తి అయినా ధ్రువపత్రాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యార నరేష్, క్రాంతి, చైతన్య యాదవ్ ఉన్నారు.

ఉప ప్రణాళిక నిధుల దుర్వినియోగంపై కమిషన్ వేయండి

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు రూ.2 లక్షల కోట్ల దుర్వినియోగంపై హైకోర్టు న్యాయమూర్తి చేత విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేర్లతో మాట్లాడారు. 2014 నుంచి 2024 అక్టోబరు వరకు నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు.

కేక పుట్టించిన కూత



కబడ్డీ కబడ్డీ అంటూ స్టార్ ఆటగాళ్లు పాయింట్ల కూత పెడుతుంటే.. ప్రత్యర్థి రైడర్లను డిఫెండర్లు పట్టేస్తుంటే.. తెలుగు అభిమానులు కేరింతలు కొట్టారు. శుక్రవారం గచ్చిబౌలి స్టేడియంలో ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్ ఆరంభమైంది. ఈ కబడ్డీ మ్యాచ్‌లు అభిమానులను అలరించాయి. తొలి మ్యాచ్‌లో సొంతగడ్డపై తెలుగు టైటాన్స్ చెలరేగి బెంగళూరు బుల్స్‌ను మట్టికరిపించింది. మరో మ్యాచ్‌లో యు ముంబాపై దబంగ్ దిల్లీ గెలిచింది. బాలీవుడు నటీనటులు విద్యాబాలన్, కార్తీక్ ఆర్యన్ ముఖ్య అతిథులుగా సందడి చేశారు.


స్టేడియంలో సందడి చేస్తున్న విద్యాబాలన్, కార్తీక్‌ఆర్యన్

నవంబరులో తెలంగాణ ఉద్యమకారుల సదస్సు

అల్వాల్, న్యూస్‌టుడే: నవంబరులో మల్కాజిగిరిలో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అల్వాల్‌లో ఫోరం ప్రతినిధుల సమావేశం జరిగింది. సదస్సు ఏర్పాట్లు, కార్యాచరణపై చర్చించారు. ఫోరం మల్కాజిగిరి అధ్యక్షుడు కృష్ణ, శోభన్‌బాబు, దయాకర్‌గౌడ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఒకే కులస్థులుగా పరిగణించాలి

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కమ్మరి, వడ్రంగి, కంచరం, శిలాశిల్పి, స్వర్ణకార వృత్తులు చేస్తున్న వారందరినీ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలుగా పరిగణించాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, అధ్యక్షుడు వేములవాడ మదన్మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారిలు మాట్లాడారు.

సోదరి ఇంటికి వెళ్లిన తల్లీ కుమారుడి అదృశ్యం

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: సోదరి ఇంటికి వెళ్లిన తల్లి, కుమారుడు అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ ఠాణా పరిధిలో జరిగింది. సీఐ సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..అల్వాల్ బీహెచ్ఈఎల్ కాలనీలో ఉంటున్న మహిళ(28) గృహిణి. ఆమె ఈ నెల 16న తన కుమారుడు (6)ను తీసుకొని నేరేడ్‌మెట్ చంద్రగిరి కాలనీలో ఉంటున్న సోదరి ఇంటికి వెళ్లింది. 17వ తేదీ ఉదయం తిరిగి అల్వాల్‌కు బయలుదేరింది. కానీ ఇంటికి చేరుకోలేదు. భర్త అన్నిచోట్లా వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో యువకుడు..

ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. సీఐ సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. నేరేడ్‌మెట్‌లో ఉంటున్న దేవకుమార్ (22) టెంట్‌హౌస్‌లో పని చేస్తుంటాడు. ఈ నెల 17న రాత్రి 11 గంటలకు టీ తాగడానికి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుమార్తెను వ్యభిచారం చేయాలని ఒత్తిడి చేసిన మహిళ అరెస్టు

అల్వాల్, న్యూస్‌టుడే: కుమార్తెను వ్యభిచార కూపంలోకి దించే యత్నం చేసిన మహిళ(37)ను అల్వాల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. జేజేనగర్‌కు చెందిన నిందితురాలు ఇప్పటికే తన పెద్ద కుమార్తెను వ్యభిచారంలోకి దించింది. 14ఏళ్ల రెండో కుమార్తెను సైతం వ్యభిచారం చేయమని ఒత్తిడి చేస్తుండటంతో బాలిక తన తల్లిపై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. నిందితురాలు పోలీసులపై కూడా దురుసుగా ప్రవర్తించడంతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

నేలకూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం


క్రేన్ సాయంతో చెట్టుకొమ్మలను తొలగిస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

గాంధీనగర్: గాంధీనగర్ డివిజన్ వాల్మీకీనగర్ బస్తీ సమీపంలోని ఉదయ్‌సూర్య అపార్ట్‌మెంట్స్ వద్ద శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా చెట్టు నేలకూలింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం స్థానిక కార్పొరేటర్ పావని వినయ్, భాజపా సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకొని డీఆర్‌ఎఫ్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు వెంటనే అక్కడికి వచ్చి రోడ్డుపై పడిన చెట్టుకొమ్మలను క్రేన్ సాయంతో తొలగించి వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. నేతలు ఉమేష్, నర్సింహ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట

మాజీ ముఖ్యమంత్రి అంజయ్య సేవలు చిరస్మరణీయం

ముషీరాబాద్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య ఉమ్మడి రాష్ట్రానికి అందించిన సేవలు ఎనలేనివని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా లుంబినీ పార్కు సమీపంలో ఉన్న విగ్రహం వద్దకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ.. అంజయ్య సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు నల్లవెల్లి అంజిరెడ్డి, అభిషేక్‌కెనడీ, సంగిశెట్టి జగదీశ్, జీవన్ కేశవ్, జి.గోవింద్, వెంకటేశ్, వరదరాజులు పాల్గొన్నారు.


విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

గోల్కొండ మార్కెట్‌లో కూరగాయల ధరలు

తిలక్‌నగర్, న్యూస్‌టుడే: (శుక్రవారం నాటివి. కిలోకు రూపాయల్లో) టమాట 40, ఆలుగడ్డ 40, వంకాయ 40, బెండ 60, దొండ 45, దోసకాయ 40, కాకర 60, బీర 60, సొర 25, క్యాబేజీ 35, క్యాప్సికం 60, బీన్స్ 90, చిక్కుడు 60, క్యారెట్ 45, బీట్‌రూట్ 40, ఉల్లిగడ్డ 50, పచ్చిమిర్చి 40, వెల్లుల్లి 350, అల్లం 80.

'విలీన సభ'ను విజయవంతం చేయండి

నల్లకుంట, న్యూస్‌టుడే: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ)లో భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) విలీన సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం పిలుపునిచ్చారు. ఈ నెల 20న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ జరగనుందని శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. 14 రాష్ట్రాలలో సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న టీయూసీఐలో.. ఐఎఫ్‌టీయూను విలీనం చేయాలని ఏడాదిగా చర్చలు కొనసాగించామన్నారు. ఇందుకు ఐఎఫ్‌టీయూ తెలంగాణ, ఏపీ రాష్ట్ర కమిటీలూ తీర్మానించడంతో సంబంధిత నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

సర్కారు బడులకు కొత్త గురువులు

ముషీరాబాద్, న్యూస్‌టుడే: ముషీరాబాద్ విద్యామండలం పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు కొత్తగా పలువురు ఉపాధ్యాయులు వచ్చారు. మండలం పరిధిలో మొత్తం ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా.. ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, నలుగురు లాంగ్వేజ్ పండిట్‌లతో కలిపి ఆరుగురు టీచర్లు కొత్తగా వచ్చారు. రేంజ్-1లో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహించేందుకు 9 మంది, రేంజ్-2లోని బడులకు 8 మంది చొప్పున సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్‌జీటీ) కొత్తగా నియమితులయ్యారు. దీంతో నూతనంగా వచ్చిన గురువుల సంఖ్య 23కు చేరింది. జిల్లా నియామక ఉత్తర్వులు అందుకొని అబిడ్స్‌లోని స్టాన్లీ స్కూల్లో జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియ అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయాల్లో, హైస్కూల్ టీచర్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు రిపోర్టు చేశారు. ఈ క్రమంలో ధ్రువీకరణ పత్రాలను ఎంఈవోలు స్వరూపారాణి, జయలక్ష్మీభారతిలకు అందజేశాక.. తమకు కేటాయించిన స్కూళ్లలో విధుల్లో చేరారు. తొలిరోజు గురువారమే విద్యార్థులను పరిచయం చేసుకొని పాఠాలు బోధించారు. కొత్త టీచర్లు చెప్పిన పాఠ్యాంశాలను విద్యార్థులు సైతం శ్రద్ధగా ఆలకించారు.


ముషీరాబాద్ రేంజ్-1 పాఠశాలల్లో కొత్తగా చేరిన టీచర్లతో డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి

* ముషీరాబాద్ విద్యామండలం పరిధిలోని.. ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఉర్దూ మీడియంలో సోషల్ టీచర్, హిందీ లాంగ్వేజ్ పండిట్ కలిపి ఇద్దరు కొత్తగా నియమితులయ్యారు. సీతాఫల్‌మండి ఉన్నత పాఠశాలలోనూ హిందీ లాంగ్వేజ్ పండిట్ ఒకరు, కవాడిగూడ ఉన్నత పాఠశాలలో బయాలజీ టీచరు ఒకరు, జామై ఉస్మానియా ఉన్నత పాఠశాలలో తెలుగు లాంగ్వేజ్ పండిట్ ఒకరు చొప్పున కొత్త టీచర్లుగా విధుల్లో చేరారు. జమిస్తాన్‌పూర్ రాంనగర్ ఉన్నత పాఠశాలకు కేటాయించిన హిందీ పండిట్ మాత్రం విధుల్లో చేరాల్సి ఉంది.

దూరవిద్యలో చదివి.. సర్కారు కొలువు దక్కించుకుని..



నగరానికి చెందిన వి.సంతోషిబాయి పదో తరగతి ప్రైవేట్‌లో రాసి ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ విద్యను రెగ్యులర్‌గా అభ్యసించారు. అనంతరం ఆమెకు వివాహమైంది. పెళ్లి తర్వాత కూడా ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో దూరవిద్య విధానంలో డిగ్రీ, పీజీ పూర్తి చేశారు. 2008లో హిందీ పండిట్ కోర్సు పూర్తి చేశారు. కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. భర్త ప్రోత్సాహంతో 2023లో రెగ్యులర్‌గా బీఈడీ పూర్తి చేశారు. 2024 డీఎస్సీలో 27వ ర్యాంకు సాధించి ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువును దక్కించుకున్నారు. ప్రస్తుతం ముషీరాబాద్‌లోని ప్రభుత్వోన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా చేరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ముషీరాబాద్	8008573400
రాంనగర్	8008573395
అంబర్‌పేట	8008573390
నల్లకుంట	8008573389

నల్లకుంట, న్యూస్‌టుడే:

? తిలక్‌నగర్ పరిధిలో నల్లాల ద్వారా సరఫరా అయ్యే తాగునీళ్లు లోప్రెషర్‌కు తోడు దుర్వాసనతో వస్తున్నాయి. –అనిల్, తిలక్‌నగర్

✓ నీటి ప్రెషర్‌ను పెంచేలా చర్యలు చేపడతాం. నీళ్ల నమూనాలను ఇప్పటికే సేకరించి పరిశీలించాం. ఎలాంటి ఇబ్బంది లేదు. –రోహిత్, జలమండలి మేనేజరు

మురుగు ప్రవాహానికి ఇబ్బందుల్లేకుండా చర్యలు


పనులు పర్యవేక్షిస్తున్న ఉమారాణి

కాచిగూడ, న్యూస్‌టుడే: డ్రైనేజీ పైపులైన్ల నుంచి మురుగునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు చేపట్టినట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమా రాణి తెలిపారు. సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ, భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా చేపట్టిన '90 రోజుల ప్రత్యేక కార్యాచరణ'లో భాగంగా శుక్రవారం చప్పల్‌బజార్ ఇందిరానగర్‌లో వ్యర్థాల తొలగింపు పనులను చేపట్టారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడారు. డ్రైనేజీల్లో చెత్తాచెదారం వేయవద్దని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌యాదవ్, జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ భావన, వెంకటేష్ యాదవ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

'క్వింటా పత్తి రూ.15 వేల చొప్పున కొనుగోలు చేయండి'

నల్లకుంట: రైతుల నుంచి పత్తిని క్వింటాల్‌కు రూ.15 వేల చొప్పున కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అధికారులు కొనుగోలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చెల రంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్‌లు డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాల కారణంగా పత్తి ఉత్పత్తి చాలావరకు తగ్గిందని.. తేమ శాతం 10 నుంచి 15 శాతం వరకు ఉన్నా కొనుగోలుకు నిరాకరించొద్దని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పత్తి పంటకు రూ.500 బోనస్ ఇస్తామన్న ఎన్నికల హామీని సత్వరం నెరవేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా మానసిక ప్రశాంతత సాధ్యపడుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ముషీరాబాద్ మహంకాళి ఆలయంలో 9 రోజులపాటు నిర్వహించిన పూజల సందర్భంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన ఒడి బియ్యంతో శుక్రవారం మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడుతాయని పేర్కొన్నారు. ఆలయ ఈవో మహేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు వై.చంద్రమౌళి, మాజీ ఛైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, భారాస నేతలు రెబ్బ రామారావు, గంటల రాజు, శివముదిరాజ్, వై.శ్రీనివాస్‌రావు, శ్రీకాంత్‌యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకార్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లు దశలవారీగా ఆధునికీకరిస్తాం: ఎమ్మెల్యే


పనులు ప్రారంభిస్తున్న కాలేరు వెంకటేశ్, బి.పద్మ

విద్యానగర్, న్యూస్‌టుడే: అంబర్‌పేట నియోజకవర్గం పరిధి అంతర్గత బస్తీల్లోని డ్రైనేజీ పైపులైన్లను దశలవారీగా ఆధునికీకరిస్తున్నట్టు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ సాయిబాబా సంస్థాన్ ఆలయం ముందు రోడ్డులో, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని బస్తీలో కలిపి రూ. 20 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ పైపులైన్ల పనులను కార్పొరేటర్ బి.పద్మతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ.. స్థానికుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని భారాస నేతలకు సూచించారు. డ్రైనేజీ పైపులైన్ల పనులు నాణ్యతాప్రమాణాలతో సకాలంలో పూర్తయ్యేలా జలమండలి అధికారులూ నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. జలమండలి ఏఈ మాజిద్, జీహెచ్‌ఎంసీ ఏఈ శ్వేత, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి నాయక్, భారాస నేతలు బి.వెంకట్‌రెడ్డి, చందు, రమేశ్ నాయక్, చంద్రశేఖర్‌గౌడ, నర్సింగరావు, శ్రీను, రవీందర్, సుధాకర్, సంతోష్‌రెడ్డి, సీఈ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్‌రావు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

కాచిగూడ, న్యూస్‌టుడే: రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్‌కానిస్టేబుళ్లు చిన్నానాయక్, సమ్మయ్యలు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి(35) శుక్రవారం విద్యానగర్-జామై ఉస్మానియా స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మరొకరు.. మరో ఘటనలో 45-50 ఏళ్ల మధ్య వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ఉప్పుగూడ స్టేషన్ వద్ద ఈ నెల 15వ తేదీన పట్టాలను దాటుతుండగా రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు.

ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీ

కాచిగూడ: ఎంఎంటీస్ రైలులో ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీకి గురైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. చందానగర్ హుడా కాలనీకి చెందిన మురళి బుధవారం ఫలక్‌నుమా నుంచి లింగంపల్లికి ఎంఎంటీఎస్‌లో వెళుతున్నాడు. సీతాఫల్‌మండి స్టేషన్ వద్ద అతడి ల్యాప్‌టాప్‌లో కూడిన బ్యాగు చోరీకి గురైంది. శుక్రవారం బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

నగదు చోరీపై జీరో ఎఫ్ఐఆర్

కాచిగూడ: ప్రయాణికురాలి రూ. 15 వేల నగదు బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం...ఏపీలోని విజయనగరానికి చెందిన జగదీష్ భార్య కీర్తి గురువారం విశాఖపట్నం నుంచి కాచిగూడకు విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరింది. రైలు ఖమ్మం స్టేషన్ వద్ద ఉండగా రూ. 15 వేలు ఉన్న ఆమె బ్యాగు చోరీకి గురైంది. శుక్రవారం బాధితురాలి ఫిర్యాదుతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఖమ్మం రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

కేంద్ర పథకాలపై ప్రచారం చేపట్టాలి: భాజపా


సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న కృష్ణాయాదవ్, రాంచంద్రరావు, గౌతంరావు, యశ్వంత్


ప్రేమ్‌నగర్‌లో భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నేతలు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారాన్ని చేపట్టాలని మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావు కోరారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసి పార్టీ సభ్యులుగా చేర్పించాలన్నారు. బుధవారం బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ ఆధ్వర్యంలో.. అనంతరాంనగర్ కాలనీలో చేపట్టిన భాజపా సభ్యత్వ నమోదును పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్‌లతో కలిసి ప్రారంభించాక ఆయన మాట్లాడారు. అత్యధిక క్రియాశీల సభ్యులున్న రాజకీయ పార్టీగా.. భాజపా దేశంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు. నేతలు రమేష్‌యాదవ్, పవన్‌రెడ్డి, శ్యామ్ రాజ్, నాగభూషణంచారి, అవినాష్, వెంకటస్వామిగౌడ్, నాగరాజుచారి, శ్రీధర్‌గౌడ్, ఎస్ఎస్‌రెడ్డి, బాలు, రాజేష్, మనోజ్, కిషోర్‌యాదవ్, జగన్‌యాదవ్ పాల్గొన్నారు.

★ భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రేమ్‌నగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. నేతలు భాస్కర్‌రావు, నర్సింగ్, నాగేష్, శివ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త వ్యక్తుల కదలికలపై కన్నేయండి: సీపీ


ఎస్బీ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీవీ ఆనంద్

ఈనాడు, హైదరాబాద్: పోలీసుశాఖలో నిఘావిభాగం కీలకపాత్ర పోషిస్తుందని నగర సీపీ సీవీ ఆనంద్ అన్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తుగా అప్రమత్తం చేయటంలో నిఘా అధికారులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని స్పష్టంచేశారు. బంజారాహిల్స్ పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో శుక్రవారం స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. నగరానికి వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చే కొత్త వ్యక్తుల కదలికలపై మరింత నిఘా ఉంచాలని ఆదేశించారు. హోటళ్లు, కాలనీలు, బస్తీల్లోకి చేరే కొత్త వ్యక్తుల సమాచారం ఎప్పటికప్పుడు అందేలా స్థానికంగా వ్యవస్థను బలోపేతం చేసుకోవాలన్నారు. నిఘావిభాగం అనేది ప్రత్యేక వ్యవస్థగా పనిచేయాలన్నారు. అధికారుల మారిన వెంటనే పనితీరు మారకూడదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఒకే విధమైన పనితీరుతో విధులు నిర్వర్తిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు తమ పరిధిలోని అని ప్రాంతాలపై అవగాహన పెంచుకొని, అప్రమత్తంగా ఉన్నపుడు అక్కడ జరిగే అవాంఛనీయ ఘటనలను కట్టడి చేయగలరన్నారు. ఇతర విభాగాల నుంచి నిఘాలో విధులు నిర్వర్తించేందుకు వచ్చే అధికారులను తగినంత శిక్షణ అవసరమన్నారు. పాస్‌పోర్టు పరిశీలనలో నిజాయితీగా, ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పనిచేస్తే గుర్తింపు వస్తుందన్నారు. సమావేశంలో ఎస్బీ డీసీపీ ఎస్.చైతన్యకుమార్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణితో 'పట్టాదారు పాస్ పుస్తకం' వచ్చింది


పాస్ పుస్తకాన్ని చూపుతున్న రుక్మిణి, చిత్రంలో దివ్య దేవరాజన్, డా.చిన్నారెడ్డి తదితరులు

సోమాజిగూడ: ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంతో అనేక సమస్యలు పరిష్కారం అవుతున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.జి.చిన్నారెడ్డి పేర్కొన్నారు. అనేక పర్యాయాలు అధికారుల చుట్టూ తిరిగి, చివరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారమైందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, ఘట్‌కేసర్ మండలం. ఏదులాబాద్ గ్రామానికి చెందిన రుక్మిణి శుక్రవారం ప్రజాభవన్‌కు వచ్చి సంతోషం వ్యక్తం చేశారు. ధరణి తప్పిదాల వల్ల తన 16 గుంటల భూమికి పట్టా ఇవ్వలేదని, మూడేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ప్రజావాణిలో దరఖాస్తు చేయగా, మూడునెలల్లోనే పట్టాదారు పాసు పుస్తకం వచ్చిందని తెలిపారు.

627 అర్జీలు: ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి శుక్రవారం 627 అర్జీలు అందాయి. అధికంగా ఇళ్ల కోసం 185 రాగా, సాంఘిక సంక్షేమ శాఖ-108, రెవెన్యూ-60, విద్యుత్-57, ఎన్ఆర్ఐ విభాగం-4, ఇతర శాఖలకు 213 వచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటిని పరిష్కరించాలని చిన్నారెడ్డితో పాటు నోడల్ అధికారి దివ్య అధికారులకు సూచించారు.

కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న నూతి శ్రీకాంత్‌గౌడ్

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: కల్లుగీత వృత్తిలో మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం సుందరయ్య కళానిలయంలో కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) 67వ వార్షికోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కల్లుగీత వృత్తి పరిరక్షణతో యువత సహా గీత కార్మికులకు మేలు జరుగుతుందని చెప్పారు. తాడి, ఈత వనాల పెంపునకు సైతం చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నీరా పరిశ్రమ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలూ మెరుగుపడతాయన్నారు. ఎన్నికల హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. టాడి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పల్లె రవికుమార్ మాట్లాడుతూ.. గీత కార్మికులకు రక్షణ పరికరాలు, ద్విచక్రవాహనాలను అందజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గీత కార్మికుల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలను రూపొందించడంతోపాటు న్యాయమైన డిమాండ్లనూ ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. సమగ్ర కులగణనతో బీసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. తొలుత సంఘం జెండాను వారంతా ఎగురవేశారు. గౌడ సంఘాల నేతలు బాలరాజుగౌడ్, సదానంద్, విజయ్‌కుమార్‌గౌడ్, నారాయణ పాల్గొన్నారు.


అశోక్‌నగర్ వీధిలో ర్యాలీగా వస్తున్న నిరుద్యోగులను అడ్డుకుంటున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య


తమకు న్యాయం చేయాలని కోరుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాస్కులు ధరించిన గ్రూప్స్ అభ్యర్థులు

మూడోరోజూ కొనసాగిన నిరసనలు

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల వాయిదాతోపాటు జీవో నం.29ను రద్దు చేయాలని కోరుతూ సంబంధిత అభ్యర్థులు చేపట్టిన నిరసనలు మూడోరోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. అశోక్‌నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ ర్యాలీలు, నిరసనలు చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. వారిని అదుపులోకి తీసుకున్నాక నగరంలోని వివిధఠాణాలకు తరలించారు.
- న్యూస్‌టుడే, గాంధీనగర్, ముషీరాబాద్,


గాంధీనగర్‌లో అభ్యర్థులకు మద్దతుగా నిరసనలో కూర్చున్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

దీపావళి పండగ.. మట్టి పాత్రలు సిద్ధంగా



వెలుగుల పండగ దీపావళి సమీపిస్తోంది. పర్వదినం రోజున నగరవాసుల్లో చాలామంది.. తమ ఇళ్లలో నోములు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. సంబంధిత కార్యక్రమాల్లో వినియోగించే చిన్నపాటి కుండలు, ప్రమిదలు సహా ఇతర మట్టి(మృణ్మయ)పాత్రలు అంబర్‌పేటలోని కుమ్మరి బస్తీలో సిద్ధమవుతున్నాయి. మట్టి కుండలను తయారుచేశాక స్థానిక మహిళ ఒకరు వాటిని ఆరబెడుతూ శుక్రవారం ఇలా కనిపించారు.

కాలానుగుణంగా శాస్త్రీయ నృత్యంలో మార్పులు అవసరం


ప్రసన్నరాణికి జ్ఞాపిక ప్రదానం చేస్తున్న వేణుగోపాలచారి

గాంధీనగర్: మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్రీయ నృత్యంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరముందని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి సూచించారు. నృత్యంపై నేటి తరానికి ఆసక్తి కలిగించేలా సంబంధిత మార్పులు ఉండాలన్నారు. శుక్రవారం రాత్రి నృత్యకిన్నెర సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో.. ప్రముఖ నాట్యాచార్యులు వేదాంతం జగన్నాథశర్మ వర్ధంతి సందర్భంగా జరిగిన పురస్కార ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అనంతరం కూచిపూడి నృత్యగురువు ఆర్.ప్రసన్నరాణికి జగన్నాథశర్మ స్మారక పురస్కారాన్ని అందజేసి సన్మానించారు. సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు రాజగోపాల్, ఉషాగాయత్రి, రఘురాం పాల్గొన్నారు.

గోసంరక్షణకు ప్రజలు ఉద్యమించాలి


హాజరైన జస్మత్‌పటేల్, రితీష్ జాగిర్దార్, శశికళ, సూర్యప్రకాష్

కాచిగూడ: గోసంరక్షణకు ప్రజలు ఉద్యమించాలని తెలంగాణ గోసంరక్షణ సంస్థలు పిలుపునిచ్చాయి. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం తెలంగాణ లాఫర్‌కో ఫౌండేషన్ ఛైర్మన్ జస్మత్‌పటేల్, ప్రాణమిత్ర రమేష్ జాగిర్దార్ మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి రితీష్ జాగిర్దార్ తదితరులు కాచిగూడ నుంచి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్దకు ర్యాలీ నిర్వహించారు. శశికళ, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వ్యర్థాలు.. వాహనదారులకు ఇక్కట్లు



రాంనగర్ చౌరస్తా నుంచి రాంనగర్ గుండు ప్రాంతం వరకు రహదారిపై ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగిపొర్లడంతో జలమండలి సిబ్బంది అక్కడికి చేరుకుని.. వాటి నుంచి వ్యర్థాలను వెలికితీసి రోడ్డుపైనే కుప్పలుగా పోశారు. సకాలంలో వాటిని తరలించకపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. చిత్తడిగా ఉన్న వ్యర్థాల పైనుంచి రాకపోకలు సాగించాల్సివస్తుండటంతో.. అదుపు తప్పి ప్రమాదాలబారినపడుతున్నామని ద్విచక్రవాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. –న్యూస్‌టుడే, రాంనగర్

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ సీబీడీ కార్యాలయం పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఏడీఈ సీబీడీ జి.నాగేశ్వర్‌రావు తెలిపారు. ● ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు.. 11కేవీ డీడీ కాలనీ పరిధిలో డీడీ కాలనీ, ఏ అండ్ బీ లైన్, రామచంద్రయ్య డిగ్రీ కళాశాల, గ్లాస్కో, హిటాన్ కేఫ్ పరిసర ప్రాంతాలు. ● మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు.. 11కేవీ పటేల్‌నగర్ ఫీడర్ పరిధిలో పటేల్‌నగర్, కృష్ణానగర్, అంబేద్కర్‌నగర్, ఆజాద్‌నగర్, వడ్డెరబస్తీ పరిసర ప్రాంతాలు.

వీధి దీపాలకు మరమ్మతులు

ముషీరాబాద్: భోలక్‌పూర్, గాంధీనగర్ డివిజన్లలోని వెలగని వీధిదీపాలకు రెండోరోజైన శుక్రవారం కూడా జీహెచ్‌ఎంసీ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 16న 'వెలగని వీధిదీపాలు.. అంధకారంలో వీధులు' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు.. సిబ్బందితో స్ట్రీట్‌లైట్ల మరమ్మతు పనులు చేయిస్తున్నారు. భోలక్‌పూర్‌లోని పద్మశాలికాలనీ, గాంధీనగర్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో.. వీధి దీపాల నిర్వహణ ఏఈ అనూష పర్యవేక్షణలో సంబంధిత పనులు కొనసాగాయి.

రేపు చెస్ టోర్నీ

హైదరాబాద్, ఈనాడు: వారాస్ చెస్ అకాడమీ ఆదివారం హైదరాబాద్‌లో అంతర్జాతీయ ర్యాపిడ్ ఫిడె రేటింగ్ చెస్ టోర్నీ నిర్వహించనుంది. ఆదర్శ్ నగర్‌లోని జీపీ బిర్లా సెంటర్‌లో పోటీలు జరుగుతాయి. టోర్నీ ప్రైజ్ మనీ రూ.3 లక్షలు. వివరాలకు 8187093036 నంబర్లో సంప్రదించవచ్చు.

ఉప్పల్

•ఉప్పల్ •మేడ్చల్

ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత

ఏఎస్‌రావునగర్, న్యూస్‌టుడే: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా పాలన సాగుతుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఏఎస్ రావునగర్ డివిజన్‌లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు చేసేందుకు సమావేశం జరిగింది. పలువురు నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందముల పరమేశ్వర్ రెడ్డి

ప్రజావాణితో 'పట్టాదారు పాస్ పుస్తకం' వచ్చింది

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంతో అనేక సమస్యలు పరిష్కారం అవుతున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి పేర్కొన్నారు. అనేక పర్యాయాలు అధికారుల చుట్టూ తిరిగి, చివరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారమైందని ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ గ్రామానికి చెందిన రుక్మిణి శుక్రవారం ప్రజాభవన్‌కు వచ్చి సంతోషం వ్యక్తం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం),

న్యూస్‌టుడే: మేడ్చల్,కీసర,ఘట్‌కేసర్, బోడుప్పల్, నాగారం

? కీసర బస్టాపులో ఆటోలు, పూలు, పండ్లు విక్రయించే తోపుడు బండ్లు ఆక్రమించడంతో బస్సుల కోసం నిరీక్షించే విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
– శ్రీనివాస్, కీసర

✓ సమస్యను కొత్తగా వచ్చిన కీసర ట్రాఫిక్ ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లి బస్టాపులో ఆటోలు, తోపుడు బండ్లు పెట్టకుండా చర్యలు తీసుకుంటాం. – వెంకటయ్య, సీఐ, కీసర

? మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా మలుపు వద్ద మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. – క్రిష్ణమూర్తి మేడ్చల్

✓ మురుగు సమస్య లేకుండా చేస్తాం
– నాగిరెడ్డి, కమిషనర్ మేడ్చల్ మున్సిపాలిటీ

? బోడుప్పల్ నగర పాలక సంస్థ ఆంజనేయ నగర్‌కాలనీలో మురుగు రోడ్డుపైకి వస్తోంది.
–సుదీప్‌రెడ్డి, ఆంజనేయనగర్ కాలనీ, బోడుప్పల్.

✓ రోడ్డుపై పారుతున్న మురుగుకు అడ్డుకట్టవేస్తాం. –నారాయణరెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, బీఎంసీ.

? దమ్మాయిగూడ పీఎస్‌రావ్‌నగర్, లక్ష్మినగర్ రోడ్డు నంబర్ -19లో ఇళ్ల నుంచి నీరు రావడంతో ఇబ్బందిగా ఉంది.
– ఐ.ఎన్.శాస్త్రి, లక్ష్మినగర్, దమ్మాయిగూడ

✓ కింద ఉన్న ఇళ్లను పరిశీలించి పరిష్కారం చూపుతాం
– చిరంజీవులు, డీఈఈ, దమ్మాయిగూడ

? నేతాజీనగర్ రోడ్డు నంబర్ -7లో వీధి దీపం వారం రోజులుగా వెలగడం లేదు
– సురేష్ , నేతాజీనగర్, నాగారం

✓ సమస్యను పరిశీలించి పరిష్కారం చేస్తాం
– రవి, విద్యుత్తు సహాయాధికారి, నాగారం

మొక్కలు తీసి.. బోసి పోయి



మూసీపై ఉప్పల్-నాగోల్ రహదారి వంతెనకు ఇరువైపులా కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఫ్రేములు ఏర్పాటు చేసి మొక్కలు పెట్టారు. కొద్ది రోజులు బాగున్నా నిర్వహణ లోపంతో మొక్కలు పాడై పోయాయి. మళ్లీ వాటి స్థానంలో కొత్త మొక్కలు పెట్టలేదు. దాంతో ఆ ప్రాంతమంతా బోసిపోయి ఉంది.

శిరస్త్రాణం.. పెట్టుకోవట్లే..!

● తలకు మించిన భారమని వదిలేసి.. ● ప్రమాదాల బారిన పడుతున్న యువత ● 9 నెలల్లో 2.19 లక్షల కేసులు

ఉప్పల్ ప్రాంతంలో నమోదైనవే..

నెల..	కేసులు..
జనవరి	28,309
ఫిబ్రవరి	27,930
మార్చి	26,753
ఏప్రిల్	24,950
మే	23,244
జూన్	23,278
జులై	11,123
ఆగస్టు	25,669
సెప్టెంబర్	28,408

న్యూస్‌టుడే, హబ్సిగూడ

రోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని అనుకోని ప్రమాదాలైతే.. మరికొన్ని నిర్లక్ష్యంతో జరిగేవి. చాలామంది ప్రాణాలు కోల్పోవడానికి శిరస్త్రాణం ధరించకపోవడమే. ఇలాంటి మరణాలను తగ్గించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా తగ్గుముఖం పట్టడం లేదు. శిరస్త్రాణం లేకుండానే కొందరు వాహనచోదకులు రాకపోకలను కొనసాగిస్తున్నారు. మరికొందరు యువకులు, మహిళలు శిరస్త్రాణం అంటే తలకు మించిన భారంగా భావిస్తున్నారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో శిరస్త్రాణం లేకపోవడంతో జరుగుతున్నవేనని పోలీసులు వీరిని లక్ష్యంగా చేసుకొని కేసులను నమోదు చేస్తున్నారు.



వెనక కూర్చున్నా ప్రమాదమే

ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి..

● రామంతాపూర్ నుంచి ఉప్పల్ క్రాస్ రోడ్డు వరకు..
● హబ్సిగూడ ఐఐసీటీ నుంచి మల్లాపూర్..
● ఉప్పల్ క్రాస్ రోడ్డు నుంచి నల్లచెరువు..
● హబ్సిగూడ ఎన్‌జీఆర్ఐ నుంచి నాగోల్ మెట్రో యూటర్న్ వరకు..



శిరస్త్రాణం లేని వాహనచోదకులు

బతికి ఉండాలంటే శిరస్త్రాణం పెట్టుకోవాల్సిందే..

– లక్ష్మిమాధవి, ట్రాఫిక్ సీఐ, ఉప్పల్



వాహనచోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాల్సిందే. పోలీసులను చూసి భయపడి హెల్మెట్ పెట్టుకోవద్దు. మీరు, మీ కుటుంబ సభ్యులు బాధపడకుండా ఉండాలంటే కచ్చితంగా ధరించాలి. విద్యా సంస్థల్లో శిరస్త్రాణం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే

ఇళ్లల్లోనే తడి, పొడి చెత్త వేర్వేరు డబ్బాల్లో వేసి ఇవ్వాలని స్వచ్ఛభారత్ మిషన్‌లో ఐదేళ్లుగా అవగాహన కల్పిస్తున్నా పౌరుల్లో మార్పు ఇంకా పూర్తిస్థాయిలో కనిపించడంలేదు. పురపాలికల్లో 40 శాతం ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో స్వచ్ఛ ఆటోలకు ఇస్తున్నారు. 60 శాతం మంది నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో డంపింగ్ యార్డుల్లో చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు, బయోమైనింగ్ నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఇంటి నుంచే మొదలు

● స్వచ్ఛ ఆటోలతో పాటు ఇళ్ల వద్దకు వెళుతున్న శానిటరీ సిబ్బంది చెత్తను ఒకే బుట్టలో వేసుకొని వస్తున్న గృహిణులకు అవగాహన కల్పించాలి.

● తడి.పొడి చెత్తను ఎలా వేరుచేయాలో ప్రత్యక్షంగా చూపించాలి. భూమిలో కలిసి పోయే కూరగాయల వ్యర్థాలు, పండ్ల తొక్కలు, కుళ్లిన పండ్లు ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలను ఒక బుట్టలో వేయాలని చెప్పాలి. తిరిగి వినియోగించేందుకు ఉపయోగపడే కాగితాలు, అట్టలు, గాజు ప్లాస్టిక్ సీసాలు డబ్బాలు, ఇనుప ముక్కలు మరో బుట్టలో వేయాలని చేసి చూపించాలి.

● ఇంట్లో సేకరించే చెత్తచెదారాన్ని రోడ్డుపై, ఇంటి పక్కన ఖాళీ స్థలంలో ఎక్కడ పడితే అక్కడ వేస్తే.. పరిసరాలు అపరిశుభ్రతగా మారుతాయి. దోమలు, కుక్కల బెడద పెరిగిపోయి ఇబ్బందులు పడాల్సి వస్తుంది.



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మున్సిపాలిటీలు	వార్డులు	జనాభా (లక్షల్లో)
ఘట్‌కేసర్	18	0.50
పోచారం	18	0.60
నాగారం	20	1.20
దమ్మాయిగూడ	18	1.10
తూంకుంట	16	0.45
మేడ్చల్	23	1.10
గుండ్లపోచంపల్లి	15	0.50

మూడోసారి అవార్డుకు ప్రయత్నం

–ముల్లిపావనియాదవ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్, ఘట్‌కేసర్

ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి వరసగా రెండు సార్లు స్వచ్ఛ సర్వేక్షణ్ జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయి. మూడోసారి కూడా అవార్డు కోసం అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు కలిసి పని చేస్తున్నాం. తడి,పొడి చెత్తపై కాలనీవాసులు, కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ఉపకార వేతనాల బకాయిలు విడుదల చేయాలి

పీర్జాదిగూడ(బోడుప్పల్),న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ విద్యార్థులు శుక్రవారం వరంగల్ జాతీయ రహదారి పీర్జాదిగూడలో ధర్నానిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కార్తీక్ హాజరయ్యారు.



దిష్టిబొమ్మ దహనం చేసిన విద్యార్థులు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..:మల్లారెడ్డి

ఘట్‌కేసర్,న్యూస్‌టుడే: భారాస కార్యకర్తలు అధైర్యపడకుండా ఉండండి.. అండగా ఉంటామని ఎమ్మెల్యే మల్లారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. అనంతరం ఇటీవల మరణించిన పార్టీ కార్యకర్త డ్యాగాల రమేష్ కుటుంబ సభ్యులకు పార్టీ తరపున రూ.2లక్షల బీమా చెక్కును అందజేశారు.



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

వైద్య విద్యార్థులకు చేయూత

నాచారం, న్యూస్‌టుడే: వైద్య విద్యకు బీఎల్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అందజేస్తున్న ఆర్థికసాయాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. మల్లాపూర్ ఎస్వీనగర్‌కు చెందిన సీతల అఖిల, గ్రీన్‌హిల్స్ కాలనీకి చెందిన జీవన్ కుమార్ ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించారు. వారి చదువులకు అయ్యే ఫీజుల చెక్కును ట్రస్టు ఛైర్మన్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి హరీశ్‌రావు శుక్రవారం వైద్య విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భారాస మల్కాజిగిరి పార్లమెంట్ బాధ్యుడు రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

విద్యార్థినికి అభినందనలు

ఉప్పల్: ఎంబీబీఎస్‌లో సీటు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచిన చిలుకానగర్‌కు చెందిన ఓర్సు నందినిని శుక్రవారం మాజీ మంత్రి హరీశ్‌రావు అభినందించారు.

భూల్ భూలయ్యా 3 చిత్ర బృందం సందడి

మేడ్చల్,: 'భూల్ భూలయ్యా 3' చిత్ర బృందం శుక్రవారం గుండ్లపోచంపల్లి డీఆర్ఎస్ పాఠశాలలో సందడి చేసింది. సినీనటుడు కార్తీక్ ఆర్యన్ విద్యార్థులతో కలిసి హడావుడి చేశారు. విద్యార్థులు నిర్వహించిన ఫ్లాష్ మాబ్‌లో స్టెప్పులతో అలరించారు.



ప్రతి గింజ కొంటాం..!

శామీర్‌పేట, న్యూస్‌టుడే: రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీసీఎమ్మెస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వైస్ ఛైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం శామీర్‌పేట వ్యవసాయదారుల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్, ఉద్దెమర్రి, కేశ్వాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దళారుల నుంచి రైతులను కాపాడేందుకు గిట్టుబాటు ధరను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీవో టి.వెంకట్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ వైస్ చైర్మన్,డీసీవో

స్వచ్ఛ బోడుప్పల్ ఇలాగేనా..?



బోడుప్పల్, న్యూస్‌టుడే: బోడుప్పల్‌లో దారి పొడవునా చెత్తకుప్పలు దర్శన మిస్తున్నాయి. ఆ కుప్పల వద్ద పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. స్వచ్ఛ బోడుప్పల్ దిశగా అడుగులు వేస్తున్నామని పాలకవర్గం చెబుతున్నా ఎక్కడా కనిపించడం లేదు.

ఆరోగ్య సంరక్షణకు ధరలు అందుబాటులో ఉండాలి

శామీర్‌పేట, న్యూస్‌టుడే: నాణ్యమైన ఆరోగ్య సంరక్షణకు బాధ్యత వహిస్తూనే.. అందరికీ అందుబాటులోకి వివిధ సేవల ధరలను తగ్గించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలం తూంకుంట పుర పాలికలో ది అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా సౌత్‌జోన్ (ఏఓఐఎస్‌జెడ్) ఆధ్వర్యంలో ఈఎన్‌టీలో అధునాతన పురోగతులపై మూడు రోజుల పాటు చర్చించే సౌత్ జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా వచ్చి, జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈకాన్ఫరెన్స్ విద్యాపరమైన ప్రయత్నం కాదు.. అత్యున్నత విజ్ఞాన వేడుకగా అభివర్ణించారు. ఈ వైద్య సేవల్లో శస్త్ర చికిత్స నిపుణుల సామర్థ్యానికి మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. న్యూరో, ప్లాస్టిక్ సర్జరీలతోపాటు తల, మెడ శస్త్ర చికిత్స వంటి సూపర్ స్పెషాలిటీల్లో వైద్య సేవలు పొందేందుకు అనుమతిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ వైద్య కేంద్రంగా మారి నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలపాటు విదేశాల నుంచి రోగులు వైద్య సేవలు పొందేందుకు వస్తున్నారని తెలిపారు. ది అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా సౌత్‌జోన్ ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ డీఎస్.దీనదయాళ్ మాట్లాడుతూ..ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని, ఏఐతో ఆరోగ్య సంరక్షణ విప్లవాత్మకంగా మార్చబోతున్నట్లు వివరించారు. ఈసమావేశంలో ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ జోన్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్.ఎన్.వెంకట్‌రెడ్డి, సమన్వయకర్త డాక్టర్.డి. ద్వారకానాథ్‌రెడ్డి, కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ వైస్ ఛాన్సలర్ కరుణాకర్‌రెడ్డి, వైద్యులు ఆనంద్ ఆచార్య, డి.శేఖర్‌రెడ్డి, ఆర్.రమేశ్, ఏఓఐ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ రణబీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, పక్కన వైద్యులు

చిన్నారులను భాగస్వాములను చేస్తే బాగు

అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబురాల్లో విద్యార్థులను భాగస్వాములు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో చెకుముకి సంబురాల గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సమాజంలో శాస్త్ర ప్రచారం, శాస్త్ర దృక్పథం పెంపొందించడంలో జన విజ్ఞాన వేదిక కృషి అభినందనీయమని ప్రశంసించారు. విద్యార్థుల్లో బాల్యదశ నుంచే మూఢనమ్మకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాధికారిణి ఐ.విజయకుమారి, జనవిజ్ఞాన వేదిక పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య బీఎస్.రెడ్డి, ఎం.శ్రీనివాస్, జెన్నీ, రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

బయటకెళ్లి తిరిగి రాలె..

మేడిపల్లి (బోడుప్పల్),న్యూస్‌టుడే :ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి తిరిగి రాలేదు. బోడుప్పల్ టెలిఫోన్‌కాలనీలో నివాసం ఉండే ఎం.చంద్రశేఖర్(39) వ్యాపారి. భార్య, ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటున్నాడు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

ఉప్పల్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలను చోరీచేస్తున్న దొంగను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేశారు. సంగారెడ్డి జిల్లా, కోహీర్ మండలం బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన బత్తిని నరేష్(27) అంబర్‌పేటలో ఉంటూ రాపిడో రైడర్‌గా పని చేస్తున్నాడు. గత కొంత కాలంగా పార్కింగ్ చేసిన వాహనాలను చోరీ చేస్తూ తప్పించుకు తిరుగుతున్నాడు. ఈనెల 15న బోడ భద్రుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లాడు. శుక్రవారం వాహనాల తనిఖీల్లో నరేష్‌ను అరెస్టు చేసి విచారించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పటాన్‌చెరు-2, చిలకలగూడ-1, ఉప్పల్-1 చొప్పున ద్విచక్ర వాహనాలను దొంగలించాడు. రూ.2.40 లక్షల విలువైన నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

వైద్యుల నిర్లక్ష్యంతో మృతి పోలీసులకు ఫిర్యాదు

ఏఎస్‌రావునగర్, న్యూస్‌టుడే: వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ మరణించిందని మృతురాలి కుటుంబసభ్యులు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మదాపూర్ గ్రామానికి చెందిన నికిత (23) ఈ నెల 16న ఛాతిలో నొప్పి వస్తోందని ఈసీఐఎల్‌లోని ఓ ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి ఎలాంటి ప్రాణహాని లేదని చెప్పారని, ఆరోగ్యశ్రీ వస్తోందని కాలయాపన చేయడంతో నికిత మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అంజయ్య తెలిపారు.

ట్రాన్స్‌జెండర్ బలవన్మరణం

జవహర్ నగర్: కుటుంబ కలహాలతో వివాహిత (ట్రాన్స్‌జెండర్)ఆత్మహత్య చేసుకుంది. జవహర్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....2012లో బాలమణి, సంతోష్ అలియాస్ సరితను వివాహం చేసుకున్నారు. వారికి 8 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. నాలుగేళ్ల క్రితం సంతోష్ ట్రాన్స్‌జెండర్‌గా మారి అతడి పేరును సరితగా మార్చుకున్నాడు. కొన్నిరోజులుగా కుటుంబ సభ్యులతో గొడవలు జరుగుతుండటంతో భార్య కుషాయిగూడలోని తల్లి ఇంటికి వెళ్లిపోయింది. శుక్రవారం భార్యకు వీడియో కాల్ చేసి తాను చనిపోతున్నట్లు చెప్పాడు. ఆమె వెంటనే ఇంటి పక్కనే ఉండే వ్యక్తికి ఫోన్ చేసి అప్రమత్తం చేశారు. వాళ్లు వెళ్లి చూసేసరికి సంతోష్(సరిత) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

హబ్సిగూడ: ప్రాంతాలు: రామంతాపూర్ డివిజన్‌లో టీవీ కాలనీ, గాంధీనగర్, నేతాజీనగర్, అరవిందనగర్, శ్రీరమణపురం, చర్చికాలనీ, శ్రీరామకాలనీ, జనప్రియ, శాంతినగర్, భరత్‌నగర్ తదితర కాలనీలు **ఉదయం** 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు...


ఈఎంఆర్ఐ 108లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

శామీర్‌పేట, న్యూస్‌టుడే: తూంకుంట పుర పాలిక దేవరయాంజాల గ్రామ పరిధిలోని జీవీకే ఈఎంఆర్ఐ 108 గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ప్రధాన కార్యాలయంలో మొబైల్ సర్వీస్ వాహనం, వర్క్ షాప్‌లో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు రెండేళ్ల అనుభవం కలిగిన ఆసక్తి గల అభ్యర్థుల నుంచి నేరుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐ విద్యార్హతకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలతోపాటు జిరాక్స్‌తో ఈనెల 21 నుంచి 26వరకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4వరకు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

గుండెపోటుతో విశ్రాంత న్యాయమూర్తి మృతి

నాచారం, న్యూస్‌టుడే: నాచారం రవీంద్రనగర్ కాలనీలో ఉంటున్న విశ్రాంత న్యాయమూర్తి తోట అశోక్‌కుమార్(75) గుండెపోటుతో మృతి చెందారు. సెషన్స్ జడ్జిగా పదవీ విరమణ పొందారు. శుక్రవారం లాలాపేటలోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

కీసరగుట్టకు శైవక్షేత్రంలో అఘోరి



కీసర: కీసర గుట్ట రామలింగేశ్వరస్వామి సన్నిధికి శుక్రవారం అఘోరి వచ్చింది. గర్భాలయంలో కొలువుదీరిన శ్రీరామలింగేశ్వరస్వామికి స్వయంగా భస్మాభిషేకం చేశారు. అనంతరం ఆలయానికి ఎదురుగా ఉన్న శివలింగాలకు పూజలు చేసి, ఒంటి కాలిపై నిలబడి ప్రార్థించారు. ఆమెది ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లి ప్రాంతం. దేవాలయాలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణలోని శైవక్షేత్రాలను సందర్శించి పూజలు చేస్తున్నట్లు పేర్కొంది.

రహదారుల సొగసు చూడతరమా..!

● గోతులతో ప్రజల అవస్థలు ● బోడుప్పల్, పీర్జాదిగూడ నగరాల్లో దారుణం

న్యూస్‌టుడే: బోడుప్పల్

నగరాలన్నట్టేగానీ ఏ ఒక్క రహదారిపై సరిగా ప్రయాణం చేసేలా లేవు. వర్షాలు పడిన రోజుల్లో నీళ్లు ఉన్నాయని ఆగారు..ఇప్పుడేమో గుంతల రోడ్లకు మరమ్మతులు చేయడం మరచిపోయారు. ఏటా రహదారుల అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చుచేస్తున్నా ఏ రోడ్డు బాగా లేదు. బోడుప్పల్, పీర్జాదిగూడ జంట నగరాల్లోని పలు అంతర్గత రోడ్లు పూర్తిగా గోతులు పడి ఇబ్బందికరంగా ఉన్నాయి.



పీర్జాదిగూడ -పర్వతాపూర్ రోడ్డు

మూడు నెలల్లో పూర్తి చేస్తాం :

– బీఎంసీ మేయర్ అజయ్‌యాదవ్.

బోడుప్పల్‌లో రహదారుల అభివృద్ధికి రూ. 30 కోట్లు ఖర్చుచేస్తున్నాం. రోడ్ల పనులు ప్రారంభించాం. మూడు నెలల్లో పూర్తి చేస్తాం.

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో డివిజన్లు	28
రహదారుల విస్తీర్ణం	128 కి.మీ
జనాభా	సుమారు 2.50 లక్షలు.
పీర్జాదిగూడ నగర పాలక సంస్థలో డివిజన్లు	26
జనాభా	1.50 లక్షలు .
రహదారుల విస్తీర్ణం	160 కి.మీ



మేడిపల్లి రోడ్డులో గుంతలు..

అభివృద్ధి ప్రణాళిక అమలు చేస్తాం.

– త్రిల్లేశ్వర్‌రావు, కమిషనర్ పీర్జాదిగూడ

పీర్జాదిగూడ -పర్వతాపూర్ రోడ్డు పనులకు ప్రభుత్వం రూ.27 కోట్లుమంజూరు చేసింది. నగరంలో రహదారుల అభివృద్ధికి నిధులను కేటాయిస్తున్నాం. ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేస్తాం.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



పూజలు చేస్తున్న వేదపండితులు

నాచారం, న్యూస్‌టుడే: నాచారం హెచ్ఎంటీనగర్‌లోని శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ షోడశ వార్షిక బ్రహ్మోత్సవాల అంకురార్పణ శుక్రవారం శ్రీవైఖానస సంప్రదాయం ప్రకారం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వరాచార్యులు పర్యవేక్షణలో అర్చకుల బృందం...దేవానుమాన్యత, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, దీక్షా స్వీకరణ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు... మంగళవాయిద్యాల నడుమ కాలనీ పురవీధుల్లో శ్రీవారి సేనాధిపతి ఉత్సవ ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు పి.రాంచందర్‌రావు, కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌రాజ్, గోపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శి కె.వి.శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.